1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 8
సంచిక : 11
పుటలు : 52
రు. 25లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2023

## ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ – ఫిబ్రవరి 21

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in





ఆదర్శ ఆచార్యులు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు(కె.వి)

కనువెలుగు: 1935 నవంబరు 22

కనుమరుగు: 2023 జనవరి 10




"తెలుగుకున్న వ్యాకరణ, నిఘంటు చరిత్ర ఎంత పురాతనమైన పునాదులు గలదో 'ద్రావిడ భాషాకుటుంబం' అనే ఉత్తమ భావనను రూపొందించి, దానిని తేజోవంతం చేయడంలో తెలుగు ఎలా ప్రధానమయిందీ ఈ గ్రంథం వెల్లడిస్తుంది"

"దక్షిణ భారతదేశపు సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస దశల్లో తెలుగువారు, తెలుగు ప్రాంతం నిర్వహించిన క్రియాశీలక పాత్రను కొత్తకోణం నుంచి లోకానికి వెల్లడించే ప్రయత్నంలో ఆచార్య వెంకటేశ్వర్లు కృతకృత్యులయ్యారు"

**ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యం కావాలి**



# తెలుగుభాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య 1288/2003)

# ఆహ్వానం

## ఆంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
## తెలుగుభాషోద్యమ సమాఖ్య 20వ వార్షికోత్సవం
## 2023 ఫిబ్రవరి 21 మంగళవారం
## వేదిక: పి.బి.సిద్ధార్థ కళాశాల సభామందిరం, విజయవాడ
## సాయంత్రం గం.3 నుండి గం.7 వరకు

- ‘అమ్మనుడి’ 8 ఏళ్ల సంపాదకీయాల గ్రంథం విడుదల
- తెలుగుభాషోద్యమ సమాఖ్య చేసిన కృషి, ఉద్యమ కార్యాచరణ అంశాలపై పత్రాల విడుదల
- తెలుగుభాషోద్యమ సమాఖ్య, అమ్మనుడి మాసపత్రిక వలగూడు(వెబ్‌సైట్) ప్రారంభం
- నవతరం భవిష్యత్తు కోసమే తెలుగు ఉద్యమం: సభ, ప్రసంగాలు
- తెలుగుభాషోద్యమానికి సరికొత్త కార్యక్రమ ప్రకటన

శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎం.ఎల్.సి., శ్రీ నందివెలుగు ముక్తేశ్వరరావు (విశ్రాంత ఐ.ఎ.యస్.), ఆచార్య జోగాసింగ్- పంజాబ్; ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ (హైదరాబాద్ విశ్వవిద్యాలయం),ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఆచార్య శ్రీగణేష్ తొట్టెంపూడి- జర్మనీ; డా॥ గుంటుపల్లి శ్రీనివాస్, మరికొందరు భాషోద్యమకారులు ప్రసంగిస్తారు.

పరిపాలనలోనూ, పాఠశాలలోనూ మాతృభాషతోనే ముందుకు సాగాలి. ఆ పునాదిపై ఇంగ్లీషుతో సహా అవసరమైన ఏ ఇతర భాషనైనా ఒక భాషగానే నేర్చుకోవాలి. ఇదే సరైన విధానం. సాంకేతికంగా ఉన్నత శిఖరాలను అందుకోవడానికి మాతృభాషే కీలకం. ప్రాథమిక స్థాయిలో బోధనామాధ్యమంగా ఇతర భాషలు తగవు.

**తెలుగు రాష్ట్రాలున్నది తెలుగులో పాలించుకోవడానికే.**

**‘మన భాషలో పాలించుకోలేకపోతే, మన భాషలో చదువుకోలేకపోతే తెలుగు రాష్ట్రాలు ఎందుకు ఉన్నట్లు?’**

వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాశాలల, యూనివర్సిటీల ముఖ్యులు, రచయితలు, కళాకారులు, సామాజిక నేతలు, అభ్యుదయవాదులు, జాతీయవాదులు, ప్రజాస్వామ్యవాదులు, మహిళా సంఘాలు అందరికీ ఆహ్వానం

---


డా॥ చుక్క రామయ్య, గౌరవాధ్యక్షుడు

డా॥ సామల రమేష్‌బాబు, గౌరవాధ్యక్షుడు

ఫోన్: 9848016136

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు

ఫోన్: 9866128846

ఆంధ్రప్రదేశ్ సమావేశకర్త, డా॥ వెన్నిసెట్టి సింగారావు

ఫోన్: 9393015584

తెలంగాణ సమావేశకర్త, డా॥ గంధం సుబ్బారావు

ఫోన్: 9440624678

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మనుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




ఫిబ్రవరి 2023

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. హామీపత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యం కావాలి | | 07 |
| ప్రాథమిక విద్య: | మాతృభాషలో ప్రాథమిక విద్య | అట్లూరి పురుషోత్తం | 10 |
| బడి చదువులు: | ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యతలేని... | గుంటుపల్లి శ్రీనివాస్ | 13 |
| భాషా పరిరక్షణ: | రాజ్యం-బాధ్యత-భాషా... | గారపాటి ఉమామహేశ్వరరావు | 14 |
| పురస్కారం: | భాషాశాస్త్రవేత్తకు పద్మశ్రీ | గారపాటి ఉమామహేశ్వరరావు | 15 |
| మాతృభాషా దినోత్సవం: | ఏం చేయాలి? మూలవాసుల భాషలు... | రహ్మనుద్దీన్ షేక్ | 17 |
| సాంకేతికత: | సాంస్కృతిక రక్షణలో సెమాంటి... | శ్రీగణేష్ తొట్టెంపూడి | 19 |
| సాంకేతికత: | చాట్‌జిపిటి | రహ్మనుద్దీన్ షేక్ | 20 |
| పైడి భాష: | పైడి భాష-చారిత్రక నేపథ్యం | బూసి వెంకటస్వామి | 22 |
| శ్రద్ధాంజలి: | ఆదర్శ ఆచార్యులు కె.వి గారు | కొండపల్లి సుదర్శనరాజు | 23 |
| శ్రద్ధాంజలి: | మౌలిక పరిశోధక జీవి: కె.వి. | సన్నిధానం నరసింహశర్మ | 25 |
| వారసత్వ సంపద: | ధనిక పాశ్చాత్యం-పేద ప్రాచ్యం.. | పి. శివరామకృష్ణ 'శక్తి' | 26 |
| సాంకేతికత: | తెలుగు పాఠ్య,వాగ్భాషానిధులు... | మోదుగు కాశీంబాబు | 29 |
| మన వారసత్వం: | మరుగునపడ్డ వారసత్వం | సూరియన్ కాశీపాండ్యన్ | 33 |
| రావిశాస్త్రి: | కథా'సృష్టిలో' రావిశాస్త్రి | సుంకర గోపాలయ్య | 42 |
| బాలసాహిత్యం: | బాలసాహిత్యంలో కథల పాత్ర | టి.వి.రామకృష్ణ | 44 |
| కార్టూన్ల పోటీ: | 'తానా' నిర్వహణలో తెలుగు కార్టూన్ల పోటీ | | 46 |
| చరిత్ర కాంగ్రెస్: | చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు... | | 47 |
| వెండితెర: | తెలుగుదనాన్ని నింపుకొన్న చిత్రం | పి.వి.సత్యనారాయణరాజు | 48 |
| ధారావాహిక: | అడుగుజాడలు-ఆనవాళ్లు | ఈమని శివనాగిరెడ్డి | 39 |
| కవిత: | క్షణకాలం | పాటూరి నవీన్ | 21 |


| ముఖచిత్రం | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| చిదంబరేశ్వరరావు | సరసి | బండారు రఘురాం |

ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు

**రచనలను, వార్తలను, వాట్స్‌యాప్‌లో పంపవద్దు:** 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సంII: రూ.1000, 1 సంII :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi
+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్సయాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డాII సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**

## 33వ విజయవాడ పుస్తక మహోత్సవం 2023 ఫిబ్రవరి 9నుండి 19వరకు:

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో (డా॥ రమేష్ హాస్పటల్స్ ఎదురుగా)

## తెలుగుజాతి (ట్రస్టు) 'అమ్మనుడి' పత్రిక స్టాల్‌ను దర్శించండి








4 సం॥ చందా: రూ.1000

1 సం॥ చందా: రూ.300

అమ్మనుడి చందాను స్టాల్‌లో చెల్లించి రసీదు తీసుకోండి

## ఈ క్రింది పుస్తకములు 10% రాయితీతో స్టాల్‌లో లభిస్తాయి




రు.200



రు.100




రు.300



రు.99




రు.200



# మాతృభాషకు మసక

- పాఠశాలల్లో తెలుగుకు తగ్గిన ప్రాధాన్యం
- పదేళ్లలో తొలిసారి జగన్ పాలనలో దారుణం
- అసర్ నివేదికలో ఆందోళనకర విషయాలు

అ
ఆ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మాతృభాష మసకబారుతోంది. నేటి తరం బడిపిల్లలకు తెలుగు భాషపై కనీస అవగాహన ఉండటం లేదు. చాలా మందికి అక్షరాలు, పదాలు కూడా తెలియవు. వాక్యాలు చదవలేని స్థితి. గత పదేళ్ల క్రమాన్ని పరిశీలిస్తే జగన్ ప్రభుత్వంలో తొలిసారిగా తెలుగు భాష అత్యంత దారుణ స్థితికి చేరుకుంది. తెలుగు చదవగలిగే పిల్లలు నానాటికీ తగ్గిపోతున్నారు. ఇవేవో ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలు కావు. 2022 సంవత్సరానికి గాను వార్షిక విద్యా నివేదిక (అసర్) ఈ విషయం స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో 194 ప్రాథమిక, 104 ప్రాథమికోన్నత పాఠశాలల్లో అసర్ అధ్యయనం చేసింది. ప్రధానంగా విద్యార్థులకు తెలుగుపై ఉన్న అవగాహన, చదవగల సామర్థ్యాన్ని పరిశీలించింది. మాతృభాషతో పాటు అంకెలు, లెక్కలు, ఆంగ్లం, పాఠశాలల్లో సదుపాయాలపై సర్వే నిర్వహించింది. మాతృభాషకు సంబంధించి నాలుగు స్థాయిల్లో అధ్యయనం చేసింది. మొదట అక్షరాలు... రెండో స్థాయిలో 'నేల, బండి, గౌరి, చీమ, అర, పేరు, గంట, ఊడ, సూది, ఒంటె' లాంటి రెండక్షరాల పదాలు... మూడో స్థాయిలో 'బాలబాలికలారా రారండి.. ఆటలు, పాటలు పాడండి.. పలకా, బలపం తీసుకొని రారండి.. అ ఆ ఇ ఈ రాయండి' అనే చిన్నపాటి పద్యాన్ని చదవడం.. నాలుగో స్థాయిలో సులభమైన పేరాలను చదవడంపై అధ్యయనం జరిగింది.

### ఇదీ విద్యార్థుల పరిస్థితి

- అక్షరాలను మాత్రమే చదవగలిగి రెండక్షరాల పదాలు చదవలేని వారు సగటున ఒకటో తరగతిలో 40.2 శాతం, రెండులో 36.3 శాతం, మూడులో 24.3 శాతం, నాలుగులో 14.2 శాతం, ఐదులో 10.1 శాతం, ఆరులో 7.2 శాతం, ఏడులో 4.5 శాతం, ఎనిమిదో తరగతిలో 4.1 శాతం మంది ఉన్నారు.
- మూడోస్థాయిలోని పద్యాన్ని చదవలేనివారు ఒకటో తరగతిలో 12.7శాతం, రెండులో 32.7శాతం, మూడులో 36.2శాతం, నాలుగులో 28.6శాతం, ఐదులో 21.8శాతం, ఆరులో 16 శాతం, ఏడులో 12.9 శాతం, ఎనిమిదో తరగతిలో 9.2 శాతం మంది ఉన్నారు.

## తెలుగు రాదు.. ఇంగ్లిషూ రాదు

ఇంగ్లిష్ భాష వస్తే చాలనే ధోరణితో వైసీపీ ప్రభుత్వం తెలుగు భాషను చిన్నచూపు చూస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా తొలగించింది. పిల్లలకు ఆంగ్లంపై పట్టు పెరుగుతోందని గొప్పలు చెబుతోంది. వాస్తవ పరిస్థితి చూస్తే తెలుగుతో పాటు ఇంగ్లిష్‌లోనూ విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. చివరికి విద్యార్థులు అటు మాతృభాష, ఇటు ఇంగ్లిష్ రెండింటిపైనా పట్టు లేకుండా మధ్యలో మిగిలిపోతున్నారు. పాఠశాలల్లో తెలుగు అంటే కేవలం పాస్ మార్కుల కోసమే అన్నట్టుగా పరిస్థితి మార్చేయడంతో విద్యార్థులు ఎటూ కాకుండా పోయే దుస్థితి ఏర్పడింది. సాధారణంగా మాతృభాషపై పట్టు ఉంటే ఇతర భాషలను సులభంగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో విద్యార్థులకు తెలుగే రాకపోతే ఇక ఏ భాషపై పట్టు ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

**తెలుగు ప్రభ కోల్పోతోందిలా...**

పేరాలు చదవగల విద్యార్థులు (శాతం)

| సంవత్సరం | మూడో తరగతి | ఐదో తరగతి | ఎనిమిదో తరగతి |
|---|---|---|---|
| 2012 | 28.3 | 62.4 | 88.1 |
| 2014 | 24.7 | 57.4 | 81.6 |
| 2016 | 22.6 | 55.3 | 78 |
| 2018 | 22.6 | 59.7 | 78.2 |
| 2022 | 10.3 | 36.3 | 66.5 |

**ఇదీ ఇంగ్లిష్ పరిస్థితి**

వాక్యాలు చదవగల విద్యార్థులు (శాతం)

| సంవత్సరం | ఐదో తరగతి | ఏడో తరగతి |
|---|---|---|
| 2012 | 36.8 | 75 |
| 2014 | 35.4 | 65.7 |
| 2016 | 30.3 | 63.8 |
| 2022 | 35.8 | 65.5 |

20-01-2023, ఆంధ్రజ్యోతి

---

## 'సర్దుబాటు'తో ప్రాథమిక విద్యకు దెబ్బ: అప్టా

ఉపాధ్యాయుల పని సర్దుబాటు కారణంగా ప్రాథమిక విద్య దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) ఆందోళన వ్యక్తంచేసింది. సర్దుబాటు వల్ల ప్రాథమిక విద్యకు నష్టం లేకుండా చేయాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశరావు బుధవారం విద్యాశాఖ మంత్రి, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లకు లేఖలు రాశారు. కొన్నిచోట్ల ప్రాథమిక పాఠశాలల్లోని టీచర్లంతా సర్దుబాటులో వేరే పాఠశాలలకు వెళ్లాలని ఆదేశాలు వచ్చాయని, దీంతో ఆ పాఠశాలల్లో బోధన కుంటుపడే ప్రమాదం ఉందన్నారు.

26-01-2023, ఆంధ్రజ్యోతి

సంపుటి : 8 సంచిక : 11
అమ్మనుడి
ఫిబ్రవరి 2023

సంపాదకీయం

# ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యం కావాలి

ఈ సంచికలోనే 9వ పుటలో 2013 జనవరి 1నాటి 'సాక్షి' దినపత్రిక సంపాదకీయాన్ని మీకోసం ప్రచురించాము. దయచేసి ముందుగా ఒక్కసారి దానిని చదవండి. 2012 డిసెంబరులో తిరుపతిలో కిరణ్‌కుమార్‌రెడ్డిగారి ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రకటించిన తీర్మానాలపై స్పందిస్తూ 'సాక్షి' ఎన్నో అర్థవంతమైన అంశాలను ఆ సంపాదకీయంలో ప్రస్తావించింది. ఆ సభల తర్వాత రాష్ట్రవిభజన జరిగి ఆంధ్ర, తెలంగాణాలు విడిపోయి, ఎన్నికలు జరిగిన పర్యవసానంగా 2014 జూన్ నుండీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తర్వాత 2019 జూన్‌లో వై.సి.పి. నేత జగన్మోహనరెడ్డిగారు ముఖ్యమంత్రి అయ్యారు. తన పత్రిక సాక్షి సంపాదకీయంలో వ్రాసిన దాన్ని పూర్తిగా విస్మరించి, అందుకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలో పూర్తిగా తెలుగు నిర్లక్ష్యానికి గురైంది.

తిరుపతి సభల నిర్ణయాల అమలుకై నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని చర్యల్ని ప్రకటిస్తూ ఉత్తర్వులనిచ్చినా వాటి అమలు కోసం చేసింది నామమాత్రమే. తెలుగుదేశం పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత అంతకుముందటి నిర్లక్ష్యాన్నే కొనసాగించింది. ఉద్యమకారుల వత్తిడి వల్ల కొన్ని ఉపశమన చర్యల్ని ప్రకటించినా, చిత్తశుద్ధి కరవై అవన్నీ కన్నీటి తుడుపుగానే మిగిలిపోయాయి. పరిపాలనలో తెలుగు అమలు అంశంపై ఎన్నోసార్లు మనం ఈ పత్రికలో ప్రకటించుకొన్నట్లుగా- తొలుత కాంగ్రెస్ హయాంలో జరిగినదానికంటె, ఎన్టీఆర్ హయాంలో జరిగిన అద్భుత పురోగతిని తర్వాతి పాలకులు నీరుగార్చారు. పీవీ నరసింహారావు గారి పుణ్యమా అని దేశంలోనే గొప్పగా వర్ధిల్లిన తెలుగు మాధ్యమం విషయంలోగానీ, ఒక భాషగా తెలుగును నేర్పే విషయంలోగానీ ప్రభుత్వాలు శ్రద్ధవహించలేదు. ప్రభుత్వ విద్యావిధానం అత్యంత బలహీనస్థితికి చేరుకొంది.

ప్రపంచీకరణ ప్రభావాలకు అన్ని స్థాయిల్లో లోనైన పాలకవర్గాలు, స్వాభిమానాన్ని పూర్తిగా కోల్పోయి, అవినీతిమయమయ్యాయి. ఎలాగైనా ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి రావడమే పరమ లక్ష్యంగా సాగిన అధికార, ప్రతిపక్ష పార్టీల ఆలోచనలు, విధానాలు- పైకి ఎన్ని మెరమెచ్చులు పలికినా, పూర్తిగా ప్రజాప్రయోజనాలకు దూరంగా జరిగాయి. అభివృద్ధి, ఆధునికత అనే ముసుగుల క్రింద ప్రజలను మోసగించడం కొనసాగింది. చివరకు ప్రజలకు పార్టీలపైనా, వాటి నేతలపైనా నమ్మకం పోయింది. ఆశపడటం, మోసపోవడం వారికి అలవాటైపోయింది. ఈ అవకాశాన్ని వ్యాపార వర్గాలు సొమ్ముచేసుకొంటున్నాయి. ఇందుకు ఏ రంగమూ మినహాయింపు కాదు. విద్యావ్యాపారం చేసేవారు విజృంభించారు. పాలకవర్గాలనే కొనుగోలు చేయగల స్థితికి వారు చేరుకొన్నారు. చంద్రబాబు గారి ప్రభుత్వమైనా, నేటి ప్రభుత్వమైనా వ్యాపార వర్గాల నియంత్రణలోనే ఉన్నాయి.

ఇందువల్ల విద్యారంగం పూర్తిగా ఖర్చుతో కూడినదైపోయింది. బీదలకు ప్రోత్సాహకాల పేరుతో ఓట్ల గాలం రాజకీయాలు ఆకట్టుకున్నాయి తప్ప, విద్యలో నాణ్యత అడుగంటుతున్నది. పాఠశాల స్థాయి పిల్లలు ఇందుకు ముందుగా బలి అవుతున్నారు. తెలుగు ప్రభ ఎలా కోల్పోతున్నదీ. ఇంగ్లీషు కూడా ఎలా అధోగతికి చేరుతున్నదో తెలిపే పత్రికా వార్తను ఈ ప్రక్కపుటల్లోనే చూడండి. దీనికి చికిత్స ఏమిటి? నాణ్యమైన విద్యకోసం, పేద విద్యార్థులకు కూడా విద్యను అందించడం కోసం ఏం చెయ్యాలి? ఆలోచనాపరులంతా ఆందోళన చెందుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో- వ్యవస్థల్ని పాలక వర్గాలే భ్రష్టు పట్టిస్తుండగా తెలుగు ప్రజలు తమ అస్తిత్వానికి

## సంపాదక హృదయం

నిదర్శనంగా నిలిచే కీలకమైన అంశాల్ని మరిచిపోతున్నారు. నిస్పృహతో అచేతనస్థితిలోకి వెళ్తున్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో ఉన్న మహోత్తమ లక్ష్యాలనుండి ప్రజలు దారిమళ్లించబడుతున్నారు. తెలుగు ప్రజలు స్వాభిమానానికి, జాతి పురోగతికీ మూలమైన ఆదర్శాలకు విధానాలకు దూరంచేయబడుతున్నారు. కంచే చేనుమేసిన విధంగా తయారైంది తెలుగు రాష్ట్రాల పరిస్థితి. తెలుగు వారి కోసమే తమ పార్టీ ఉందని చెప్పే తెలుగుదేశం పార్టీగానీ, తెలంగాణ ప్రజలకోసమే, భాషా సంస్కృతుల రక్షణకే తమ పార్టీ పుట్టిందని చెప్పుకొనే కె.సి.ఆర్.ప్రభుత్వంగానీ ఈ రెండు రాష్ట్రాల ప్రాణాధారమైన తెలుగుభాష రక్షణ కోసం తాము చెప్పిన వాటినే పూర్తిగా తుంగలో తొక్కాయి. ఎన్టీఆర్ ప్రకటించిన మాతృభాషా విధానాన్ని చంద్రబాబు త్రోసిరాజన్నారు. తెలంగాణాలో అధికారంలోకొచ్చిన ఎన్టీఆర్ అనుచరుడు కె.సి.ఆర్, హైదరాబాదులో జరిపిన ప్రపంచమహాసభల్లో అద్భుతాలు చేస్తామని ప్రకటించి, వెంటనే పూర్తిగా ముఖం తిప్పేశారు. ఆంధ్రలో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.ఆర్.పార్టీ, ప్రజల్లో అప్పటికే ఏర్పడ్డ నిరాశా నిస్పృహలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో తెలుగుభాషను కూడా బలిచేయడానికి సిద్ధపడి, ముందుకు సాగుతున్నది. రెండు రాష్ట్రాల్లో ఇంచుమించుగా తెలుగు విషయంలో ప్రభుత్వాల విధానాలు ఒకే విధంగా ఉన్నాయనక తప్పదు.

ఇలాంటి దశలో తెలుగునేల మీద పరిస్థితుల్ని ఎలా మెరుగుపరచాలి? ఇదీ మనం ఆలోచించాల్సిన అంశం.

పాలకవర్గాలు, పార్టీలు, ప్రభుత్వాలు ప్రజాస్వామ్యధోరణి నుంచి క్రమంగా దిగజారిపోతున్నాయని మనం గమనిస్తున్నాం. ప్రజలకు పూచీపడాలనే నిబద్ధత నుండి వారు బాగా దూరమైపోతున్నారని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. అది వారికీ తెలుసు.

ఇంకా మనం తెలుగు గొప్పదనాన్ని గురించి పదేపదే చెప్పుకోవలసిన అవసరం లేదు. మానవ సమాజాల్లో వికసించిన తోటి అమ్మనుడులను అన్నిటినీ సమభావంతో చూడడమే మన విధానం. ఇదే శాస్త్రీయమైన చూపు. ఏ భాషాజాతివారు తమ భాషను పూర్తిగా వినియోగించుకోరో అది ఎదగదు. భారత దేశంలోని భాషల విషయమైనా అంతే. నేటి సమాజ అవసరాలకు తగ్గట్లుగా- ఆధిపత్య భాషల పోటీని తట్టుకొంటూ, స్వాభిమానంతో తెలివిగా ఒక భాషాజాతిగా ఎదగడమే మన లక్ష్యంకావాలి. మనం ఆంగ్ల భాష ఆధిపత్యాన్నే కాదు, హిందీ, సంస్కృతంతో సహా ఏ ఇతర భాష ఆధిపత్యాన్నీ అనుమతించకూడదు. ఇందుకోసం ఏంచేయాలో కార్యాచరణ గురించి మాత్రమే మనం మాట్లాడుకోవాలి. రానున్న ఫిబ్రవరి 21- అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం నుండి మనం మరలా ఇందుకు అంకితం కావాలి.

మాతృభాషల రక్షణకోసం ఇప్పుడు ప్రపంచమంతటా ఉద్యమధోరణిలో ఆలోచన మొదలైంది. మన దేశంలోకూడా కొత్త గాలులు వీస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వార్తల్నీ విశేషాంశాలనీ ప్రతినెలా ఈ పత్రికలో మీరు చదువుతున్నారు. ఈ సంచికనూ శ్రద్ధగా చదవండి. ముద్రిత పత్రికగానే గాక, వలగూడు (ఇంటర్నెట్)లోనూ వస్తుంది. సమాచారాన్ని అందిస్తూ మనకొక దారిదీపంగా మరింత శక్తిమంతంగా వస్తుంది. 'అమ్మనుడి' పేరుతో పత్రిక పునర్జన్మ పొందిన తర్వాత, విజయవంతంగా 8 ఏళ్లు పూర్తి చేసుకొని, మార్చినెల నుండి 9వ ఏడులోకి ప్రవేశించబోతున్నది. అందరి సహకారాన్నీ కోరుకొంటున్నాము.

31-01-2023

సామల రమేష్ బాబు

**అమ్మనుడి** ఎనిమిదేళ్ల పత్రికల సంపాదకీయాలను ఒక పుస్తకంగా ప్రచురిస్తున్నాము. ఫిబ్రవరి 21న 'ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ సందర్భంగా' విజయవాడలో తెలుగుభాషోద్యమ సమాఖ్య నిర్వహించనున్న సభలో ఈ పుస్తకాన్ని విడుదల చేస్తాము.

## సాక్షి- 2013 జనవరి1, సంపాదకీయం

# ఇదేనా ప్రోత్సాహం!

**తె**లుగు భాషా, సంస్కృతుల వికాసమే లక్ష్యంగా మూడు రోజులపాటు తిరుపతిలో సాగిన ప్రపంచ తెలుగు మహాసభలు ముగిశాయి. సంకల్ప శుద్ధి ఉన్నప్పుడు, చేయదల్చుకున్న పనిపై అంకితభావం ఏర్పడినప్పుడు అనుకున్న లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి ఆటంకమేమీ ఉండదు. సభల నిర్వహణలో లోటుపాట్లు సంగతి అలా ఉంచితే ప్రాంగణంలో అమర్చిన భిన్న మంత్రిత్వశాఖల ప్రకటనల వరకూ అన్నీ ఆంగ్లంలోనే! రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఒక సమావేశ మందిర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే దాని శిలాఫలకం కూడా పరాయి భాషలోనే ఉంది. అలాంటప్పుడు ఈ మహాసభల అనంతరం తెలుగు ఇక వెలుగులీనుతుందని, అందుకు ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందని సామాన్యజనం నమ్మేదెలా!? తొలినాడు కళాకారులకు జరిగిన అవమానాలు, వారికి సౌకర్యాల కల్పనలో కొట్టొచ్చినట్టు కనిపించిన లోటుపాట్లు చాలామందిని బాధించాయి. తెలుగువారి ఖ్యాతిని ఎంతగానో చాటే కూచిపూడి నృత్య కళాకారులకే మహాసభల వేదికపై ప్రదర్శించే అవకాశం రాకపోవడం, వారిని పిలిచి అవమానించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచాయి. వేలాది మంది తరలివచ్చి ఒకచోట కూడినప్పుడు చిన్న చిన్న లోటుపాట్లు సహజమే అనుకున్నా లబ్ధప్రతిష్టులైనవారికే చేదు అనుభవాలు ఎదురైతే ఏమనాలి!? భాషను, సంస్కృతిని పెంపొందించడానికని నిర్వహించిన సభల్లో వివిధ ప్రాంతాల జానపద కళాకారులకు అవకాశం దక్కకపోవడం, కొన్ని జన కళారూపాలను చిన్నచూపు చూడటం ఎలాంటి సంకేతాలను పంపిస్తుందో నిర్వాహకులు గమనించకపోవడం విడ్డూరమే.

అసలు సభల నిర్వహణకు సంబంధించిన నిర్ణయమే ఆదరా బాదరాగా తీసుకున్నట్టు కనిపిస్తుంది. ఈ గడ్డపై దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత సభలు జరుగుతున్నప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. మన భాషను, మన సంస్కృతీ సంప్రదాయాలను తమ రచనలతోనూ, పరిశోధనలతోనూ, చిత్రకళా రూపాలతోనూ, జానపద రీతులతోనూ ఎంతగానో సుసంపన్నంచేసిన, చేస్తున్నవారి వివరాలను సేకరించి వారందరి కృషీ నలుగురికీ తెలిసేటట్టుచేస్తే అది ఖండాంతరాలనుంచి వచ్చిన తెలుగువారికి సైతం ఎంతో స్ఫూర్తిదాయకమయ్యేది. భాషాభివృద్ధికి ఇతర రాష్ట్రాలు ఏం చేస్తున్నాయో అధ్యయనం చేసి ఆ దిశగా మనమూ చర్యలు చేపడితే బాగుండేది. 1975లో తొలిసారి సభలు జరిగిననాటినుంచీ ఎన్నో పరిణామాలు సంభవించాయి. ముఖ్యంగా రెండేళ్ల క్రితం తెలుగు భాషకు ప్రాచీన హోదా' లభించింది. అందుకు కొనసాగింపుగా గత ఏడాది కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ మైసూరులోని భారతీయ భాషల కేంద్ర సంస్థలో తెలుగు పీఠం ఏర్పాటుకు పన్నెండో పంచవర్ష ప్రణాళికలో పదికోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. వీటన్నిటిపైనా సమగ్ర దృష్టిపెట్టి తెలుగు భాష వైభవాన్ని మరింత పెంచడానికి ఏమేం చేయాలో సూచనలు తీసుకోవాల్సింది. కానీ, ఆచరణలో అది జరగలేదు.

అలాగే, గత మూడు సభల్లో ఏయే అంశాలపై తీర్మానాలు చేశారో, వాటి అమలు తీరు ఎలా ఉన్నదో సమీక్షించాలి. అదీ లేదు. అలాంటి సమీక్షే జరిగి ఉంటే మనం ఎక్కడ విఫలమయ్యామో తెలిపేది. ప్రస్తుత సభల్లో తీసుకోబోయే నిర్ణయాల అమలుకు అవి గుణపాఠాలుగా ఉండేవి. అమ్మభాషకు అన్యాయం ఎక్కడ జరుగుతున్నదో, దాన్ని సరిచేయడానికి ఏం చేయాలో అర్థమయ్యేది. తిరుపతి సభలు ఈ దిశగా అడుగులు వేయించగలిగాయా? అనుమానమే!

ముఖ్యంగా పాలనా పరంగా అన్ని స్థాయిల్లోనూ తెలుగు భాషకు చిన్నచూపే ఎదురవుతున్నదంటే అది చిన్నమాట అవుతుంది... అది దాదాపు నిషేధానికి గురవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నిర్దిష్ట కాలపరిమితిలో తెలుగు భాషే అన్ని మంత్రిత్వ శాఖల్లోనూ ఉపయోగించేలా చర్య తీసుకుంటామని చెబితే భాషాభిమానులు సంతోషపడేవారు. ఎన్నడో 1966లోనే అధికార భాషా సంఘం ఏర్పడినా ప్రభుత్వ శాఖల్లో తెలుగు వాడకం అంతకంతకూ తగ్గుతున్నదే తప్ప పెరగడం లేదు. మాతృభాషలో చదివినవారికి కొలువుల్లో ప్రాధాన్యమిస్తామని ప్రభుత్వపరంగా హామీ లభిస్తే భవిష్యత్తుపై బెంగతో మాధ్యమం వైపు అడుగులేసి కమ్మనైన అమ్మభాషకు దూరమవుతున్న రేపటి తరానికి అది ఎంతగానో ఉపయోగపడేది. ఇలాంటివేమీ లేకుండా 2013ను తెలుగు భాష - సంస్కృతి వికాస సంవత్సరంగా ప్రకటించడం, అకాడమీల పునరుద్ధరణ, తెలుగు వికాసంకోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలాంటివి ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పినంత మాత్రాన ఒరిగేదేముంది? అకాడమీల పునరుద్ధరణ ఆశయం మంచిదే కావొచ్చుగానీ.. ఆచరణలో అలాంటివి అలంకారప్రాయాలుగా, పునరావాస శిబిరాలుగా తయారవుతాయి. మనకు తోచకపోతే కనీసం ఎదుటివారిని చూసైనా నేర్చుకోవాలి. ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు మన గడ్డపై ఉన్న తమవారికోసం ఎన్నెన్నో చర్యలు తీసుకుంటున్నాయి. మాతృభాషలో చదివే తమవారికి ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. వారికేమైనా ఇబ్బందులు ఎదురైతే ప్రభుత్వపరంగా మాట్లాడి చర్యలు తీసుకుంటున్నాయి. మన ప్రభుత్వం కూడా పొరుగు రాష్ట్రాల్లో ఉన్న తెలుగువారి కష్టనష్టాలను తీర్చడానికి తామేం చేయబోతున్నామో చెబితే ఉపయుక్తంగా ఉండేది. ముఖ్యంగా తమిళనాట, కన్నడ ప్రాంతాల్లోనూ ఉన్న మన తెలుగువారు భాషాపరంగా ఎన్నో అగచాట్లు పడుతున్నారు. ముఖ్యంగా తమిళనాడులో తమిళ మాధ్యమం తప్ప మరో భాష కుదరదంటున్నారు. అందువల్ల మన తెలుగు వారు తమ పిల్లలను తెలుగు మాధ్యమంలో చదివించుకోలేకపోతున్నారు. ఇలాంటి సమస్యలను తీర్చడానికి ముందుకొస్తే మన భాష పరిపుష్టం కావడానికి అదెంతగానో దోహదపడుతుంది. ఈ వేదికపై కనీసం ఇప్పుడు చేసిన తీర్మానాలైనా త్రికరణశుద్ధిగా అమలుచేసేందుకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని.. ఇతరత్రా వెలుగులోకొచ్చిన సమస్యల పరిష్కారానికి సైతం కృషి చేస్తుందని ఆశిద్దాం.

అట్లూరి పురుషోత్తం

# మాతృభాషలో ప్రాథమిక విద్య - ప్రజాస్వామికమునకు పట్టుగొమ్మ



మనది ప్రజాస్వామిక రాజ్యం. అబ్రహాం లింకన్ నిర్వచనం ప్రకారం ఈ రాజ్యం ప్రజలది. ఇది ప్రజల కొరకు, ప్రజలచేత పరిపాలింపబడాలి. ఇందుకు ప్రజలభాష తెలిసిన అధికారులు కావాలి. ఈ దేశంలో ప్రజలభాషలే అధికారభాషలుగా ఉండాలి. ప్రజలభాషలు అధికార భాషలుగా సఫలంకావాలంటే ప్రజలు మాతృభాషల ద్వారా చదువుకోవాలి. ఔను అని అంటూనే ఇంగ్లీషు అధికారభాషగా ఉండాలనుకొనేవారు, వాసమూర్తి చెప్పినట్లు ("భాషా సమస్య") ఆ మాటను చెప్పకుండా అధికారభాషకు ఆయువుపట్టయిన బోధనాభాషలు ప్రజల భాషలు కాకుండా చూస్తున్నారు. వీరు ఏవేవో సాకులు చెప్పి, మనదేశంలో ఇంగ్లీషు మీడియం పాఠశాలలను ప్రోత్సహిస్తున్నారు.

పరిపాలన పరభాషలో ఉన్నంతకాలం ప్రజలు పరిపాలనలో చురుకుగా పాల్గొనలేరు. పరభాష ద్వారా చదువుకున్న మైనారిటీ నిర్ణయాలే పరిపాలనను నడుపుతాయి. ఇంతేకాకుండా, పరభాష అధికారభాషగానూ బోధనాభాషగానూ బలపడి, సామాన్యుల నుండి విద్యావంతులను, పల్లె ప్రజల నుండి పట్టణవాసులనూ, పౌరుల నుండి ఉద్యోగులనూ, చేతులతో పనిచేసి వస్తూత్పత్తిని చేసే వారి నుండి మేధావులనూ, రోగుల నుండి వైద్యులనూ, కక్షిదారుల నుండి న్యాయవాదులనూ, ప్రజల నుండి ప్రణాళికా రచయితలనూ, పిల్లల నుండి పెద్దలనూ విడదీసింది.

మనదేశంలో అధికారభాషగానూ, బోధనాభాషగానూ ఉన్న ఇంగ్లీషు, ప్రభుత్వోద్యోగులను ప్రజాసేవకులుగాకాక, ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య దళారులుగా తయారు చేసింది. వీరు ఇంగ్లీషులో వ్రాసే సూచనలు, ఆజ్ఞలు ఎప్పుడూ రెండు, మూడు, అర్థాలను స్ఫురించేట్లుంటాయి. వారికి తృప్తి కలిగినప్పుడు భక్తుల కోరికల ప్రకారం వాటికి అవసరమైన వ్యాఖ్యానాలను వారే జారీచేస్తారు. లేదా వాటికి వ్యతిరేకంగా కావలసిన అర్జీలకు మాతృకలను వ్రాసియిస్తారు. ఈ పత్రాల వలన లాభనష్టాలను పొందేవారు వీరిలో ఏమి ఉన్నదో తెలుసుకోకూడదనుకుంటున్న ఈ వర్గం యింకా మనదేశంలో బలంగానే వుంది. ఈ వర్గానికి పరభాష బోధనాభాషగానూ, అధికారభాషగానూ కూడా ఉండాలి.

తల్లిదండ్రులు ఈ రహస్యాన్ని గ్రహించాలి. వీరు తమ బిడ్డలు కూడా ప్రభుత్వానికీ ప్రజలకూ మధ్య ఇంగ్లీషు నేర్చిన దళారులుగానే తయారై, ఐశ్వర్యవంతులు కావాలంటే, వీరి కోరిక నెరవేరదు. ఒకప్పుడు పాలనాభాషలైన సంస్కృతం, పరిషయన్లు ఈ రోజున పాలనాభాషలు కావు. ప్రజలు నిజంగా పాలకులైనప్పుడు ఇంగ్లీషు పాలనాభాషగా ఉండదు. ఈ స్థితి మనదేశంలో రాష్ట్రాలస్థాయిలోనైనా త్వరలో వస్తుంది.

**జాతీయవిద్య - బోధనావిద్య :**

ప్రతి దేశానికి ఒక విలక్షణమైన శీతోష్ణస్థితి ఉంది. ప్రతిజాతికి ఒక ప్రత్యేకమైన సంస్కృతి ఉంది. అట్లే ప్రతి దేశానికి ఒక జాతీయ విద్యావిధానం ఉండాలి. కాని భారతదేశం వివిధ మాతృభాషలు గల ప్రజాకూటముల ఖండం. కాగా పిల్లల భావ ప్రపంచం, వారు ఆదరించే విలువలు, వారి మాతృభాష, దానిలో ఉన్న సాహిత్యం వారికందించే భావసముదాయముపైన ఆధారపడి ఉంటాయి. కాని ఒకే భాష మాతృభాషగా గల వారిలో కొందరి పిల్లలు పరభాష ద్వారా ప్రాథమిక విద్యనభ్యసించినప్పుడు వారు మరొక భావ ప్రపంచం చేత ప్రభావితులౌతారు. తత్ఫలితంగా, సోదరి నివేదిత చెప్పినట్లు, ఒకే ప్రజా కూటమిలో రెండు భావప్రపంచాలు ఏర్పడతాయి. ఈ స్థితి ప్రజాస్వామికానికి గొడ్డలి పెట్టు.

ఈ సందర్భంలో పాఠ్యగ్రంథాల గురించి కొద్దిగా ఆలోచించాలి. జాతీయ విద్యావిధానంలో పాఠ్యగ్రంథాలు పిల్లల పరిసరాలకు సంబంధించిన భూగోళ చరిత్రాది అంశాలకు ప్రాముఖ్యాన్ని ఇవ్వాలి. కాని పాఠ్యగ్రంథాలు పరభాషలో ఉన్నప్పుడు ఈ అంశం నిర్లక్ష్యం చేయబడే ప్రమాదం ఉంది. మన నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ వారి మూడవ తరగతి (1977-78) సోషల్ స్టడీస్ ఇంగ్లీషు పుస్తకం ఇందుకు మంచి ఉదాహరణ.

ప్రతి జాతీయ విద్యావిధానం పొరుగు వారి క్షేమమే మన క్షేమమనే

విశాల దృక్పథాన్ని పెంపొందించాలి. కాని పొరుగు ప్రజల భాషను ఈసడించి, పరభాష ద్వారా చదువుకొనే పిల్లలలో ఈ దృక్పథం పెంపొందదు. పిల్లలలో విశాల దృక్పథం అంకురించి పెంపొందాలంటే వారిని తోటి ప్రజలను గురించిన ఆలోచనల్లో ముంచెత్తాలి. వారికి వారి దేశాన్ని గురించి, ఇంటా బయటా పాఠశాలల్లో కూడా చెప్పాలి. ప్రజలలో వారికి విశ్వాసం, వారిపైన వారికి ప్రేమాభిమానాలు కలిగేటట్లు చెయ్యాలి. వారికి వారి పూర్వులను గురించి, వీరులను గురించి తెలియజేయాలి. కాగా మాతృభాషలో ప్రాథమిక విద్యపై చర్యలకు తొలిమెట్టు. అందుకే జాతీయ విద్య యొక్క లక్ష్యాలలో మాతృభాష ద్వారా బోధన, జాతీయమైన ఆటపాటలను, సంగీతాన్ని పునరుద్ధరించటం సోదర మానవుల యెడల ఆదరాభిమానాలను కల్గించటం ఇమిడి ఉన్నాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, జాతీయవిద్య ప్రజల పునర్వికాసానికి తోడ్పడాలి. ఇందుకు ప్రతి భాషాకూటమికి మానవాళి యొక్క విజ్ఞానమంతా అందుబాటులో ఉండేటట్లు చూడాలి. ఇందుకు ఉద్రేకంతో కూడిన భావప్రచారం కూడా అవసరం. ప్రాథమికవిద్య మాతృభాషలో ఉన్నప్పుడే, జాతీయవిద్య పై లక్ష్యాన్ని సాధించగలదు.

మెకాలే కూడా సామాన్య ప్రజలకు ఆధునిక విజ్ఞానం అవసరమనే భావించారు. ఆయన ఇంగ్లీషువారికి భారతీయులకు మధ్య రంగులోనూ, రక్తంలోనూ భారతీయులుగానే ఉంటూ, అభిప్రాయాలలోనూ అభిరుచులలోనూ, నైతిక ధోరణిలోనూ, మేధాశక్తిలోనూ ఇంగ్లీషు వారివలె ఉండగల దుబాసీ వర్గాన్ని సృష్టించాలనుకున్నమాట నిజమే. కాని ఆయన ఆ దుబాసీల వర్గమే, భారతీయ భాషలను పాశ్చాత్య శాస్త్రీయ పదజాలంతో అభివృద్ధిచేయగలదనీ, అలా అభివృద్ధిచెందిన భాషలు భారత ప్రజానీకాన్ని చేయగలవనీ ఊహించాడు. కాని విజ్ఞానవంతులు సిద్ధాంతం యొక్క ముఖ్యాంశమైన ఇంగ్లీషు మీడియం విద్యను మనం ఇంకా పట్టుకొని వ్రేళ్ళాడుతూనే ఉన్నాం. ఆయన వడపోత– మట్టిలో మాణిక్యాలను సైతం పైకితేవటం జాతీయవిద్య యొక్క లక్ష్యం. ప్రజాస్వామికానికి ఆవసరం "భాషాసమస్య"లో వాసమూర్తి చెప్పినట్లు, ఫ్యాక్టరీ కార్మికులకు సాంకేతిక విజ్ఞాన పరిచయాన్ని కలుగజేస్తే, ఎంతోమంది హెన్రీ ఫోర్డు మనకు లభించవచ్చు. కాని పరభాషలో ప్రాథమికవిద్యను మనం కొనసాగనిచ్చినంతకాలం, మట్టిలో మాణిక్యాలు మట్టిలోనే ఉంటాయి.

**విద్య – జాతీయ సంస్కృతి :**

పరభాషలో ప్రాథమికవిద్యనభ్యసించినవారు పరభాషలో పరుల భావనలనే మననం చేసుకుంటూ, ఒక కృతకమయిన సంస్కృతిని సృష్టించారు. ఇది అభివృద్ధి చెందిన దేశాల సంస్కృతికి నకలేగాని మన జాతీయ సంస్కృతి కాదు. మన సామాజిక విలువలనూ, మన సాంస్కృతిక వారసత్వాన్ని ఇది ప్రతిబింబించదు. విద్య, జాతీయ సంస్కృతిని కాపాడాలంటే, పిల్లలు తమ మాతృభాషల ద్వారా విశేష గ్రంథపఠనాన్ని చేయాలి. వారు మాతృభాషలోనే రచనలను చేయాలి. ఈ కార్యక్రమాలు మాతృభాషలో ప్రాథమిక విద్యనభ్యసించిన వారికే సుసాధ్యం. కాగా ఇంగ్లీషులో ప్రాథమిక విద్యనభ్యసించిన పిల్లలు మన మాజీ పాలకుల భాష తమను కూడా పాలకవర్గంలో చేర్చుతుందనే భ్రమలో ఉన్నారు.

దయార్ద్ర హృదయం, చురుకైన ఆలోచన, ఆనందాన్ని ఆహ్వానించే శక్తి, సంస్కృతికి మూలమని వైటెడ్ పండితుని భావం. దీనిని మనం అంగీకరించితే భావానికి మెదడుకు మధ్య ఉన్న బోధనాభాషయైన పరభాష (ఇంగ్లీషు) అనే ఇనుపతెరను మన పాఠశాలల నుండి తొలగించాలి.

ఇంగ్లీషులో గ్రంథపఠనం మన పునర్వికాసానికి తోడ్పడిందనే వాదం ఉంది. లాటిన్, గ్రీక్ గ్రంథాలు ఇంగ్లాండ్ యొక్క పునర్వికాసానికి తోడ్పడ్డాయి. కాని ఆ భాషలు ఆంగ్లేయుల బోధనాభాషలు కాలేదు. అట్లే ఇంగ్లీషు మన పాఠశాలలో బోధనాభాషగా ఉండనవసరం లేదు.

కొన్ని ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ఇంగ్లీషు సాహిత్యంలో అంతర్భాగమున క్రైస్తవ మతభావాలను ఒక నిర్ణీతమయిన పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నాయి. హేతువాదాన్ని బలపర్చే సంస్థలు కర్మ సిద్ధాంతాన్ని జీర్ణించుకొన్న పెద్దలను మార్చడానికి ప్రయత్నం చేస్తూ ఉండగా, ఈ ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ముక్కుపచ్చలారని బిడ్డల మనస్సులలో మూఢనమ్మకాలనూ, కర్మసిద్ధాంతాన్ని గట్టిగా ముద్రిస్తున్నాయి. కాగా గత అర్ధశతాబ్దంలో ఎంతో హేతువాద, మార్క్సిస్టు భావప్రచారం జరిగినప్పటికీ, 1938 నాటి కంటె మూఢనమ్మకాలు నేడే బలంగా ఉన్నాయి. ఈ భావ ప్రచార యుద్ధంలో అతివాద రాజకీయ పక్షాలనూ, హేతువాద ప్రచార సంస్థలనూ ఓడించటంలో ఈ ఇంగ్లీషు మీడియం పాఠశాలలు ప్రముఖ పాత్ర వహించాయి.

**కిండర్‌గార్టెన్‌లు**

కిండర్‌గార్టెన్ విద్యావిధానాన్ని జర్మన్ విద్యావేత్త ఫ్రోబెల్ (1792–1852) రూపొందించారు. ఈ పాఠశాలల పిల్లలు ఉపాధ్యాయుల ద్వారా నేర్చుకొనేదానికంటే, ఆడటం, పాడటం, బొమ్మలతోను, ఆటవస్తువులతోను కాలక్షేపం చేయటం, కథలను వినటం, మట్టి బొమ్మలను చేయటం, ప్రకృతిని పరిశీలించడం, పురుగులను, పక్షులను పట్టుకోవడం పెద్దలను అనుకరించటం ద్వారా యెక్కువ నేర్చుకొంటారు. ఉపాధ్యాయులు పర్యవేక్షకులు మాత్రమే. పరభాషలో ఆడటం, పాడటం, కథలను గాథలను విని నేర్చుకోవటం పిల్లలకు సాధ్యంకాని విషయం. కాబట్టి పరభాషకు కిండర్‌గార్టెన్‌లు తావులేదు. కిండర్‌గార్టెన్ విద్య ఇంగ్లీషులోనే ఉండాలని ఎవ్వరూ చెప్పలేదు. కాగా ఎవరి మాతృభాషలో వారు తమ కిండర్‌గార్టెన్లను ఏర్పాటు చేసికోవటం శాస్త్రీయం. కిండర్‌గార్టెన్ అంటే ఇంగ్లీషు బోధనాభాషగా గల పాఠశాల అనే అర్థం వ్యాపించింది. కొందరి దృష్టిలో కిండర్గార్టెన్ కాన్వెంటుకు పర్యాయపదం. కాని కిండర్గార్టెన్ అంటే పిల్లలతోట. జర్మన్ భాషలో కిండర్ అనగా పిల్లలు, గార్టెన్ అనగా తోట కాగా కాన్వెంటు అనగా సన్యాసినుల మఠం. బ్రౌన్ నిఘంటువు ప్రకారం "గో ఇన్ టు ది కాన్వెంటు" అనగా సన్యాసినుల మఠంలో ప్రవేశించుట(సన్యసించుట). ఇంగ్లీషు మీడియం పాఠశాలలపై మనకున్న మోజు ఈ మాటల అర్థాలనే మార్చి వేసింది.

పిల్లలు తాము చదివిన దానికంటె విన్నదానినే ఎక్కువగా గుర్తుంచుకుంటారు. పెద్దల, ఉపాధ్యాయుల, తల్లుల సంభాషణల నుండి

వారు ఎంతో నేర్చుకోగలరు. కాని కిండర్‌గార్టెన్ విద్య (శిశువిద్య) పరభాషలో ఉన్నప్పుడు పై పెద్దలంతా ప్రేక్షకులుగా ఉండిపోవలసిందే. సోదరి నివేదిత నిర్వచనం ప్రకారం తల్లి తోటమాలిగా ఉన్న గృహం ఆదర్శమైన కిండర్గార్టెన్. వైట్హెడ్ పండితుని ఆలోచన ప్రకారం సజీవమైన భావాలు గల తల్లులు నిరక్షరాస్యులైనప్పటికీ నిర్జీవమైన భావాలను నూరిపోసే ఉపాధ్యాయుల కంటే మెరుగు.

ఇంతే కాకుండా కిండర్ గార్టెన్ విద్యలో పిల్లల స్వయంకృషికి అడ్డంకులు ఉండకూడదు. కాని పరభాషలో శిశువిద్య పిల్లల అభివృద్ధికి అడ్డంకి. కాబట్టి ఆదర్శమైన శిశు విద్యాలయాలలో మాతృభాషలే బోధనాభాషగా ఉండాలి. అప్పుడే మన సంస్కృతిని, విలువలను ఉపాధ్యాయులు మన పిల్లలకు అందించగలరు.

**మాతృభాష-తల్లిపాలు**

అజ్ఞానులు ప్రజాస్వామికమునకు అండగా ఉండలేరు. కాగా ప్రజాస్వామ్యం సఫలం కావాలంటే విజ్ఞానం ప్రజలందరికి సొత్తుకావాలి. ఇది సాధ్యం కావాలంటే ప్రాథమికవిద్య మాతృభాషలోనే ఉండాలి. ఈ సందర్భంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (1877-1923) గారి మాటలు గమనింపదగినవి. "తల్లిపాలు త్రావి పెరిగిన బాలునకును, దాదిపాలు త్రాగి పెరిగిన బాలునకు నెట్టి భేదముండునో, స్వభాషయందు శాస్త్రాభ్యాసము చేసిన వారికి పరభాష యందు జ్ఞానార్జనము చేసిన వారికి నట్టి భేదమే యుండును. అన్యభాష మొదట నేర్చుకొని పిదప నా భాష యందు శాస్త్రములఁ గళలఁ జదువుకొనుట ద్రావిడ ప్రాణాయామము వంటిది' **('లక్ష్మణరాయ వ్యాసావళి' : 1 సంపుటము)**

పానుగంటి (1865-1940) వారి జంఘాలశాస్త్రి ఏమన్నాడో చూడండి : "తల్లిస్తన్యముతో గూడా నేభాష మనము త్రావుదుమో యా భాషలోనే మన మెన్నటికైనా గఠిన ప్రయత్నమొనర్చిన యెడల సుపజ్ఞా సహితమగు నుత్తమ గ్రంథములను వ్రాయగలము. **('సాక్షి', 3వ సంపుటము)**

కొందరికి ప్రజాస్వామికముతో పనిలేకపోవచ్చు. కాని వారి బిడ్డలకు కూడా ప్రామాణికమైన విద్యకావాలి. కాబట్టి వారి బిడ్డలు కూడా ప్రాథమిక విద్యను మాతృభాషలోనే అభ్యసించాలి. ఐనప్పటికీ, ఈ వాదనను కాదని, ప్రత్యేకంగా వారి బిడ్డలకొరకు ఇంగ్లీషు మీడియంలో ప్రాథమిక విద్యను ఏర్పాటు చేసికొనే ప్రజాస్వామికహక్కు వారికి ఉంది.

**స్త్రీ విద్య**

ప్రాథమిక విద్యారంగంలో పురుషుని కంటే స్త్రీకే మంచి స్థానము ఉంది. కాని పరభాషలో ప్రాథమికవిద్య నభ్యసించి భాషలలోనూ, గణితశాస్త్రంలోనూ మంచి పునాదిలేని స్త్రీలు ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించితే పిల్లలకు ప్రామాణికమైన విద్య లభించదు. ఇంతేకాకుండా పరభాషలో విద్యనభ్యసించిన ఉపాధ్యాయురాండ్రు ప్రజాస్వామికదేశానికి కావలసిన నిరాడంబరత్వం, సానుభూతి దేశాభిమానం గల పౌరులను తయారు చేయలేరు. కాని ఈ రోజున ఎందరో ఆడపిల్లలు కూడా పరభాష ద్వారా ప్రాథమిక విద్యనభ్యసిస్తున్నారు. ఇది మన దురదృష్టం.

ఈ విధంగా మాతృభాషలో ప్రాథమిక విద్య ప్రజాస్వామికమునకు పట్టుగొమ్మ అని ఎందరో మహానుభావులు ఇదివరకే హెచ్చరించారు.

రచయిత కీ.శే.అట్లూరి పురుషోత్తం.ఆంగ్ల భాషోపన్యాసకులుగా ఉద్యోగం చేశారు. ఆయన రచించిన 'మాతృభాషలు ప్రాథమిక విద్య' ఇరవై ఏండ్లు నాటిది. నాటికీ నేటికీ ఈ విషయంపై ప్రామాణికగ్రంథం. ఈ వ్యాసం ఆ పుస్తకంలో భాగం.



డా॥ గుంటుపల్లి శ్రీనివాస్
93948 10088

# ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యత లేని బడిచదువులు

## నిబద్ధతలేని రాజకీయ పార్టీలు, మీడియా, పౌర సమాజం

**గడచిన కొన్ని సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని బడి ఈడు పిల్లల్లో అత్యధికులు బడిలో చదువుతున్నారు. ఇంత పెద్దఎత్తున తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చడం అనేది భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేదు. ఇది నిజంగా ప్రజాస్వామ్యానికి, సమాజ అభివృద్ధికి ఎంతో శుభపరిణామం.**

**కానీ ఇప్పుడు మన సమాజం ... చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని ఒక సమస్యను ఎదుర్కొంటున్నది.... అది సంవత్సరాల తరబడి బడికి వెళ్ళినా కూడా పిల్లలకు కనీసం చదవడం, వ్రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం కూడా రాకపోవడం!!**

1820లలో అప్పటి మద్రాస్ గవర్నర్ అయిన థామస్ మన్రో రిపోర్టు లో "పిల్లలు (తెలుగు మాట్లాడే జిల్లాలలో) 7 వ సంవత్సరంలో బడిలో చేరి, రెండు సంవత్సరాలు అనగా 9వ సంవత్సరం ముగిసే వరకు బడికి వెళ్ళేవారని... ఈ రెండు సంవత్సరాలలో వారి అవసరాలకు కావలసినవి నేర్చుకునే వారని వ్రాశారు. నేర్చుకోవడంలో వెనుకబడిన విద్యార్థులను మాత్రమే '11వ సంవత్సరం' వరకు బడిలో ఉంచేవారని వ్రాశారు.

1820లలో పిల్లలు బడికి వెళ్లిన రెండు సంవత్సరాలలో... అప్పటి బడులలో వారికి చదవడం, వ్రాయడం, లెక్కలు, జీవితానికి కావలసిన జ్ఞానం శతకాల రూపంలో నేర్పేవారు.

మరి ఇప్పుడు బడిలో 10వ తరగతికి వచ్చినా చదవడం, వ్రాయడం రాకపోవడం ఏమిటి ?? ప్రస్తుతం బడులు నిరక్షరాస్యులను తయారు చేస్తున్నాయి. బడి తయారుచేసిన ఈ నిరక్షరాస్యులను ప్రత్యేక క్యాటగిరీగా భావించి వారిని "Schooled Illiterates" అని అంటారు.

2005 నుండి 'ప్రథమ్' అనే స్వచ్ఛందసంస్థ దేశవ్యాప్తంగా బడి ఈడు పిల్లలలోని నైపుణ్యాలు అనగా చదవడం, వ్రాయడం, లెక్కలు (కూడికలు, తీసివేతలు, భాగాహారాలు) చేయడం ఎలా ఉంది? అని తరగతుల వారీగా, శాస్త్ర బద్ధంగా విద్యార్థుల ఇళ్ళ వద్ద ప్రామాణిక సర్వేచేసి... వార్షిక నివేదికను విడుదల చేస్తుంది. ఈ నివేదిక చాలా వరకు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉంటుంది.

2005 నుండి 2022 వరకు విడుదల చేసిన రిపోర్టులను పరిశీలిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో విద్యాప్రమాణాలు ప్రతీ సంవత్సరం దిగజారుతూనే ఉన్నాయి. అయినా మార్పు కోసం ప్రభుత్వాలు , పౌర సమాజం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పైపెచ్చు "ఇబ్బడి ముబ్బడిగా మార్కులు వేసి పిల్లలను, తల్లిదండ్రులను మార్కుల మత్తులో ముంచుతున్నారు"....

ఇంగ్లీష్‌లో ఒక సామెత ఉంది... 'సరైన సమాధానాలు కావాలంటే, సరైన ప్రశ్నలు అడగాలని'.

ఆంధ్రప్రదేశ్‌లో బడిఈడు పిల్లల్లో విద్యాప్రమాణాలు లేవని 'అసర్ నివేదిక - 2022' మరోసారి తేల్చిచెప్పింది. నివేదిక విడుదల చేసిన తెల్లారి ... పత్రికలలో ఒక చిన్న వార్త వేశారు.... అంతే!

1. ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలు దీనిపై ఎందుకు స్పందించలేదు? పార్టీల అధికార ప్రతినిధులు ఎందుకు మీడియా సమావేశాలు పెట్టలేదు? వారికి బాధ్యత లేదా? కనీసం పార్టీల నాయకులు ట్విట్టర్‌లో ట్వీట్లు కూడా పెట్టలేదు!

2. పౌరసమాజం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం, కనీస స్పందన కూడా లేకపోవడం అనేది... సమాజంలోని విలువల పతనానికి నిలువుటద్దం!!

"పుట్టుకతో సంబంధం లేకుండా, ప్రతీ విద్యార్థికి నాణ్యమైన బడి చదువు అందించడం అనేది ప్రజాస్వామ్య సమాజం యొక్క కనీస ధర్మం. ఆ ధర్మాన్ని నెరవేర్చడంలో సమాజం పూర్తిగా విఫలమయింది, మరియు విద్యాప్రమాణాలు దారుణంగా పడిపోతున్నాయని తెలిసి కూడా, ఏమీ పట్టనట్లు మౌనంగా ఉండటం అనేది వారి నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది".

**మీడియా:- బడికి వెళ్ళే పిల్లల్లో కొన్ని లక్షల మందికి చదవడం, వ్రాయడం కూడా రాకపోవడం అనేది చిన్న విషయమా?? ఇన్ని లక్షల మంది Schooled Illiteratesగా తయారవడం అనే వాస్తవాన్ని ఒక చిన్న వార్తగా ప్రచురించడం భావ్యమేనా?**

**టీవీ ఛానెల్స్ వారు ఎన్ని గంటలు చర్చలు నిర్వహించారు?**

విద్యాప్రమాణాల సర్వేలోని అంశాలు ప్రచురితం / ప్రసారం చేసేటప్పుడు, ఆ భావం .... సమస్య యొక్క తీవ్రత ప్రజలకు అర్థం అవుతున్నదా లేదా అని పరిశీలించాలి. ఉదాహరణకు 10వ తరగతి పిల్లలు, రెండవ తరగతి ప్రామాణిక తెలుగు పాఠం కూడా చదవలేకపోతున్నారు.... అన్న అంశం వ్రాసేటప్పుడు , 2వ తరగతి తెలుగు పాఠం అంటే ఏమిటి అని ఒక బాక్స్‌లో వ్రాయాలి. అలాగే ఇంగ్లీష్ వాక్యాలు చదవలేకపోతున్నారు అనే విషయం గురించి కూడా!

ఈ సమస్యను పరిష్కరించాల్సిన సామాజిక బాధ్యత ఉపాధ్యాయ సంఘాలకు కూడా ఉంది. 'మీడియాలో విద్యా ప్రమాణాలు గురించి వార్తలు - వ్యాసాలు ప్రచురిస్తే, టీవీ ఛానళ్లలో చర్చలు నిర్వహిస్తే ... ఉపాధ్యాయ సంఘాలు "పలానా టీవీ ఛానల్, పలానా పత్రిక .... ప్రభుత్వ టీచర్లకు వ్యతిరేకంగా పనిచేస్తుంది" అని వారిపై వ్యతిరేక ప్రచారం చేయడం అనేది, సంఘాలు-వాటి నాయకుల యొక్క బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది.

రాజకీయపార్టీలు, మీడియా, పౌర సమాజం అందరూ కలిసి సమిష్టి గా మార్పు కోసం తమతమ కర్తవ్యాలు నిర్వర్తించాలి. ఉపాధ్యాయ సంఘాలు కూడా తమవంతుగా మార్పుకు సహకరించాలి. అప్పుడే ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన ప్రతీ బిడ్డకు నాణ్యమైన బడిచదువు అందుతుంది. అ

గారపాటి ఉమామహేశ్వరరావు
98661 28846

# రాజ్యం-బాధ్యత-భాషాపరిరక్షణ

**నేను** నా స్నేహితుడు ఆచార్య చిన్నయ సూరి ఒక రోజు పొద్దున్నే ఎప్పటిలానే నడక మొదలుపెట్టాం. అయితే నడిచేటప్పుడు ఏదో ఒక విషయంపై చర్చించుకోవటం అలవాటు. ఎక్కువగా ఈ విషయాలు భాష-సమాజం గురించో, రాజనీతి-పరిపాలన గురించో ప్రాచీన శాస్త్ర విషయాల నుంచి ఆధునిక సిద్ధాంతాలవరకూ ప్రజాస్వామ్య పరిధిలో జరుగుతుండేవి.

ఆ రోజూ అలానే మొదలెట్టాం. ఆయన నా ప్రశ్న ఈ సారి మీ అంతర్జాతీయ భాషాశాస్త్రజ్ఞుల సాంవత్సరిక సమావేశంలో చర్చకు వచ్చిన ప్రధాన విషయం ఏంటి? అని నన్ను అడిగారు. నేను తడుముకోకుండా ఆపన్న భాషల పరిరక్షణపైనే అని అన్నాను. అయితే దానికి ఆయన, ఆపన్న భాషల గురించి ఏం చేయాలనుకుంటున్నారు? అని మళ్లీ ప్రశ్న. దానికి నేను అందరిలానే ఆపన్న భాషలను పరిరక్షించుకునేందుకు ప్రణాళికలో భాగంగా ఆపన్న భాషలకు వర్ణనాత్మక వ్యాకరణాలూ, నిఘంటువులూ కూర్చి వాచికాలు తయారు చేసి ఆపన్న భాషలు మాట్లాడే సమూహాలకు వారి భాషలోనే చదువులు చెప్పేందుకు చదువుకొనేందుకు వీలు కలుగుతుందని నా జవాబు. ఆపన్న భాషలను పరిరక్షించటమంటే డార్విన్ సిద్ధాంతంలో పేర్కొన్నట్లు జీవపరిణామ క్రమంలో బలమైనవే బ్రతుకుతాయి అనే సూత్రాన్ని విరుద్ధంగా ప్రవర్తించటమన్నమాట అని అన్నారు.

సరిగ్గా ఇదే సందర్భంలో ఆయన ఒక ఆసక్తికరమైన మరో సిద్ధాంతాన్నీ ఆ సిద్ధాంతకర్తనూ పేర్కొన్నారు. పందొమ్మిదవ శతాబ్దపు చివరి దశాబ్దాలలో అత్యంత ప్రసిద్ధ యూరోపియన్ మేధావిగా తత్వవేత్తగా, మనస్తత్వవేత్తగా, జీవశాస్త్రవేత్తగా, ఇంకా మానవ శాస్త్రవేత్తగానే గాక "సామాజిక డార్వినిజం" అనే సిద్ధాంత రూపకర్తగా ప్రసిద్ధి చెందిన హెర్బర్ట్ స్పెన్సర్ సిద్ధాంతాన్ని ఉటంకిస్తూ దాని ప్రకారం భారతీయ భాషలను ఆపన్న భాషలూ, అల్పసంఖ్యాకవర్గ భాషలూ షెడ్యూలు భాషలూ అని మూడు వర్గాలుగా విభజించినా భారతీయ భాషలన్నీ ముందో వెనకో ఇంగ్లీషు దురాక్రమణకు లోనుకావలసివస్తుందేమోనని నా భయం అని అంటూ, దీనికి మీ భాషాశాస్త్రజ్ఞులు ఏం చెబుతారని నిలదీశారు. ఇక్కడ "సామాజిక డార్వినిజం" గురించి కొంత చెప్పుకోవాలి. చార్లెస్ డార్విన్ రచించిన "ప్రజాతుల మూలాలు" అనే గ్రంథం (ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీశీస్, 1859) చదివిన తర్వాత హెర్బర్ట్ స్పెన్సర్ "జీవశాస్త్ర సూత్రాలు" అనే పేరిట రాసిన (ప్రిన్సిపల్స్ ఆఫ్ బయాలజీ, 1864) గ్రంథంలో బలమైనవే బ్రతుకుతాయి (సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్) అనే భావనకు పరికల్పన చేశాడు. ఈ పదం సహజ ఎంపికను (నాచురల్ సెలెక్షన్) గట్టిగా సూచిస్తుంది. అయితే స్పెన్సర్ జీవపరిణామాన్ని మానవ సమాజాల పరిణామంలోనూ నైతిక ప్రపంచంలోకి గూడా విస్తరించినట్లు భావించాడు.

స్పెన్సర్, జీవులు, మానవుల మనోభావనలు, భౌతిక ప్రపంచం, మానవ సంస్కృతీ సమాజాల ప్రగతిశీల అభివృద్ధి పరిణామం మొదలైనవాటిని అన్నింటినీ కలుపుకొంటూ ఈ భావనను అభివృద్ధి చేశాడు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అతను నీతి, మతం, మానవ శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, రాజకీయ సిద్ధాంతం, తత్వశాస్త్రం, సాహిత్యం, ఖగోళ శాస్త్రం, జీవశాస్త్రం, సామాజిక శాస్త్రం మరి మనస్తత్వశాస్త్రంతో సహా అనేక రకాల అంశాలను అధ్యయనం చేశాడు. తన జీవితకాలంలో విపరీతమైన సాధికారతను సాధించాడు.

అయితే ఇక్కడ మనకు ఆసక్తి కలిగించే విషయం ఏమంటే హెర్బర్ట్ స్పెన్సర్ రూపొందించిన బలమైనవే బ్రతుకుతాయి (సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్) అనే సూత్రీకరణకు మూలం

సామాజిక డార్వినిజమనే సూత్రం ప్రకారం సమాజంలో యోగ్యమైనవి బ్రతుకుతాయి ఇంకా బలహీనమైనవి అంతరించిపోతాయి. బలహీనులపై 'సమర్థవంతులు' విజయం సాధిస్తారు. సామాజిక క్రమం, తరగతి ఇంకా సాంఘిక ఆచారాలు లేని కఠినమైన ప్రపంచంలో ప్రతి ఒక్కరిపై బలవంతులు ఆధిపత్యాన్ని కలిగి ఉంటారని దీని అర్థం.

డార్వినియన్ పరిణామం 'బహుశా సరైనది' కావచ్చు అనే భావనకు సహజమైన సమర్థనను అందిస్తుంది అనే ఆలోచనతో స్పెన్సర్ సామాజిక డార్వినిజం అనే సూత్రాన్ని రూపొందించారు అనుకోవచ్చు. వాస్తవానికి అతను ఆర్థిక పోటీకి నమూనా ప్రకృతిలో వనరుల కోసం పోటీలో ఏర్పడుతుందని నమ్మాడు; కానీ పోటీని సమాజం యొక్క మంచి కోసం నిర్వహించవచ్చు, కానీ అది రాజ్యానికి శక్తిని పెంచడానికి దారితీయదు. ఇందులో సుజనన సిద్ధాంతానికి (యూజెనిక్స్) మద్దతు ఇవ్వాలనే ఆలోచన.

డేవిడ్ రిచీ రచించిన డార్వినిజం అండ్ పాలిటిక్స్ (1889) అనే గ్రంథం కూడా సామాజిక డార్వినిజాన్ని కలుపుకుపోయే విధంగా మద్దతుని అందించింది. ఆ గ్రంథంలో అతను రాజ్యం (ప్రభుత్వం), ఒక దయాదాక్షిణ్యాల సంస్థగా వ్యవహరిస్తూ, వ్యక్తులను అస్తిత్వ సాధనాల కోసం శాశ్వత పోరాటం నుండి విముక్తం చేయడం ద్వారా సామాజిక పరిణామానికి తోడ్పడుతుంది అని ఆశించాడు. క్రోపోట్కిన్ ప్రకారం డార్వినిజం అరాచకవాదంతో కూటమిలో చోటు చేసుకుంది. అందువల్ల, సోషల్ డార్వినిజం "యోగ్యత" మరియు "అయోగ్యత" సమూహాల మధ్య సామాజిక పోటీని చూపిస్తుంది. ఆయా సమూహాల యోగ్యతను సమాజానికి విలువగా పరిగణించవచ్చు. మరొక తత్వవేత్త మాల్థస్ ప్రకారం, దయతో కూడిన సహాయం పేదలకు సహాయకారి కాజాలదు. కానీ అది వారి స్వాతంత్ర్యతనూ వారి మనుగడనూ బలహీనపరచడం, జనాభాను పెంచడం, ఆహార సరఫరాతో పని చేయకుండా పనిలేకుండా చేయడం ద్వారా- వారి మనుగడ

అవకాశాలను బలహీనపరుస్తుంది అని వర్ణించాడు.

సామాజిక డార్వినిజం ఒక రకంగా యోగ్యతను తెలివితేటలుగానూ అది శ్వేతజాతీయుల మేధస్సును గుర్తించడంగానూ పునర్నిర్వచించింది. అంటే, సామాజిక డార్వినిజంలో అంతర్లీనంగా జాతుల మధ్య వైషమ్యాలూ సహజం. వాటి మధ్య బ్రతుకు పోటీ తప్పనిసరి అనేది కనబడుతుంది. సామ్రాజ్య విస్తరణ సమర్థనలో ప్రధానమైన క్రూరత్వం, నాగరికతల సామాజిక డార్వినిజం ఉద్ఘాటించింది. ఏది ఏమైనప్పటికీ, రెండవ ప్రపంచయుద్ధం, హిట్లర్ సామ్రాజ్యకాంక్ష అతను జరిపిన మారణకాండ (హోలోకాస్ట్) చివరకు సామాజిక డార్వినిజంలోని జీవసంబంధమైన నిర్ణయాత్మకతనూ, అంతర్జాతీయ ఆర్థిక పోటీలోని యోగ్యతాపరమైన ఆలోచనలను అభాసుపాలు చేసింది. అంటే మధ్యయుగీన 'బలమైనవే బ్రతుకుతాయి' అనే క్రూరమైన సిద్ధాంతపరమైన ఆలోచనలనుండీ ఆధునికయుగంలో ప్రజా ప్రభుత్వాలు సమసమాజ సిద్ధాంతపరమైన ఆలోచనలవేపుగా మళ్లాయి. ఇంకో విధంగా చెప్పుకోవాలంటే, సమాజంలో బలవంతులూ బలహీనులూ అనే వర్గాలు ఉన్నా ప్రధానంగా రాజ్యం (ప్రభుత్వం) బలహీనులకోసమేనని, సమాజంలో అట్టడుగువర్గాల శ్రేయస్సుకోసమే రాజ్యం అవసరమనే ఆలోచనా విధానం కొత్తదేమీ కాదు. ప్రాచీన ప్రాచ్య పాశ్చాత్యుల రాజకీయ తాత్విక చింతనలతో ఉద్ఘాటించినవే.

ఈ నేపథ్యంలో, దేశీయ ఆపన్న, అల్పసంఖ్యాక, షెడ్యూల్డు భాషలు వలసవాద సామ్రాజ్యవాద భాషలైన ఇంగ్లీషు మొదలైన వాటినుండీ ఎదుర్కొంటున్న పీడన, తాడనలు ఆ భాషనుండీకాక ఉచితానుచితాలు మరచి ఆ భాషను మాతృభాషల స్థానంలో ప్రవేశపెట్టడం వలన, తమ అధికారాన్నీ తద్వారా ఆర్థిక స్తోమతను పెంచుకొనే ప్రయోగంగా గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో రాజ్యం దేశీయ ఆపన్న, అల్పసంఖ్యాక, షెడ్యూల్డు భాషలను వలసవాద పీడక భాషల నుంచీ పరిరక్షణకు కట్టుబడాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాతీయ ఆర్థిక విషవలయంలో చిక్కుకోకుండా తమదైన స్వతంత్ర ఆర్థిక శక్తిగా ఎదగడానికి వీలుగా ప్రజాస్వామ్యంలో రాజ్యం (ప్రభుత్వం) ప్రజల భద్రతతోపాటు, ప్రజల భాషలనూ వారి సంస్కృతినీ పరిరక్షించే ప్రయత్నం చేయాలి. ఇది ప్రభుత్వ బాధ్యతే గాక ప్రజల హక్కు కూడా. ప్రభుత్వాలు, వేలల్లో వస్తున్న అంతర్జాతీయ వ్యాపార సంస్థల విదేశీ ఉద్యోగాలను ఎరగా చూపి, లక్షలూ కోట్లల్లో రావాల్సిన దేశీయ, స్థానిక ఉద్యోగాలకు అవసరమైన మాతృభాషా నైపుణ్యాలను కాలరాసే ఆలోచనలను మానుకోవాలి.

రచయిత - ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు,
భారతీయభాషల జాతీయ సంఘానికీ,
తెలుగుభాషోద్యమ సమాఖ్యకూ అధ్యక్షులు

**పురస్కారం**

# భాషాశాస్త్రవేత్త ఆచార్య బండి రామకృష్ణారెడ్డిగారికి పద్మశ్రీ పురస్కారం



రామకృష్ణారెడ్డి గారికి పద్మశ్రీ రావడం చాలా ఆనందదాయకం.... వారికి తెలుగుభాషోద్యమ సమాఖ్య తరపున అభినందనలు. విద్యాత్మక విషయాల్లో నిక్కచ్చిగా ఉండే సహృదయుడూ స్నేహశీలి అయిన అధ్యాపకుడుగా రామకృష్ణారెడ్డి గారు మంచి పేరు తెచ్చుకున్నారు

ప్రముఖ భాషాశాస్త్రవేత్త, ఆచార్య బండి రామకృష్ణారెడ్డిగారికి 74వ (2023) భారత గణతంత్ర దినోత్సవ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. ఇది ఆయనకు మాత్రమే కాదు, భాషాశాస్త్రానికీ, భారతీయ గిరిజన భాషా అధ్యయనానికీ కూడా దక్కిన గౌరవం. ఒక భాషాశాస్త్రవేత్తకు పద్మశ్రీ రావడం ఎందరికో ప్రేరణ! ఎందరికో స్ఫూర్తి! ఈ సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య శ్రీ రవీంద్ర యాదవ్ గారు ఆచార్య బండి రామకృష్ణారెడ్డి గారి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ ఇది ఉస్మానియా విశ్వవిద్యాలయానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు.

రామకృష్ణారెడ్డి గారికి పద్మశ్రీ రావడం చాలా ఆనందదాయకం.... వారికి తెలుగు భాషోద్యమ సమాఖ్య తరపున అభినందనలు. విద్యాత్మక విషయాల్లో నిక్కచ్చిగా ఉండే సహృదయుడూ స్నేహశీలి అయిన అధ్యాపకుడుగా రామకృష్ణారెడ్డి గారు మంచి పేరు తెచ్చుకున్నారు.

ఒక సాధారణ చిన్న రైతు కుటుంబంలో పుట్టి ఎస్వీ విశ్వవిద్యాలయంలో ఎమ్.ఏ.(హిందీ), ఆపైన ఆలిండియా రేడియోలో ఉద్యోగం చేశారు. ఆధునిక భాషాశాస్త్రంలో శిక్షణ పొందిన భారతీయ భాషావేత్తలలో రెండవ తరంలో(1970లలో) ప్రముఖ భాషావేత్తగా ఎన్నదగినవారిలో ఆచార్య బండి రామకృష్ణారెడ్డిగారు ఒకరు.

**కవితా సంపుటాలకు పురస్కారం–ఆహ్వానం.**

4వ బాపురం గురురాజరావు కవితా పురస్కారం కొరకు 2022లో ముద్రితమైన వచన కవితా సంపుటాలను పంపండి.

ఈ పోటీకిగాను కవితా సంపుటాలను మూడేసి ప్రతులు ఫిబ్రవరి 20/2023లోపు పంపాలి. విజేతకు జ్ఞాపికతో పాటు 7500/- నగదు బహుమతి ఇవ్వబడుతుంది.పుస్తకాలు మాకు చేరవలసిన చిరునామా: కె.వి.మేఘనాథరెడ్డి ఇంటి నెం.11/21/01, ఎన్.జి.ఒ. కాలనీ, పుత్తూరు-51583, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 6300318230.

-బాపురం నరహరిరావు,అవార్డు వ్యవస్థాపకుడు

1967లో తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయంలో హిందీ ట్యూటర్‌గా తన వృత్తిని ప్రారంభించారు. అయితే తమిళనాడులో హిందీ వ్యతిరేక ఆందోళనలు ఎక్కువగా ఉన్న కాలం అది. ఆయనపై ఆ ప్రభావమే భాషాశాస్త్రంవైపు మళ్లేట్లు చేసిందనుకోవాలి. తర్వాత డెక్కన్ కాలేజ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, పూణెలో ఎమ్.ఏ. (భాషాశాస్త్రం), కేంద్ర భారతీయ భాషా సంస్థ, మైసూరులో 1970-72 మధ్య కాలంలో పనిచేస్తూ దండకారణ్యంలో మాట్లాడే గిరిజన ద్రావిడ భాషలలో ఐరాస చేత ఆపన్న భాషగా గుర్తించిన కువి భాష గురించి క్షేత్ర పరిశోధన చేసి (తన సహపరిశోధకులైన ఉపాధ్యాయ, జోయ్ రెడ్డిగార్లతో కలసి) కువి ఫొనెటిక్ రీడర్, కువి సంక్షిప్త వ్యాకరణం, నిఘంటువులను (1995) కూర్చారు. ఆ పైన (తన సహపరిశోధకులైన జోయ్ రెడ్డి, మహాపాత్ర గార్లతో కలసి) కువి జానపద సాహిత్య గ్రంథాన్ని ప్రకటించారు (2000).

ఆయన 1942 ఆగష్టు 12న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా రెంటాలచేను అనే ఊరిలో పుట్టారు. ఆయన తల్లిదండ్రులు బక్కమ్మ, ఎర్రంరెడ్డిగార్లు పెద్దగా చదువు లేకపోయినా కొడుకును పెద్దచదువులు చదివించాలనే కోరికతో చదువంటే ఇష్టపడేట్లుగా కష్టపడి పెంచారు. 1960లలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి హిందీ భాషా సాహిత్యాలలో స్నాతక, స్నాతకోత్తర చదువులను పూర్తి చేశారు. అన్నామలై విశ్వవిద్యాలయం నుండి భాషాశాస్త్రంలో సర్టిఫికేట్ కోర్సు(1967) ఆ తర్వాత, తాను ఎంచుకున్న భాషాశాస్త్రంలో స్నాతకోత్తర చదువు కోసం పూణేలోని డెక్కన్ కాలేజ్ పోస్ట్-గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కి మారారు. 1972లో అతను భాషాశాస్త్రంలో డాక్టొరల్ అధ్యయనం కోసం లండన్‌లోని అసోసియేషన్ ఆఫ్ కామన్వెల్త్ విశ్వవిద్యాలయాం ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన కామన్వెల్త్ స్కాలర్‌షిప్‌ను అందుకున్నారు. తర్వాత 1976లో ఎడింబరో విశ్వవిద్యాలయంలో సుప్రసిద్ధ భారతీయ భాషాశాస్త్రవేత్త ఆర్.ఈ. ఏషర్ పర్యవేక్షణలో తెలుగు వాక్యనిర్మాణం-స్థానస సిద్ధాంతం అనే పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ పట్టా పొందారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1977 నుండి ఆచార్యులుగా గిరిజన భాషల క్షేత్రభాషాధ్యయనం, బోధనలో రెండు దశాబ్దాలకుపైగా పనిచేశారు. పలు ఏండ్ల పరిశోధనలో భాగంగా ఒరిస్సాలోని దండకారడవులలో మాట్లాడే దక్షిణ మధ్య ద్రావిడ భాషలలో ఒకటైన మండాభాషను కనుగొన్నారు. ఐరాస ఈ భాషను తీవ్ర ఆపన్న భాషగా గుర్తించింది. ఈ భాష గురించి ఎన్నో ఏండ్లుగా పనిచేస్తూ ఉన్నారు. మండా వ్యాకరణం, మండా-మౌఖిక సాహిత్యం, మండా-ఇంగ్లీషు నిఘంటువులను కూర్చారు (2009). ద్రావిడ భాషలలో పద నిర్మాణం (2003), ద్రావిడ భాషలలో క్రియాన్వయం (సం. 2003), 2004లో దక్షిణ భారత గిరిజన జానపద కథలు (గదబ మరియు ఇరుల భాషలకు సంబంధించిన గ్రంథాలను ప్రకటించారు. అంతేకాదు గిరిజన, అల్పసంఖ్యాక భాషల అంతర్జాతీయ గ్రంథ సూచిని ప్రముఖ గ్రంథాలయాధికారి సహకారంతో తయారు చేశారు(2005).

ఎందరో విద్యార్థులు వారి పర్యవేక్షణలో గిరిజన భాషల నిర్మాణంపై పరిశోధనలు చేసి డాక్టరేట్లు పొందారు, ఆచార్య రామకృష్ణారెడ్డి గారి పర్యవేక్షణలో సాగిన క్షేత్ర పరిశోధనలో భాగంగా ఆయన శిష్యులైన పర్వతనేని సుబ్బారావు, మందలపు వెంకటరమణయ్య గార్లు ఇంది, ఆవె అనే రెండు భాషలను కనుగొని వాటిపై సంక్షిప్త వ్యాకరణాలతో సిద్ధాంత గ్రంథాలను రూపొందించారు. తవ్వా నాగరాజ చెట్టి కుట్టియా కోంధులపైనా, ఆశీర్వాదం డిడయి అనే ఆస్ట్రో ఏషియాటిక్ భాషా నిర్మాణం పైనా, శ్రీకుమార్ మలయాళ వాక్యనిర్మాణం పైనా, అమితావ్ చౌధురి హైదరాబాదులోని బంగాలీ పైనా, రమేశ్ కుమార్ ఒడిసా-ఆంధ్ర సరిహద్దులలోని తెలుగు మాండలికాలపైనా, సంఘమిత్ర సాహ సంథాలీమొదలైన ఆస్ట్రోఏషియాటిక్ భాషలపైనా సిద్ధాంత గ్రంథాలను ప్రకటించారు. ఇలా ఎందరో ఆయన పర్యవేక్షణలో వివిధ భాషలపై పరిశోధనలను కొనసాగించారు.

తెలుగు విశ్వవిద్యాలయం భాషాశాస్త్ర పీఠంలో డీన్‌గానూ, ద్రావిడ విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రారుగానూ తమ సేవలను అందించారు. ఆచార్య బండి రామకృష్ణారెడ్డిగారి సతీమణి ఆచార్య నాగమణి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేశారు. ఆమె ఎడింబరో విశ్వవిద్యాలయం నుండి తెలుగు భాషా ధ్వని తరంగాలపై పరిశోధన చేసి పి.హెచ్.డీ. పొందారు. సహృదయుడూ, స్నేహశీలుడూ, భారతీయ గిరిజన భాషా పరిశోధకులైన ఆచార్యశ్రీ బండి రామకృష్ణారెడ్డిగారిని 2023వ గణతంత్ర దినోత్సవ వేళ భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించటం భాషా శాస్త్రజ్ఞులకూ భాషాశాస్త్ర విద్యార్థులకూ స్ఫూర్తిదాయకం, గిరిజన భాషలకు గుర్తింపు కూడా.

2014లో ఆచార్య రామకృష్ణారెడ్డి గారికి, డెక్కన్ కాలేజ్ పోస్ట్-గ్రాడ్యుయేట్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (డీమ్డ్ యూనివర్శిటీ), పూణే వారు గౌరవ డాక్టరేట్ ఆఫ్ లెటర్స్ (డి.లిట్.)ను ప్రదానం చేస్తూ, "భారతీయ భాషా శాస్త్ర రంగంలో, ముఖ్యంగా గిరిజన ఇంకా అంతగా తెలియని భాషల పరిశోధనలో దేశానికి ఆయన చేసిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగానూ, భారతదేశంలోని భాషా అధ్యయనాలలో క్షేత్ర భాషాశాస్త్రం ప్రాధాన్యతను కోల్పోతున్న తరుణంలో, గిరిజన భాషలూ ఆ భాషలను మాట్లాడే సముదాయాల అధ్యయనానికి నలభై సంవత్సరాలకుపైగా నిబద్ధతతో యువ భాషావేత్తలకు గొప్ప ప్రేరణనిస్తూ చేసిన కృషి అత్యుత్తమం", అంటూ కొనియాడింది.

– ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

**ఇదీ డి.యం.కె ప్రభుత్వ భాషావిధానం**

తమిళనాడులోకి పరభాషలను అధికార భాషగా తీసుకురావడానికి ఎప్పటికీ అనుమతించమని ముఖ్యమంత్రి స్టాలిన్ స్పష్టం చేశారు. తిరువళ్ళూరు సమీపం ఐసీఎంఆర్ వద్ద వేడంగి నల్లూరులో తమిళ భాషోద్యమ వీరులకు నివాళిగా బహిరంగ సభ బుధవారం రాత్రి జరిగింది. కార్యక్రమంలో సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. 1955- 2006 వరకు తమిళం కోసం పెరియార్, కామరాజార్ తదితరులు ప్రాణాలు త్యాగం చేశారని చెప్పారు. ఇప్పటివరకు వారి స్ఫూర్తిని మరువకుండా గౌరవిస్తున్నది తమ పార్టీయేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో తమిళం, ఆంగ్ల భాష తీసుకురావడంతో ప్రపంచవ్యాప్తంగా తమిళులు ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# ఏం చేయాలి? అప్పుడే ఐరాస ప్రకటించిన అంతర్జాతీయ మూలవాసుల భాషల దశాబ్ది అమలుకు ఏడాది అయిపోయింది!

**2019లో ఐక్యరాజ్యసమితి ఆ ఏడాదిని అంతర్జాతీయ మూలవాసుల భాషల ఏడాదిగా ప్రకటిస్తూ, 2022 నుంచి 2032 వరకూ ఉన్న దశకాన్ని అంతర్జాతీయ మూలవాసుల భాషల దశాబ్దంగా ప్రకటించి పలు కార్యక్రమాలు చేసేందుకు సన్నద్ధమైంది. మూలవాసుల భాషలను పరిశీలించి, భద్రపరిచి, కాపాడుకోవడం దిశగా ఈ కార్యక్రమాలుంటాయని ప్రకటించింది. ఈ ప్రకటన చేసి నాలుగేళ్ళ కాలమైంది, దశాబ్ది మొదలై అప్పుడే ఒక ఏడాది గడిచింది.**

**మరి ఈ ఏడాదిలో ఐక్యరాజ్యసమితి చేసిన పనులేమిటి?**

ముందుగా అంతర్జాతీయ మూలవాసుల భాషల దశాబ్ద కార్యక్రమాలను నిక్షిప్తం చేసుకునేందుకు, జనాలకు తమ కార్యాచరణ తెలిపేందుకు, జనం నుంచి అభిప్రాయం సేకరించేందుకు ఐక్యరాజ్యసమితి ఒక వలగూడును ఏర్పాటు చేసుకుంది. idil2022-2032.org అనే చిరునామాలో ఈ వలగూడుంది.

స్థూలంగా వారు ఈ ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల గణాంకాలు అక్కడ ఇచ్చారు. 17 దేశాల్లో, 27 భాషలకు 76 కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. 44 దేశాల్లో, 83 భాషలకు 541 సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. 1520 సంస్థల ద్వారా 2015 వ్యక్తుల సహకారంతో 3535 స్వచ్ఛంద సముదాయాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవగాహనకు, తర్ఫీదుకు, సమాచారానికి అవసరమైన 117 దస్త్రాలు, 79 వీడియోలు, 364 ఇతర వనరులు సిద్ధం చేసుకున్నట్టు చెప్పారు.

**అయితే ఈ కార్యక్రమాల్లో కానీ, వనరుల్లో కానీ తెలుగు ప్రస్తావన కాదు కదా, భారతదేశంలోనే ఎలాంటి కార్యక్రమం జరగలేదు, సమావేశాలు జరుగలేదు, సముదాయాలు ఏర్పడలేదు, వనరుల తయారీ అవ్వలేదు.**

ప్రపంచ స్థాయిలో ఒక ధ్యేయంతో, లక్ష్యంతో చేస్తున్న పనుల్లో భాషలకు, సంస్కృతికి పెద్దపీట వేస్తామని చెప్పుకునే భారతీయులు ఈ ఒక్క విషయమై చురుకుగా ఎందుకు లేరు?

**భాషల పట్ల ఏలినవారికి పెద్దగా ఆసక్తి లేదు. రాజకీయంగా, పదవుల పరంగా ఏం చేస్తే వారికి లాభం చేకూరుతుందో ఆ వైపుగానే పని చేస్తున్నారు.**

మనకనిపిస్తుంది కదా హిందీ- భాష కోసం కేంద్ర ప్రభుత్వం, తమిళం కోసం తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, కన్నడ కోసం కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఏమేమో చేసేస్తున్నాయని, తెలుగు కోసం రెండు తెలుగు రాష్ట్రాల రాష్ట్ర ప్రభుత్వాలు ఏమో చేయడం లేదని.

కానీ అన్ని ప్రభుత్వాలు కొంచెం అటూ ఇటుగా భాషల పట్ల నిరాసక్తతతోనే ఉన్నాయి.

అసలు ప్రభుత్వాల తరఫున, వ్యక్తిగతంగా, సంస్థాపరంగా, ప్రపంచ స్థాయిలో ఐక్యరాజ్య సమితి తరఫున ఏమేం చర్యలు తీసుకోవాలో విస్తారంగా తమ లక్ష్యాల ద్వారా, వెంటనే చేయాల్సిన చర్యల్లో, కొద్ది కాలంలో చేయాల్సిన పనుల్లో, దీర్ఘకాలంలో చేయాల్సిన పనుల్లో ఐక్యరాజ్యసమితి ఇప్పటికే పేర్కొంది.

ఈ అంశాలను గతంలో మనం పత్రికలో ప్రచురించి చదువుకున్నాం.

కానీ ప్రభుత్వ పరంగా, సంస్థాపరంగా, వ్యక్తిగత స్థాయిలో ఇప్పటి వరకూ ఒక్కరు కూడా ఒక కార్యక్రమం కూడా ఈ దిశగా భారతదేశంలో చేపట్టకపోవటం గమనార్హం.

**దయవేసి అంతర్జాతీయ మూలవాసుల దశాబ్దిలో భాగం కావాలనుకునే వ్యక్తులు, సంస్థలు, అమ్మనుడి పత్రిక, తెలుగుజాతి ట్రస్టు, తెలుగు భాషోద్యమ సమాఖ్యలతో కలిసి రండి. మన మాతృభాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు అవి చేసినా, చేయకపోయినా, మన భాషలకు మన కనీస బాధ్యతగా ఎంతో కొంత సహకరిద్దాము.**

**వ్యక్తిగత స్థాయిలో మీరు చేయదగిన పనులు:**

1. మీ మాతృభాషలో విరివిగా మాట్లాడండి. అత్యవసరం అనిపిస్తే తప్ప మీ మాతృభాషలోనే అన్ని పనులూ చేసుకోండి. బ్యాంక్ ఏటీఎం అంతరవర్తిని(ఇంటర్ఫేస్) మాతృభాషలో వాడటం, మీ ఫోన్ ను మాతృభాషలోకి మార్చడం, ఇంట్లో వాళ్ళతో మాట్లాడేటప్పుడు మాతృభాషలోనే మాట్లాడటం, మీ స్నేహితులతో, బంధువులతో వాట్సాప్ లో పాఠ్య సందేశాలన్నీ మాతృభాషలోనే పంపించడం. ఇలా.

2. మీ మాతృభాషలో విడుదలయ్యే పుస్తకాలను కొని చదవండి. మాతృభాషలో సినిమాలు చూడండి. స్పాటిఫై, అమెజాన్ మ్యూజిక్ లాంటి సంగీత/పాటల ఆప్‌లలో మాతృభాషలోని పాటలే వినండి.

3. ఇంట్లో మీ మాతృభాషలో మాట్లాడలేని పిల్లలుంటే, విధిగా వారికి మీ మాతృభాషలో మాట్లాడడం, విని అర్థం చేసుకోవడం నేర్పండి. కుదిరితే రాయడం, చదవడం నేర్పండి.

4. భాషాపరమైన చర్చలు చేసుకునే సముదాయాల్లో భాగస్వాములవ్వండి. మీకు అందుబాటులో అలాంటి సంస్థలు లేకపోతే, మీరే అలాంటి ఒక సంస్థను ప్రారంభించి మాతృభాషాపరమైన చర్చలు చేస్తూ, మాతృభాషను కాపాడటానికి, భద్రపరచడానికి, కావాల్సిన వనరులను ఏర్పాటు చేయండి.

5. మీ మాతృభాషలో కథలు, కవితలు, వ్యాసాలు రాయండి. ఏమీ రాయలేకపోతే మీ రోజువారీ చర్యల్లో ఒక విషయం గురించి మీ

స్నేహితుడికి ఎలా చెబుతారో అలానే రాసి సోషల్ మీడియాలో పోస్టు చేయండి. కుదిరితే మీ రచనను, వీలైతే వేరే సార్వజనీన రచనలను(వార్తలు, పాత పుస్తకాలు లాంటివి), మీ గొంతులో చదివి వినిపించిన ఆడియో, వీడియో సామాజిక మాధ్యమాల్లో పంచుకోండి.

6. మన మాతృభాషలను నేర్చుకునేందుకు పరభాషల వాళ్ళు చాలా మంది వస్తున్నారు. తెలుగు నేర్చుకునేందుకు బాహుబలి, RRR సినిమాల తరువాత జాపాన్ నుంచి కెనడా వరకు, అస్సాం నుంచి గుజరాత్ వరకు చాలా మంది వేరే భాషల వాళ్ళు వస్తున్నారు. సోషల్ మీడియాలో తెలుగు వారిని అడిగి తెలుగు నేర్చుకుంటున్నారు. వీరికి తెలుగు నేర్పడంలో సహాయపడండి.

**స్వచ్ఛంద సంస్థ స్థాయిలో చేయదగిన చర్యలు:**

1. మాతృభాషా పరిరక్షణకు కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి. ఉదాహరణకు: వలగూడులో నేడు దాదాపు 65 నుంచి 70 శాతం సమాచారం ఆంగ్లంలోనే ఉంది. మన మాతృభాషల్లో సమాచారం చాలా తక్కువ. పాత పుస్తకాల/పత్రికల డిజిటీకరణ ద్వారా గానీ, ఉన్న ఆంగ్ల సమాచారాన్ని మన మాతృభాషల్లోకి అనువదించి గానీ, మన మాతృభాషలకే ప్రత్యేకమైన విశేషాల గురించి పాఠ్యంలో, ఆడియోల్లో, వీడియోల్లో సమాచారం తయారు చేసి వలలో చేర్చడం ద్వారా మన మాతృభాషలో కొంచెమైనా ఎక్కువ సమాచారం చేర్చగలుగుతాం.

2. మాతృభాషను నేర్చుకునేందుకు – మాట్లాడేందుకు, రాసేందుకు, విని అర్థం చేసుకునేందుకు, చదివేందుకు – తర్ఫీదునిచ్చే తరగతులు, కార్యశాలలు నిర్వహించాలి.

3. మాతృభాషను నేర్చుకునే వనరులను వివిధ స్థాయిలననుసరించి తయారు చేయాలి. వాటిని అందరికీ అందుబాటులో ఉండేలా పంపిణీ చేయాలి.

4. బడులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు – చదువుకు సంబంధించిన అన్ని సంస్థల్లో మాతృభాషలో విధిగా చదువులు గానీ, సాహిత్య–సాంస్కృతిక–అవగాహన–పరిరక్షణ కార్యక్రమాలు గానీ చేసేలా భాగస్వామ్యం చేసుకోవాలి.

5. మాతృభాష అవగాహన లక్ష్యంగా సాంస్కృతిక సమావేశాలు, పోటీలు నిర్వహించాలి.

6. మాతృభాషా అధ్యయనానికి, పాఠ్యీకరణకు పరిశోధనా స్థాయిలో పనులు జరిగేందుకు దోహద పడుతూ, అందుకు కావాల్సిన వనరులు సిద్ధం చేయాలి.

7. మీడియాలో, సాంకేతికాలలో పని చేసే సంస్థల చేత మన మాతృభాషలో కూడా పని చేయించేలా చొరవ, ఒత్తిడి తేవాలి.

8. మాతృభాషా పరిరక్షణకు నడుం కట్టిన ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలన్ని పొరపొచ్చలు మాని కలిసి పని చేయాలి.

**ప్రభుత్వ స్థాయిలో చేయదగిన చర్యలు:**

1. అన్ని మాతృభాషలను ప్రభుత్వం గుర్తించాలి. మన దేశంలో రాజ్యాంగం ప్రకారం 22 భాషలు మాత్రమే షెడ్యూల్ లో ఉన్నాయి. కార్యకలాపాల అధికార భాషలుగా ఆంగ్లాన్ని, హిందీని గుర్తించారు. అలా కాకుండా కోటి దాటిన జనాభా మాట్లాడే అన్ని భాషలను షెడ్యూల్ లో చేర్చి, పది కోట్ల జనాభా దాటిన భాషలను అధికార భాషలుగా గుర్తించాలి. ఒక్కరు మాట్లాడే భాష ఉన్నా, దానిని అల్పసంఖ్యాక భాషగా రాజ్యాంగం ద్వారా గుర్తించి ఆయా భాషల పరిరక్షణకు ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం బడిలో మాతృభాషా మాధ్యమం అమలు చేయాలి. పది లక్షల పైన జనాభా ఉన్న భాషలను రాష్ట్ర అధికార భాషలుగా గుర్తించి, రాష్ట్ర స్థాయి రాజపత్రాలన్నీ ఆ అధికార భాషల్లో ప్రజలకు అందించాలి. అల్పసంఖ్యాక భాషల పరిరక్షణకు, పెద్ద భాషల పరిరక్షణకు విధిగా నిధులు సమకూర్చి, సాహిత్య పరంగా, సాంస్కృతిక పరంగా, సాంకేతిక పరంగా భాషల అభివృద్ధికి పని చేసే ప్రాధికార సంస్థలను నెలకొల్పి, వాటి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తూ మెరుగు పరచాలి.

2. ప్రభుత్వ ఉత్తర్వులన్నీ మాతృభాషల్లో అందించాలి.

3. విశ్వవిద్యాలయ స్థాయిలో మాతృభాషల పరిరక్షణ, అధ్యయన, పరిశోధనలకు నిధులు ఏర్పాటు చేయాలి.

4. భాషల పునరుజ్జీవానికి కార్యాచరణ రూపొందించి, ప్రత్యేక భాష పరిరక్షణలో ఉన్న లోటులను పూరించాలి.

5. ప్రతి మాతృభాషలో టీవీ,రేడియో ప్రసారాలు ప్రభుత్వం తరపున చేపట్టాలి. కనీసం కొంత నిడివి ప్రతి మాతృభాషలో కార్యక్రమాలను నడిపేలా ప్రయివేట్ వాహికలకు కట్టుబడి చేయాలి.

6. ప్రతి పభుత్వ కార్యక్రమంలో మాతృభాషలకు పెద్దపీట వేయాలి.

7. మాతృభాషా పరిరక్షణకు సంస్థలను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే స్వచ్ఛందంగా పని చేస్తున్న సంస్థలకు నిధులు సమకూర్చి మాతృభాషా పరిరక్షణకు సహకరించాలి.

8. రాజకీయ, న్యాయపరమైన కార్యకలాపాల్లో ప్రతి ఒక్కరు తమ మాతృభాషను ఉపయోగించే వెసులుబాటును తేవాలి.

9. ప్రతి మాతృభాషా పరిరక్షణలో ఆ మాతృభాషలను మాట్లాడే మూలవాసులను భాగస్వామ్యం చేసుకోవాలి.

పైన చెప్పిన చర్యలు మనందరికీ 2032 వరకూ ఆచరణీయాలు. మీరు వ్యక్తి స్థాయిలో చేయదలుచుకున్న పనులు చేస్తూనే స్వచ్ఛంద సంస్థల ద్వారా చేయించాల్సిన పనుల పైన, ప్రభుత్వం ద్వారా చేయించాల్సిన పనుల మీద ఒత్తిడి తేవాలి.

మీరు సంస్థాపరంగా పని చేస్తుంటే, మీ సంస్థ మాతృభాషా పరిరక్షణకు చేస్తున్న పనులతో పాటు మీ సంస్థలోని ప్రతి వ్యక్తి పైన చెప్పుకున్న వ్యక్తిగత స్థాయి పనులు చేసేలా చూడాలి. ప్రభుత్వపరమైన పనులు జరిగేలా ఒత్తిడి తేవాలి.

ముఖ్యంగా మీరు చేస్తున్న అన్ని కార్యకలాపాలను యునెస్కో వారి పైన చెప్పబడిన వలగూడులో రాయండి. మీరు చేస్తున్న పనుల నుండి స్ఫూర్తి పొంది మరికొందరు మరింత మెరుగైన పనులు చేస్తారేమో. అన్నింటా, అంతటా మన మాతృభాషలు కనపడేలా, వినపడేలా మనం పోరాటం చేయాలి.

అ

శ్రీగణేశ్ తొట్టెంపూడి
+49 17630163660

# సాంస్కృతిక రక్షణలో సెమాంటిక్ వెబ్ - 2

ఫిబ్రవరి అనగానే భాషా శాస్త్రవేత్తలందరికీ గుర్తుకొచ్చే రోజు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం. ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వెనక ఉన్న విషాదం చాలా మందికి తెలీదు. భాషాసంస్కృతుల పరిరక్షణకి ఒకే దేశానికి చెందిన రెండు విభిన్న సంస్కృతుల వైరుధ్యం, మారణహోమం ఈ అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవానికి పునాదివేసింది. ఆ కాలంలో సరైన సాంకేతికత అందుబాటులో ఉంటే ఈ సాంస్కృతిక యుద్ధాలు, సాంస్కృతిక మారణహోమాలు జరిగే వికాదేమో. 1947లో తూర్పుపాకిస్థాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్), ఇంకాపశ్చిమ పాకిస్థాన్ (ప్రస్తుత పాకిస్థాన్) కలిసి అవిభాజ్య పాకిస్థాన్‌గా ఏర్పడింది. తూర్పు పాకిస్థాన్‌లో బాంగ్లా ప్రధాన భాషగా ఉండగా పశ్చిమ పాకిస్థాన్‌లో ఉర్దూని ప్రధాన భాషగా పశ్చిమ పాకిస్థాన్‌లో ఉన్న సంస్కృతికి ప్రాధాన్యత ఇవ్వటం వల్ల తూర్పు పాకిస్థానీయుల్లో చెలరేగిన ఆందోళన హింసాత్మకంగా మారి ఫిబ్రవరి 21 - 1951లో అబ్దుల్ బర్కత్, అబ్దుల్ జబ్బర్, ఉద్దీన్ అహ్మద్, అబ్దుల్ సలాం అన్న వ్యక్తులు పోలీసు కాల్పుల్లో మరణించటం జరిగింది.

ఒక విధంగా భాషకోసం సంస్కృతి కోసం జరిగిన పోరాటాల్లో ప్రాణాలు కోల్పోవటం చాలా అరుదు. ఆ తరువాత పశ్చిమ పాకిస్థాన్ తూర్పు పాకిస్థాన్ పై జరిపిన మారణకాండ- ఆపైన భారత దేశం కలుగజేసుకొని జరిపిన యుద్ధంలో పశ్చిమ పాకిస్థాన్ ఓడిపోగా తూర్పు పాకిస్థాన్ బంగ్లాదేశ్‌గా అవతరించింది. ఆనాటి గుర్తుగా బంగ్లాదేశ్ ఫిబ్రవరి 21 ని మాతృభాషాదినోత్సవంగా జరుపుకొంటోంది. తర్వాత కెనడాలో ఉన్న రఫెక్యూ ఇస్మాయిల్ దీన్ని ఐరాస నుండి అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా ప్రకటించాల్సిందిగా అప్పటి ఐరాస చైర్మన్ కొఫీ అన్నన్‌కి ప్రతిపాదించగా, అప్పటినుండీ ఐరాస ఆధ్వర్యంలో ఇది అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా నిర్వహించబడుతోంది. మనం చేసుకునే ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఒక భాషా సాంస్కృతిక ఆధారిత మారణ హోమం ఉందని తమ భాషని తమ సంస్కృతి పరిరక్షణలో ప్రజలు అసువులు బాశారని తెలుగుభాషనీ సంస్కృతినీ మరిచిన ఈనాటి వారికి గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనాడు వెనుకబడిన దేశంగా భావించే బంగ్లాదేశీయుల భాషాభిమానానికి ప్రతీకే ఈ అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం.

ఈ విషయాన్ని ఈ సెమాంటిక్ వెబ్ టెక్నాలజీ చర్చలో ఎందుకు చెబుతున్నానో మీకు ఆశ్చర్యం కలగవచ్చు. మనకి ఒక సినిమా డైలాగ్ ఉంది "చరిత్ర చింపేస్తే చిరిగిపోదు" అని పుస్తక రూపంలోనో లేదా ఎలక్ట్రానిక రూపంలోనో చరిత్ర ఉంటే అది మనిషి పుస్తకాల్లోనో లేక గుగుల్లోనో శోధించి చదువుకోవాలి. మనం తెలియని సమాచారం కోసం మొదటిగా గుగూల్లోకి వెళ్ళి వెతుకుతాం. గూగుల్ దానికి చెందిన సమాచారాన్ని ఎక్కడున్నా విభిన్న లింకుల్లో చూపిస్తుంది. మళ్ళీ వినియోగదారుడు ఆ లింకులన్నీ చదువుకోవాలసిందే. దీన్ని అధిగమించటానికి వచ్చిందే సెమాంటిక్ వెబ్.ముందు చెప్పిన బంగ్లాదేశ్ ఉదంతాన్ని ఇక్కడ ఉదహరిస్తాను. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అనగానే గూగుల్లో విభిన్నమైన లింకులు వస్తాయి, ఆ విభిన్నమైన లింకుల్లో ఉన్న సమాచారాన్ని కంప్యూటర్ క్రోడీకరించి (డేటా సమ్మరైజేషన్) చేసి క్లుప్తంగా ఇస్తుంది. ఇదీ ఇప్పుడు ఉన్న ఆధునిక టెక్నాలజీ.

గత నెలలో మనం అందరం చాట్-జీపిటిని చూశాం కదా. ఇది కూడా దీని ఆధారితంగా పనిచేసే సాధనమే. మీరు ఒక సమస్య మీద ఒక కంప్లైంట్ రాయమని మెషీన్‌ని అడగండి. అది రాస్తుంది. దానికి వేరే వివరాలు అనుసంధానం చేయమని మళ్లీ చెప్పండి. మీరు ఇచ్చిన వివరాలు ఏ పేరాలో చేరిస్తే సరిగ్గా సరిపోతుందో సెమాంటిక్ వెబ్ సరిగ్గా అక్కడే ఆ సమాచారాన్ని ఇముడ్చుతుంది. అంటే కృత్రిమబౌద్ధికతలో మనిషి మెదడు ఎలా ఒక పాఠాన్ని చదివి అర్థం చేసుకుంటుందో అలానే ఈ సెమాంటిక్ వెబ్ కూడా పనిచేస్తుంది. మెదడులో ఎలా ఐతే న్యూరాన్స్ ఎప్పుడూ సమాచార వినిమయాన్ని చేస్తుంటాయో ఈ సెమాంటిక్ వెబ్ ఆధారిత కృత్రిమబౌద్ధికతలో నాడీజాలికావలయాలు (న్యూరల్ నెట్వర్క్స్) కూడా వినియోగదారుడికి మరియు సెమాంటిక్ వెబ్ ఆధారిత కృత్రిమ బౌద్ధికతకీ మధ్య సమాచార వినిమయానికి అనుసంధానంగా పనిచేస్తాయి. ఇది వినటానికి ఆశ్చర్యంగా ఉందికదా. ఇదే ఆధునిక భాషకి ఊతం, ఇదే మాతృభాషలు బతకటానికి మాతృభాషల సంస్కృతి మళ్ళీ సాంకేతిక పురుడు పోసుకుని పునరుజ్జీవం కావటానికి ఆధారం. అంతర్జాతీయ మాతృభాషా శుభాకాంక్షలతో మరిన్ని వివరాలతో మళ్ళీ కలుద్దాం. అంతవరకూ అమ్మభాషను అందరం వాడదాం.

-వ్యాసరచయిత డా॥తొట్టెంపూడి శ్రీగణేశ్,
'డిజిటల్ హ్యూమానిటీస్'లో పరిశోధకుడు,
హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయం, జర్మనీ

సాంకేతికత

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# చాట్‌జిపిటి

**చాట్‌జిపిటి అనేది చాట్(చాటింగ్ – వలలో పాఠ్యం మాధ్యమంగా సంభాషించుకునే పద్ధతి) జెనెరేటివ్ ప్రి-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంక్షిప్త రూపం. ఈ మధ్య చాట్‌జిపిటిని అందరూ వాడుకునేందుకు వీలుగా ఈ పనిముట్టును తయారు చేసిన ఓపెన్‌ఏఐ సంస్థ జనబాహుళ్యంలోకి chat.openai.com లంకె ద్వారా అంచుబాటులో ఉంచింది. నవంబర్ 30, 2022న విడుదల చేసిన రోజు నుంచి అయిదు రోజుల్లో పది లక్షల వాడుకరులను నమోదు చేసుకొని అంతకు ముందు వేరే ఏ సాఫ్టువేర్ అందుకోని ఘనతను అందుకుంది. చాట్‌జిపిటిని 29 బిలియన్ డాలర్లకు విలువ కట్టాయి అంతర్జాతీయ మదుపు సంస్థలు. ఈ కొత్త పనిముట్టు గురించి తెలుసుకున్న ప్రతి ఒక్కరూ ఇదొక అద్భుతమని, ఇలాంటి మర పనితనం ఇంతకు ముందెన్నడూ చూడలేదని వాడుకర్లు చెప్పుకుంటున్నారు. ఈ బిస పనితనంపై వీడియోలు చేసి, తమ అనుభవాలను పంచుకుంటున్నారు.**

ఈ చాట్‌జిపిటి మర అమెరికాలో ఎంబిఏ విద్యార్థులకు, వైద్య విద్యార్థులకు పెట్టే పరీక్షలను సైతం రాసి, ఉత్తీర్ణమైందని వివిధ పత్రికల్లో చదువుతున్నాం.

ఒక వ్యాసం రాయమని అడిగితే, మనకెన్ని పదాల్లో ఏ అంశం మీద, ఏ కీలక పదాలు వాడి, సానుకూలాంగా/ప్రతికూలంగా రాసివ్వగలదు. ఏ ప్రశ్న అడిగినా ఠక్కున జవాబు చెప్పగలదు. కథలు, కవితలు, మినీ నవలలు, ఇలా సాహిత్యాన్ని రాసివ్వగలదు. లేదా సాహిత్యాన్ని రాసేందుకు కావాల్సిన ముడి సరుకు – శీర్షిక, కథనానుక్రమం, పాత్రలు, పాత్రల చిత్రణ, సంభాషణలు – ఇవన్నీ రాసివ్వగలదు. కంప్యూటర్ ప్రోగ్రాం రాసే సాఫ్టువేర్ ఇంజనీర్లకు వారి ప్రోగ్రాములు వారడిగిన భాషలో(సి, సి++, జావా, పైథాన్, జావాస్క్రిప్ట్) రాసివ్వగలదు. ఒక కథ, కవిత, పాఠ్యం ఇచ్చి దాన్ని మెరుగు పరిచివ్వమంటే, మెరుగు పరిచి ఇవ్వగలదు. ఏఐ ఆధారిత బొమ్మలను తయారు చేసి ఇవ్వగలదు. మనం ఇచ్చిన మిశ్రమ పాఠ్యాన్ని సరిదిద్ది వర్గీకరించిన పాఠ్యంగా మనకు తిరిగి ఇవ్వగలదు. తప్పులు, దోషాలు ఉన్న కోడ్‌ను ఇస్తే సరిచేసి ఇవ్వగలదు. ఒక క్లిష్టమైన పాఠ్యాంశాన్ని మూడేళ్ళ వయసు, ఐదేళ్ళ వయసు, పదేళ్ళ వయసు పిల్లలకు విడమరిచి సులువైన పదాల్లో మార్చి చెప్పమంటే, ఆ పనీ చేయగలదు. పరీక్షలు రాయగలదు.

స్థూలంగా చూస్తే చాట్ జిపిటి ప్రశ్నలకు జవాబులిచ్చే చాట్‌బాట్ (సంభాషణల ద్వారా వ్యక్తుల ప్రశ్నలకు జవాబిచ్చే ఒక బిస)కు పరిమితం కాకుండా మనిషి బుద్ధితో చేయగలిగే పాఠ్య రూపకల్పన (కథలు, కవితలు, పాటలు రాయడం)లాంటివి చేయగలుగుతుంది. అంటే ఇన్నాళ్ళూ మనం నేర్పించింది నేర్పించినట్టుగా ఒప్పచెప్పే పద్ధతి నుంచి తమ కల్పన ద్వారా సొంతంగా రాసుకునే స్థాయికి మరలు వచ్చేసాయి.

పైన చెప్పిన వాటిలో ప్రశ్న కాల్పనిక రచనను ఒక్కదాన్ని పక్కన పెడితే గూగుల్ దాదాపుగా అన్నీ చేసిపెడుతుంది కదా. “గూగుల్‌ను చాట్‌జిపిటి భూస్థాపితం చేస్తుందా?” లాంటి అనుమానాలతో చాలా మంది ఇప్పటికే వలలో తమ అభిప్రాయాలు వెళ్ళబుచ్చుతున్నారు. కానీ చాట్‌జిపిటి పరమావధి వేరు, గూగుల్ పరమావధి వేరు. మనకు కావాల్సిన సమాచారం ఉన్న పేజీలను గూగుల్ వెతికి తెచ్చి పెడుతుంది. చాట్‌జిపిటి తన పరిధిలో మనకు కావాల్సిన అంశం గురించి పరిమితంగా చెబుతుంది. రెండిటికీ చాలా తేడా ఉంది. నాకు తెలుగు భాష చరిత్ర గురించి తెలుసుకోవాలని ఉందనుకోండి. ఆ విషయం గూగుల్ లో వెతికితే తెలుగు భాష చరిత్ర ఉన్న అన్ని పుటలను నా ముందు ఉంచుతుంది. అందులో నుంచి నాకు నచ్చినంత మేర చదివి ఆకళింపు చేసుకుంటాను, నకలు తీసుకొని తిరిగి రాసి వాడుకుంటాను. అదే చాట్‌జిపిటి ని అడిగితే తెలుగు భాష చరిత్ర మీద ఒక నాలుగైదు పేరాల పాఠ్యం ఇచ్చి ఊరుకుంటుంది.

అందువలన గూగుల్‌ను చాట్‌జిపిటి భర్తీ చేయలేదు. కానీ చాట్‌జిపిటి ఇచ్చే పాఠ్యం గూగుల్ ఇచ్చే పాఠ్యం కన్నా మెరుగ్గా ఉంటుందన్నది ప్రస్తుతానికి ఒప్పుకోవాల్సిన విషయమే(కొన్ని అంశాల వరకు). అదే సమయంలో మనం గుర్తించాల్సిన మరొక విషయం ఏంటంటే చాట్‌జిపిటిని ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారంపై ఎప్పటికప్పుడు నేర్పు ఇచ్చి, ఆ పాఠ్యాన్ని అది గ్రహించి నిక్షిప్తం చేసుకునేలా చేస్తారు. ఈ పని కొన్ని రోజుల్లో, వారాల్లో జరుగుతుంది గనుక ఇవాళో నిన్నో చేర్చిన సమాచారాన్ని చాట్‌జిపిటి అందించలేదు. కానీ గూగుల్ లో ఇప్పటికిప్పుడు చేర్చిన సమాచారం కూడా నిమిషాల వ్యవధిలో, వార్తలైతే క్షణాల వ్యవధిలో వచ్చి చేరతాయి. చాట్‌జిపిటి ని కొన్ని ప్రశ్నలు వేసినపుడు అది తికమకగా సమాధానం చెప్పటమూ జరిగింది. ఆ అంశం మీద చాట్‌జిపిటి నేర్పు పొందిన అంశాల్లో పెద్దగా సమాచారం లేకపోవటం కావచ్చు. మషిన్ లర్నింగ్‌లో పేరున్న ఆండ్రూఎన్‌జి కొన్ని తమాషా ప్రశ్నలను చాట్‌జిపిటిలో అడిగారు. చాట్‌జిపిటికి తెలియని అంశాల్లోనే ఈ ప్రశ్నలు. అధునాతనంగా మషిన్ లర్నింగ్ లో జరుగుతున్న విషయాలపై అడగ్గా చాట్‌జిపిటి తప్పుగా సమాధానం ఇచ్చింది. చిన్న స్థాయి గణిత సమస్యలకు(చిన్ని చిన్ని కూడికలు, తీసివేతలు, హెచ్చించడాలు, భాగాహారాలు) ఇట్టే సమాధానమిచ్చే చాట్‌జిపిటి, కాస్త క్లిష్టమైన గణిత సమస్యలను తప్పుగా పరిష్కరిస్తోంది. ఇంకా చాట్‌జిపిటికి నేర్పించిన అంశాల్లో ఉండే వివక్షాపూరిత అభిప్రాయాలను యథాతథంగా చాట్‌జిపిటి ఒప్పచెబుతోంది. మంచి శాస్త్రవేత్తకు ఉండాల్సిన లక్షణాలు ఏంటి అని అడిగితే, తెల్లతోలుతో ఉన్న మగ వ్యక్తి శాస్త్రజ్ఞుడు అవ్వటానికి ఎక్కువ అవకాశాలున్నాయని చాట్‌జిపిటి చెబుతోంది. ఇలాంటి సమస్యలను మనం గూగుల్ వెతుకులాటలో పెద్దగా ఎదుర్కొని

ఉండకపోవచ్చు.

ఇక పనితనం, అందుబాటులో ఉండటం లాంటి అంశాలను పరిశీలిస్తే చాట్‌జిపిటికి కొన్ని పరిధులున్నాయి. నిమిషానికి ఎన్ని సమాధానాలు చెప్పగలదో, ఎంత మాత్రం పాఠ్యం అందించగలదో లాంటి విషయాల్లో ఇప్పటికీ చాట్‌జిపిటి నమ్మదగిన స్థాయిలో పని చేయటం లేదు. ఎక్కువ మంది వాడుతుంటే అందుబాటులో లేకుండా పోతోంది.

పైన చెప్పిన అంశాలన్నీ చాట్‌జిపిటిని ఆంగ్లంలో వాడటం గురించి మాత్రమే. తెలుగులో చాట్‌జిపిటి పనితనం ఎలా ఉంది, ఏ మాత్రం నమ్మొచ్చు అన్న విషయాలను గురించి మరెప్పుడైనా దీర్ఘంగా విశ్లేషించి రాస్తాను.

ప్రస్తుతానికి చాట్‌జిపిటిని తెలుగులో ఏం అడిగినా, ఆ ప్రశ్నను అది ఆంగ్లానికి మార్చుకొని, ఆంగ్లంలో వచ్చిన సమాధానాన్ని తీసుకొని, తెలుగుకు అనువదించుకొని మనకు చూపిస్తోంది.

తెలుగులో మడతనాలుకమాటలు కొన్ని చెప్పమని అడిగాను. ఈ విషయం తెలుగులో అడిగితే తెలుగు రాదనీ, ఇంగ్లిష్‌లో అడగమని చాట్‌జిపిటి చెప్తుంది. ఇంగ్లిష్‌లో అడిగినప్పుడు ఒక ఆంగ్ల మడతనాలుకపదం(టంగ్‌ట్విస్టర్)ను ఎంచుకొని దాన్ని తెలుగులోకి తర్జుమా చేసి అందించింది. అయితే ఇంతకు ముందు మరలు చేసే దోషాలు ఈ పాఠ్యంలో లేవు. లోపాలున్నాయి కానీ అవి మెల్లిగా చాట్‌జిపిటికి తెలుగును నేర్పించడం ద్వారా తొలగించుకోవచ్చు. అంటే ప్రస్తుతం చాట్‌జిపిటిని ఆంగ్లంలో మాత్రమే ట్రెయిన్ చేసారు. తెలుగులో చిన్నపాటి కవితలు, కథలు, రాయగలుగుతుంది.

ఇక సాంకేతికాంశాలను పొడి పొడిగా పరిశీలిద్దాం. విస్తృతంగా మరెప్పుడైనా.

**చాట్‌జిపిటి పాఠ్యాన్ని కొన్ని కొలమానాలతో పరిశీలిస్తుంది.**

ముందుగా పాఠ్యాన్ని పదాలుగా, పదాలను అక్షరాలుగా ముక్కలు చేసుకుని, ఒక్కొక్క ముక్కను తను నేర్చుకున్న అంశాలతో పొంతన చేసుకుంటుంది. ఈ ముక్కలు(టోకెన్‌లు) ఎన్ని ఎక్కువైతే చాట్‌జిపిటికి అంత ఎక్కువ శ్రమ.

ఆంగ్లంలో ఉన్న పదాలు లేదా అక్షరాలు ఆ విధంగా ముక్కలు చేసుకున్నపుడు, భాషలోని అంశాలు అర్థం చేసుకునేందుకు, చాట్‌జిపిటికి పెద్దగా సమయం కానీ వనరులు కానీ ఖర్చవ్వవు. mine అని నా అర్థం వచ్చే పదాన్ని నాలుగక్షరాలున్నా ఒకటే అంశంగా చాట్‌జిపిటి గుర్తిస్తుంది, కానీ తెలుగు నా ఒకే అక్షరం అయినా చాట్‌జిపిటి ప్రకారం ఇందులో రెండు పొడి అక్షరాలు(న్ ఉ ఆ), ఆరు టోకెన్‌లు ఉన్నాయి.

ఒక ఇంగ్లిష్ అక్షరం ఒక బైటు స్థానాన్ని ఆక్రమిస్తే, ఒక తెలుగు అక్షరం మూడు బైట్ల స్థానాన్ని ఆక్రమిస్తుంది.

అక్షరాల సంగతి అటుంచి, చాట్‌జిపిటి నేర్చుకునేందుకు, సమాధానమిచ్చేందుకు టోకెన్‌లను(పైన చెప్పుకున్న అర్థవంతమైన పాఠ్యపు ముక్కలను) యూనిట్‌గా తీసుకుని వినియోగదారునిపై ఖర్చును జరుపుతుంది కనుక తెలుగు భాషలో చాట్‌జిపిటిని నేర్పించడానికి ఖర్చు బాగానే అవుతుంది. వెయ్యి టోకెన్‌లకు కనీసం 10 రూపాయల ఖర్చవుతుంది.

అంటే ఒక ఆంగ్ల వ్యాసం రాసివ్వటానికి చాట్‌జిపిటికి 1 డాలరు ఖర్చయితే, అదే వ్యాసాన్ని తెలుగులో రాసివ్వటానికి 10 నుంచి 20 డాలర్లు ఖర్చవుతుంది.

ఆంగ్లంలో కన్నా తెలుగులో 10 నుంచి 20 రెట్లు ఎక్కువ ఖర్చవుతుందన్నమాట.

మనం మన మాతృభాష తెలుగులో మొదటి నుంచి ఎక్కువ పాళ్ళలో వలగూడులో సమాచారం చేర్చుతూ వస్తే ఈ సమస్య కాస్తలో కాస్త తీరేది. ఇప్పటికైనా మించిపోయినది లేదు. మన రోజువారీ సంభాషణలు మొదలు, వలగూడు(ఇంటర్నెట్)తో ముడిపడిన అన్ని అంశాల్లో తెలుగుకు పెద్దపీట వేద్దాం. సాంకేతిక బిసలు రూపొందించే సంస్థలు మొదటగా తెలుగులో కూడా సాంకేతికాలు అందించేలా చేద్దాం.

ఇందుకు ప్రభుత్వాల నుంచి ఒత్తిడి అవసరం లేదు. క్షేత్రస్థాయిలో అందరూ తెలుగు వాడితే అంతా తెలుగే అవుతుంది.

కవిత

## క్షణ కాలం

కన్ను తెరిస్తే జననం
కన్నుమూస్తే మరణం
క్షణకాలం ఈ (నీ,నా) జీవితం
తెలిసీ...

స్వార్థం, అసూయ,కోపం,
కల్మషత్వం,కుళ్ళు, కుతంత్రం...
సర్వస్వాన్నీ కోల్పోతున్నాం
సత్సంబంధాలకు కనుమరుగయ్యాం.

అమ్మా నాన్నా, అక్కా చెల్లీ
అన్నా తమ్ముడూ బంధాలన్నీ
కాదని విడిచావ్
నీకున్నది ఒకటే
నాదే... నాదే... నాదే
'తెలుసా! కాదేదీ నీదే'

భావం మారక
బంధం నిలువక
గమ్యం మరిచిన బాటసారిగా
ఆధారం తెగిన గాలిపటంలా
తిరిగీతిరిగీ ఒరిగేవో
అజ్ఞానంతో కనుమరుగయ్యేవో
ఇదంతా తెలిసీ...
'మనము' మారేదెన్నటికో
మనిషిగా బ్రతికేదెప్పటికో

పాటూరి నవీన్ 9908892989

బూసి వెంకటస్వామి
7386529274

# పైడి భాష-చారిత్రక నేపథ్యం

ప్రపంచంలో సుమారు ఆరు వేల భాషలున్నట్లు భాషా శాస్త్రజ్ఞుల అంచనా. వంశానుగుణ లక్షణాలను అనుసరించి వీటిని పది భాషాకుటుంబాలుగా వర్గీకరించి వాటిపై విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. అదే విధంగా భారతదేశంలో ఉన్న వివిధ భాషలపై కూడ పరిశోధనలు జరుగుతున్నాయి. ఆ క్రమంలో భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఈ మధ్య వెలుగులోకి వచ్చిన భాష పైడిభాష. ఈపైడి భాషను పైడి అనే జాతి ప్రజలు మాట్లాతున్నారు. ఈ జాతి ప్రజలు శ్రీకాకుళం, విజయ నగరం జిల్లాల్లో అధికంగానూ, విశాఖపట్నానికి వలసవచ్చిన వారిలో కొద్దిమంది కన్పిస్తున్నారు. వీరి మాతృభాష పైడి అయినప్పటికీ వ్యవహారంలో తెలుగు మాట్లాడతారు. ఆంధ్ర జాతికి ఏ విధమైన చారిత్రక నేపథ్యం ఉందో ఆదే విధంగా పైడి జాతికి ఉంది. అయితే అది చరిత్ర పుటల్లోకి నమోదుకాకపోవటం విచారకరం. ఆంధ్ర శబ్దం మొదట జాతి వాచకంగా తర్వాత దేశవాచకంగా అనంతరం భాషావాచకంగా ఎలా ఏర్పడిందో పైడి భాష కూడా మొదట జాతివాచకంగా ఇప్పుడు భాషా వాచకంగా వ్యవహారింపబడుతుంది.

**పైడిభాష- చారిత్రక ఉనికి**

'పైడి' అనేది జాతివాచకంగా బ్రిటిష్ గజిట్లో కన్పిస్తుంది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో 'పైడి జాతి ప్రజలను షెడ్యూల్ తెగలలో బ్రిటిష్ వారు పేర్కొన్నారు. ముఖ్యంగా 1891 సం లో మద్రాస్ జనాభాగణన నివేదికలో పైడి వారి గూర్చి తెలియ చేయటం జరిగింది. ఆ సమయంలో వీరిని గిరిజన తెగల సమూహంలో ఒకరుగా పరిగణించారు. వీరు నివశించే ప్రదేశం విజయనగరంగా పేర్కొన్నారు. ఆ తర్వాత 1918 సంలో బ్రిటిష్ వారు జరిపిన సర్వేలో గిరిజన తెగల సమూహం నుండి వీరిని తొలగించడం జరిగింది. ప్రస్తుతం వీరు షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చబడ్డారు..

పైడి అనే పేరు తమ జాతికి రావటానికి కారణం తాము ఎక్కువగా ప్రత్తిని పండిరచేవారమని ఆ ప్రత్తితోనే బట్టలు నేసేవారమని అలా బంగారంలా మెరిసిపోయే బట్టలు నేయటం వలన తమకు పయిడి > పైడి అనేపేరు స్థిరపడినట్లు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర సంచాలకులుగా పని చేసి పదవీ విరమణ పొందిన పాలక రాజారావు గారు తెలియజేసారు. తమ పూర్వీకులు నేతపనిలో ఆరితేరిన నైపుణ్యం ప్రదర్శించి తెల్లని వస్త్రాలు నేసేవారని, అదే తమ జీవన వృత్తిగా ఉండేదని కాలక్రమంలో ఆ వృత్తిని వదిలేసి వ్యవసాయ కూలీలుగా, ఇంటి పనిమనుషులుగా, కాపలాదారులుగా పని చేస్తూ జీవిస్తున్నారని తెలియజేసారు.

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నాలలో గిరిజన తెగల సమూహ సమీపంలో నివశించే ఈ పైడి జాతి ప్రజలను సవరులు డొంబ్ అని, కోంధ్లు పానోలని పిలుస్తారు. దీనిని బట్టి ఈ పైడిజాతి వారికి డొంబ్అని, పానో అనే పేర్లుకూడ ఉన్నట్లు విశదమవుతుంది.

**పైడి భాష**

పైడిజాతి ప్రజలు మాట్లాడే భాష ఎప్పుడు పుట్టిందో ఇతిమిత్థంగా చెప్పలేము తమ జాతి ప్రజలు ఎప్పటి నుండో ఈ భాష మాట్లాడు తున్నట్లు పాలక రాజారావు గారు తెలియజేసారు. పైడి భాషను పరిశీలించినప్పుడు ఇది ఒరియా భాషకు, బెంగాలీ భాషకు దగ్గరగా ఉన్నట్లు తెలుస్తుంది. ఆంధ్ర దేశంలో నివశిస్తున్న ఈ జాతి ప్రజలు బహుశా వందల సంవత్సరాల క్రితమే చోటా నాగపూర్ ప్రాంతం నుండి వలసవచ్చారేమో ననిపిస్తుంది. ఈ భాషా లక్షణాలను పరిశీలించినప్పుడు ఇది ఇండో యూరోపియన్ భాషాకుటుంబంలోని ఇండో-ఆర్యన్ ఉపకుటుంబానికి చెందిన నవీన ఔత్తరాహ భాషల సరసన ఉన్నట్లు చెప్పవచ్చు. ఒరిస్సాలోని డొంబ్ ప్రజలు డొంబ్భాషను మాట్లాడుతుంటారు. ఇది ఒరియా భాషలోని చాలా మారుమూల ప్రాంతంలో నివసించే నిరుపేదలు మాట్లాడే మాండలికం. ఈ మాండలికమే డొంబ్ ప్రజల భాషగా కాలక్రమంలో స్థిరత్వం పొందింది. అదేవిధంగా ఆంధ్రదేశంలో పైడి ప్రజలు మాట్లాడే తెలుగు-డొంబ్ పదాల కలయిక వల్ల ఏర్పడిన మాండలికంతో నేడు అది ఒక భాషగా చలామణి అవుతుంది.

పైడి భాషను మాట్లాడే పదాలు లేదా వాక్యాల నిర్మాణాన్ని బట్టి ఇది ఇండో ఆర్యన్ భాషా కుటుంబంలోని నవీన ఔత్తరాహ భాషలో చెలామణిలో ఉన్న ఒకానొక మాండలికమే కాలక్రమంలో భాషగా పరిణామం చెందిందని చెప్పవచ్చు.

**పైడి భాషా పదాలు - తెలుగు భాష అర్థాలు**

| పైడిభాష | తెలుగు భాష |
|---|---|
| నొవలి | నాగలి |
| బొలొదు | ఎద్దులు |
| దానం | ధాన్యం(వరి) |
| దా | కొడవలి |
| సబాలు | గునపం |
| కొడ్డి | పార |
| బడను | చీపురు |
| చొడవ | పళ్లెం |

పై పదాలు పరిశీలించినప్పుడు తెలుగు భాషా పదాలకు ఉన్న సంబంధం తక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది . ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన భాషలతో అంతగా సంబంధం లేనట్లు చెప్పవచ్చు.

పైడిభాషలో క్రియా పదాలు ప్రయోగించే సమయంలో ఆయా

**తరువాయి 33వ పుటలో....**

శ్రద్ధాంజలి

కొండపల్లి సుదర్శనరాజు
99494 78251

# ఆదర్శ ఆచార్యులు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు(కె.వి)గారు



**ఉ**న్నత ఆశయాల్ని, మహోన్నత ఆదర్శాల్ని, వామపక్ష భావజాల సిద్ధాంతాల్ని చివరి వరకు చిత్తశుద్ధితో అవలంబించిన తత్వం కె.వి. సొంతం. రాజనీతి శాస్త్ర పూర్వాచార్యులు కాట్రగడ్డ వెంకటేశ్వర్లు 'కె.వి.'గా సుప్రసిద్ధులు. వీరు రాఘవయ్య, నారాయణమ్మ దంపతులకు గుంటూరు జిల్లా పాములపాడు గ్రామంలో 22-11-1935 సం॥లో జన్మించారు. పాఠశాల విద్య అనంతరం గుంటూరు ఏ.సి. కళాశాలలో డిగ్రీని, ఆంధ్రాయూనివర్శిటీలో ఎం.ఏ.ని చేశారు. ఇక్కడే ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పర్యవేక్షణలో 'మహాభారతం-రాజనీతి' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ను పొందారు. ఈ గ్రంథాన్ని ఇంగ్లాండులోని రౌలేట్జ్ ముద్రణశాల ప్రచురించింది. దీని తెలుగు అనువదాన్ని నవోదయ ప్రచురణ సంస్థ వెలువరించింది.

పరిశోధనా సమయంలో ప్రముఖ చరిత్రకారులు, మార్క్సిస్టు విమర్శకులు అయిన డి.డి. కోశాంబిని కలిసి వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. వీరి మధ్య ఏర్పడిన సాన్నిహిత్యంతో కె.వి. దృష్టి కోణం స్థిర ప్రగతిశీల భావాలకు నిబద్ధమైంది. రాజకీయ వ్యవస్థపై ప్రాచీనులైన ప్రాచ్య, పాశ్చాత్యులు వెలుబుచ్చిన భావజాలాన్ని మహాభారతానికి అన్వయించి విశ్లేషించారు. వీరు రాసిన 'డెమోక్రసీ ఎట్ వర్క్' అనే రచనలో సమాజంలో నెలకొన్న విచక్షణా రహిత దోపిడీని, భ్రష్టుపట్టిన రాజకీయ వ్యవస్థలోని లోపభూయిష్ట విధానాల్ని దుయ్యబట్టారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అవరోధాలైన అన్ని అంశాల్ని నిర్మోమాటంగా ఎత్తి చూపే నైజం వారిది. సత్యాన్వేషణ, హేతుత్వ ధోరణికి ఆ విమర్శలు అద్దం పడతాయి.

"ఆంధ్రప్రదేశ్ దర్శిని" అనే సంకలన గ్రంథంలో వీరు సప్రమాణికమైన ఉత్తమ వ్యాసాల్ని రాసి ప్రముఖుల ప్రశంసల్ని అందుకున్నారు. విశాలాంధ్ర ప్రచురించిన యిది అనేక పునర్ముద్రణలకు నోచుకుంది. తిరిగి ప్రచురించే సమయంలో తమ వ్యాసాల్ని అత్యాధునికంగా అదనపు సమాచారాన్ని జోడిస్తూ పాఠకులకు సంబంధిత అంశాల్ని పరిపూర్ణంగా అందించడం కె.వి. నిరంతర కృషికి నిదర్శనం.

వీరి మరో రచన "Colonialism, Orientalism and Dravidian Languages" అనేది. ఇది 2012 సం॥లో అచ్చయింది. దీనిని కూడా రౌలేట్జ్ వారే ప్రచురించారు. దీన్ని దుర్గెంపూడి చంద్రశేఖరరెడ్డి తెలుగులోకి 'వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు' అనే పేరుతో అనువదించగా 2020 సం॥లో ఆచార్య వకుళాభరణం రామకృష్ణ పూనికతో ఎమెస్కోవారు ప్రచురించారు. రెండు భాషల్లో వచ్చిన ఈ గ్రంథాన్ని కె.వి. తన జీవిత భాగస్వామి ఆచార్య శారదకు అంకితమిచ్చారు. ఆరు అధ్యాయాల్లో సాగే ఈ గ్రంథంలో 'సమస్య' అనే ప్రారంభ ప్రకరణం వీరి విస్తృత పఠనానికి అవగాహనకు నిదర్శనం. వీరు ప్రస్తావించిన రచనలు, వాటిలో వ్యక్తమైన భావాల్ని క్రమపద్ధతిలో తమ సిద్ధాంత ప్రతిపాదనకు ఉపబలకంగా ఉపయోగిస్తూ, సోపపత్తికంగా విశ్లేషించిన తీరు అమోఘం. మిక్కిలి వైశిష్ట్యాన్ని సంతరించుకున్న ఈ రచనను గూర్చి ప్రముఖ పత్రికా సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ "తెలుగుకున్న వ్యాకరణ, నిఘంటు చరిత్ర ఎంత పురాతనమైన పునాదులు గలదో 'ద్రావిడ భాషాకుటుంబం' అనే ఉత్తమ భావనను రూపొందించి, దానిని తేజోవంతం చేయడంలో తెలుగు ఎలా ప్రధానమయిందీ ఈ గ్రంథం వెల్లడిస్తుంది" అని ప్రశంసించారు. అలాగే సుప్రసిద్ధ విమర్శకులు యు.ఏ. నరసింహమూర్తి "దక్షిణ భారతదేశపు సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస దశల్లో తెలుగువారు, తెలుగు ప్రాంతం నిర్వహించిన క్రియాశీలక పాత్రను కొత్తకోణం నుంచి లోకానికి వెల్లడించే ప్రయత్నంలో ఆచార్య వెంకటేశ్వర్లు కృతకృత్యులయ్యారు" అని శ్లాఘించారు.

రాసినా, బోధించినా వారి ప్రతిభా సామర్థ్యాలకు ప్రశంసలు దక్కేవి. సరళంగా, సులభగ్రాహ్యంగా పాఠ్యాంశ బోధనలో మాష్టారిది విలక్షణమైన బాణి. లోతైన విశ్లేషణలతో, సహేతుక వ్యాఖ్యానాలతో వారి ఉపన్యాసాలు ఆలోచింపజేసేవిగా, తలలూపుతూ తన్మయత్వం చెందేవిగా వుండేవి. ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులుగా వివిధ హోదాల్లో గణనీయమైన సేవలందించారు. అంతేకాక



2012 సెప్టెంబరు 14న విశాఖపట్నం, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆచార్య కాట్రగడ్డవెంకటేశ్వర్లు గారికి గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 129వ జయంతి సందర్భంగా గాడిచర్ల 18వ అవార్డును ప్రదానం చేసిన సందర్భం.

హాస్టలు వార్డెన్‌గా నాణ్యతా ప్రమాణాలతో భోజనాన్ని పరిశుభ్రంగా అందించేందుకు అనేక చర్యల్ని చేపట్టి విద్యార్థుల మన్ననల్ని పొందారు. చదువు పట్ల ఆసక్తి వుండి ఆర్థిక సమస్యలతో వుండే పేదవాళ్ళకు ఫీజులు కట్టి, వారు డిగ్రీలతో గట్టెక్కడానికి తోడ్పడ్డారు. ఈ రకంగా లబ్ది పొందిన వారిలో దళితులే అత్యధికంగా ఉండడం వారి సమదృష్టికి నిదర్శనం. విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సత్వరమే వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేసేవారు. అర్హులైన ఆర్తులకు గుప్తదానం చేసేవారు. చిన్న సాహిత్య సంస్థలకు, రచయితలకు ఆర్థిక సహాయాన్ని అందించేవారు. కొద్దిమంది నెలసరి వసూళ్ళను కూడా వీరి నుండి పొందేవారు.

కె.వి. గారిని అమితంగా ప్రేమించి, ఆరాధించే శిష్యులు దేశవిదేశాలలో అనేకమంది వున్నారు. సివిల్ సర్వీసెస్, విశ్వవిద్యాలయం, కళాశాల ఆచార్యులు ఇంకా వివిధ స్థాయిల్లో ఉన్నత శిఖరాల్ని అధిరోహించిన శిష్య సంపదతో పిల్లల కోడిలా దర్శనమిచ్చేవారు. స్వశాఖలోనే కాక విశ్వవిద్యాలయ వ్యాప్తంగా అభిమానిస్తూ వారిని అనుసరించేవారు అనేకమంది ఉన్నారు. అనుచరగణంలో ఒకరైన ఆచార్య వెలమల సిమ్మన్న 'యుగకర్త గురజాడ' అనే తన గ్రంథాన్ని వీరికి అంకితమివ్వడం మాష్టారి ప్రతిభ విస్తృతమయిందని అర్థమౌతుంది.

2012 సం॥ వీరికి ప్రతిష్ఠాత్మకమైన గాడిచర్ల పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని గతంలో డా॥ వెలగా వెంకటప్పయ్య, డా॥ కాళోజీ నారాయణరావు, డా॥ వావిలాల గోపాల కృష్ణయ్య, పొత్తూరి వెంకటేశ్వరరావు లాంటి ఉద్దండులు అందుకున్నారు.

తెనాలికి చెందిన కొత్త శారద గారిలో వీరికి వివాహం జరిగింది. వీరు కూడా గ్రంథాలయ శాస్త్రంలో పిహెచ్.డి. చేసి అదే శాఖలో పని చేస్తూ బోధన, పరిశోధన, రచనా వ్యాసంగాల్లో మంచి గుర్తింపు పొందారు. వీరి పర్యవేక్షణలో అనేకమంది డాక్టరేట్ డిగ్రీలు అందుకున్నారు. ఈ ఆచార్య దంపతులకు రజనీకాంత్, శ్రీనివాస్ అనే ఇద్దరు కుమారులు, లక్ష్మి అనే కుమార్తె వున్నారు. కుమార్తెకు విశ్వవిద్యాలయంలో ప్రతిభ ఆధారంగా వచ్చిన ఉద్యోగానికి తండ్రి సిఫార్సు వల్ల లభించిందని ఉత్పన్నమైన కువిమర్శలకు ఆమె చేత రాజీనామా చేయించిన సున్నిత మనస్కులు మాష్టారు. ఎటువంటి వ్యాపకాలు, వ్యసనాలు లేని నికార్సయిన విద్యావేత్త. వీరికి చివరి మజిలీ రాజమండ్రి అయింది. రెండో కుమారుడు శ్రీనివాస్ ఇంట్లో 10-01-2023న 88 సం॥ల ప్రాయంలో తనువు చాలించారు. జనవరి 22వ తేదీన రాజమండ్రిలో, 23న విశాఖపట్నంలో సంస్మరణ సమావేశాలు సముచిత రీతిలో జరిగాయి.

నిరాడంబరంగా, నిరంతర అధ్యయనశీలిగా ఎందరికో ఆరాధ్యదైవంగా వెలుగొందిన 'కేవీ'గారు, ఆదర్శ ఆచార్యులుగా జ్ఞాపకాల స్మృతి పథంలో పదిలంగా వుండిపోతారు.

వ్యాసరచయిత ఆచార్య కొండపల్లి సుదర్శనరాజు
విశ్రాంతాచార్యులు,తెలుగుశాఖ:ఆంధ్ర విశ్వకళాపరిషత్,విశాఖపట్నం.

"భాషాపెత్తనం స్వరాజ్యం కాబోదు. మొదటి ప్రాధాన్యత ఎల్లవేళలా మాతృభాషదే. ఆ తర్వాతనే హిందీ భాష. నిఖార్సయిన ఉన్నతి మాతృభాషతోనే సాధ్యం" -మహాత్మాగాంధీ

సన్నిధానం నరసింహశర్మ
92920 55531

# మౌలిక పరిశోధక జీవి: కీర్తిశేషులు కె.వి.



**కా**ట్రగడ్డ వెంకటేశ్వర్లుగా వ్యాసం, గ్రంథరచయితగా కె. వెంకటేశ్వర్లుగా ప్రసిద్ధులు ; ఆత్మీయ మిత్రగణం, శిష్య ప్రశిష్యులు ఆయన్ని కె.వి. గారని పేర్కొనడం సుప్రసిద్ధం.

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రంలో ఆయా విభాగాల్లో పనిచేసిన భాషా శాస్త్రంలో శిఖరాయమాన వశీలిక కృషి చేసి ఫలవంత రచనలు తెలుగుజాతికందించిన మహానుభావుడు. జర్మనీ తత్త్వవేత్త arthur schopohver మానవుని కార్యకలాపాల పరిధిని డెబ్బదియేళ్ళ పరిధిగా భావించి "the first forty yeras of life gives us the Test, the next thirty supply the commentary on it" అన్నాడు. ఇది అందరిలో సరిపోదని నిరూపితమైన జీవితాల్లో ఇటీవల దివంగతులైన ఆచార్య కె.వెంకటేశ్వర్లు గారి దొకటి.

మౌలిక పరిశోధక పాఠ్య గ్రంథంగా జీవితాంతమూ వెలుగొందారు.

'ప్రమేయఝరి' అనే ఓ నా వ్యాస గ్రంథానికి ఆయన ఒక అవిస్మరణీయ పీఠికను ప్రసాదించారు. 'ఆంధ్రశబ్ద చింతామణి తెలుగు దేశ్యాన్ని ప్రవాహినిగా పేర్కొన్నది. సన్నిధానం తన గ్రంథానికి కలవని శీర్షిక ద్వారా చెప్పక చెబుతున్నారు. ఎంతటి చమత్కారం. ఒక్క శీర్షిక ద్వారా అన్ని లక్ష్యాలను ఛేదిస్తున్నాడో రచయిత, సాహిత్య సవ్యసాచి' అన్నారు, అందులో. ఇందులో నా గురించినవి అనేది ప్రక్కన పెడితే ఒక సామాన్య రచయిత గురించి రచన విశ్లేషణలోనూ ఎంత విశాలంగా ఆలోచిస్తారో అనేదే ప్రస్తుత వస్తుగతాంశం.

ఆయన సాత్త్విక స్వభావం ఒక వైయక్తిక ఆభరణం. సంయమనం, సత్యసంధత లక్ష్యాలుగా సాగుతుంది- ఆయన పరిశోధన.

సంస్కృతం నుండి తెలుగు వంటి ద్రావిడ భాషలు పుట్టలేదని, స్వతంత్రప్రతిపత్తి కలవి అని ప్రామాణీకరించిన ఎలిస్‌వైట్, ఆయనను అనుసరించిన కొందరు విదేశీయ భాషాశాస్త్రజ్ఞుల్ని, వీటిని నమ్మే కొందరు దేశీయ పండితుల కోణాలను బలపరుస్తూ రచనలను సాగించిన మూల మౌలిక దేశీయ భాషాభిమాని ఆయన అవడం క్రొత్త రూపాల్ని ప్రయత్నాలకు దోహదం చేశారు. ఎంత సాత్త్విక వేత్త కె.వి.గారయినా కొత్తపల్లి వీరభద్రరావు ప్రభృతులు పొరపాట్లు పడిన సందర్భాలను చెప్పే విధానాల్లో సూటిదనం నిక్కచ్చితనం వుంటుంది తప్ప వైయక్తిక వ్యతిరేకతలు, నిందా వాక్యాలు ఏమీ వుండకపోవడం దూకుడు సినిమా లేకపోవడం ఆయన ప్రత్యేకతలు. 'ద్రావిడ భాషా కుటుంబ భావన' అనే ప్రయోగం ఆయనకు చాలా యిష్టం.

ఆంధ్రరాయుడు అనే రాజు గోదావరి తీరంలో తాను నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ముందు అచ్చ తెలుగు పదాలు మాత్రమే వాడుకలో ఉండటం వంటి విషయాలు కాట్రగడ్డ వ్రాశారు. వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు అనే ఆయన ఆంగ్ల గ్రంథం చాలా గొప్పది దానిని డి. చంద్రశేఖరరెడ్డి తెలుగులో అనువాదం చేసీ ఎమెస్కో ముద్రించడం భాషాసేవలో భాగం కాకపోదు. విలియం బ్యాను తెలుగు గ్రామర్ పుస్తకాన్ని సి.పి.బ్రౌన్ రాసినట్లు తప్పుచెప్పారని అంటూ దీనిని విద్వేషబుద్ధితో తాను చెప్పట్లేదని కె.వి.గారు తమ హృదయాన్ని తెలుపుతూ, ఒక అనన్య సామాన్య పదప్రయోగాన్ని చేసి కె.వి. తన భావన స్పష్టతను ఎలా చెప్పారో చూడండి.

"ద్రావిడ భాషాకుటుంబ భావన రూపుదిద్దు కోనదంతో తెలుగు వ్యాకరణ సంప్రదాయం, దేశీయ పండితులు పోషించిన పాత్రను తెలుసు కోవాలంటే తెలుగు భాషాశాస్త్రం - ద్రావిడ భాషాశాస్త్రం రంగంలో ఒక భూకంపం రావలసి వుంది" (వలసవాదం, ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు)

ఈ వాక్య ప్రయోగాన్ని కొంతసేపు తదేకంగా ఆలోచిస్తే మన భవిష్య ప్రణాళికలు ఎలా వేసుకోవాలో దారిదీప కాంతి ప్రసరిస్తుంది.

పత్రికల ద్వారా కొన్ని గ్రంథాల ద్వారా ఉపన్యాసాల ద్వారా 'ఆంధ్ర ధాతుమంజరి' వంటి ప్రాచీన పెన్నిధుల ప్రకటనల ద్వారా ఆయన అమరుడు. మంచి మంచి పుస్తకాలను ప్రకాశింప చేసిన ప్రకటనకర్త, పుస్తక వితరణశీలి. వీరేశలింగం వారిలా భార్యా ప్రేమికుడు.

ప్రేమతో కూడుకున్న ఫోను పలకరింపుల్లోనూ భాషాసాహిత్యాల

**తరువాయి 32వ పుటలో....**

పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# ధనిక పాశ్చాత్యం-పేద ప్రాచ్యం; ప్రాచ్య మార్గం-దేశిమూలం; భావదాస్యానికి ప్రత్యామ్నాయం

**ఈ ప్రస్థానంలో, వెంకటేశ్వర్లుగారు బయటపెట్టినట్లు, కీలక స్థానంలో ఉన్న కొందరు ప్రముఖుల ఆశ్రిత, పక్షపాత ధోరణి వంటి వ్యక్తిగత లోపాలు(పుట 17) తెలుగుతనానికి తాత్కాలికంగా నష్టం కష్టం కలిగించిన మాట నిజమే. కాని తెలుగుజాతి తన వారసత్వాన్ని ఆవిష్కరించుకోవటంలో వేసిన తప్పటడుగులలో ఒకటిగా ఆ లోపాలను వదిలేసి ముందుకు పోవాలి. జాతి జీవనదిగా ప్రవహిస్తున్నంత కాలం ఇటువంటి మాలిన్యాలను కడిగి వేసుకోగలదు.**




**జ**నవరి నెలలో స్వర్గస్తులైన కాట్రగడ్డ వెంకటేశ్వర్లు గారి 'వలసవాదం,ప్రాచ్యవాదం, ద్రావిడ భాషలు' Colonialism,Orientalism and the Dravidian Launguages 2012, అనువాదం ఎమెస్కో 2020) తెలుగు జాతి, భాష, చరిత్రల మీద మౌలికమైన పరిశోధన. తెలుగుదేశం సంస్కృతీకరణం బాట పడితే, తమిళనాట జైనులు, దేశి సాహిత్యసృజనకు (మణిమేఖల, శిలప్పదిగారం వగైరా సంగం సాహిత్యం) కారకులయ్యారని ఆయన గమనించారు. తెల్లవాళ్ళ సహకారంతో ప్రాచ్య, దేశి సంప్రదాయాలకు దొరికిన అండదండలతో 'దేశివాద ఇతివృత్తాన్ని పట్టుకుని ముందుకు సాగటం, నేడు, వలసానంతర సమాజాలకు లాభదాయకము, సౌకర్యమూ కూడా' (301) అని ఆయన సలహా ఇచ్చారు. అయితే నాయనార్, ఆళ్వారులదాడికి తెరమరుగై పారాయణకే పరిమితమైన సంగం దశ జైన, బౌద్ధ సంప్రదాయాలు, తమిళనాట పునరుజ్జీవనంలో, కీలక పాత్రవహిస్తే,తెలుగువారు ఆరంభశూరులుగానే మిగిలిపోయిన వాస్తవాన్ని ఒప్పుకునేముందు. వెంకటేశ్వర్లుగారి పరిశోధన సారాంశాన్ని ఆయన మాటలోనే తెలుసుకోవటం అవసరం.

'తెలుగు సాహిత్యమంతా బ్రాహ్మణ రచయితలు సృష్టించినదే. దీనికి భిన్నంగా తమిళ సాహిత్యం బ్రాహ్మణేతర కులాలవారు సృష్టించినది. విశిష్ట శక్తిగలిగిన ఒక జాతీయ బ్రాహ్మణ వ్యతిరేక భావోద్వేగంచేత ప్రోత్సాహితులై, జైనులు సంస్కృత సాహిత్యానికి భిన్నమైన తమిళ సాహిత్య సృజనకు కారకులయ్యారు'.(147) కాని, తెలుగునాట, సంస్కృత పదాలు తెలుగు ప్రత్యయాలు చేరి తెలుగుగా వ్యవహరింపబడినట్లుగానే, బ్రాహ్మణులకు పరిమితమైన వైదిక కర్మకాండ కలాపాన్ని బ్రాహ్మణేతరులుకూడా కోరుకోవటం. ఇది ఆంధ్ర సంస్కృతిలో, వేరుచేసే లక్షణంకాక కలుపుకుపోయే స్ఫూర్తి ఉందని నిరూపిస్తుంది.(150)

జందేలు వేసుకున్నవాళ్ళకే వేదవిహితమైన కర్మకాండ చేసే అర్హత అని కట్టడి చేస్తే, 'ద్వితీయ శ్రేణి పౌరులవలె పురాణోక్త సంప్రదాయాలతో సరిపెట్టుకోవలసిన వైశ్య వర్గానికి చెందిన (తెలుగు భాషకు వ్యాకరణాలలో ఒకటి ఆంధ్ర దీపిక రాసిన) మామిడి వెంకయ్య', బ్రాహ్మణుల గుత్తాధిపత్యంలోని పౌరోహిత్యంలోని వైదిక కర్మకాండ నిర్వహణానికి పురోహిత పాత్రవహించటం కోసం' పోరాటం చేశారు'.(223) .

1812లో దక్షిణ భారతభాషల బోధన, అదే సమయంలో రైత్వారీ విధానం ప్రవేశపెట్టటం యాదృచ్ఛికం కాదు. అది పద్దెనిదవ శతాబ్ది ద్వితీయార్థంలో మూలాలున్న వలస చారిత్రక ప్రక్రియలో పరాకాష్ఠ. కంపెనీ, అప్పటి నుండి బ్రిటిష్ పాలన ఉపసంహరణ వరకు, ఆ తరువాత స్వతంత్రభారతంలో కూడా అవినీతిని, అధికార దుర్వినియోగాన్ని బ్యూరోక్రసీ నుండి తొలగించటంలో విఫలమయ్యారు. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి స్వీయప్రయోజన క్రమాన్ని లాభం కోసం పాకులాడటం భారతదేశం శాశ్వత లక్షణాలలో ఒకటయ్యింది. భారతదేశ హీనత్వాన్ని, పేదరికాన్ని ఇది పాక్షికంగా వివరిస్తుంది.(277)

తూర్పు అన్నది మార్పులేనిది, అంతర్గత గతిశీలం లేనిది. మతపరమైన సంప్రదాయానికి, పారలౌకికతకు, నిరంకుశ అధికారానికి పాలనకు కరడుకట్టిన కుల సామాజిక తెగల

బృందాలకు ప్రసిద్ధమైనది. పాశ్చాత్యం పురోగమన శీలమైనది. హేతుబద్ధం, శాస్త్రీయం, వ్యక్తిగతం, భౌతికం, లౌకికం చట్టబద్ధమైన పాలన మొదలైనవాటికీ ప్రసిద్ధం (పుట 246) ( హిస్టరీ ఆఫ్ బ్రిటిష్ ఇండియా జేమ్స్ మిల్ 1817)అనే అభిప్రాయం మనలో పాతుకుపోయింది.

'పునరుజ్జీవనం తర్వాత, చరిత్ర సంస్కృతులకు సంబంధించి పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరార్ధంలో సంస్కృత సాహిత్యాన్ని కనుకోవడమంత విశ్వవ్యాప్త ప్రాధాన్యమున్న సంఘటన మరొకటి లేదు' అన్నాడు మాక్డోనాల్ (పుట 192) 'ప్రాచ్యవాదం అంటే తూర్పు దేశాలు ప్రజల సంస్కృతికి సంబంధించి పాశ్చాత్య పండితులు పరిశీలకులు నిర్మించి, వ్యాఖ్యానించిన జ్ఞానసమాహారం(234). కాని ఆధునిక యుగపు ప్రాచ్య అధ్యయనం లక్ష్యం ప్రాచ్యాన్ని జయించి పాలించటం.(238) ప్రాచ్యవాదం సామ్రాజ్య వాదానికి తోడుదొంగ(259). నూతన జ్ఞాన నిర్మాణం పూర్తిగా వలస ప్రభుత్వ అధికారం మీద ఆధారపడినది కాని, పూర్తిగా వలస ప్రభుత్వం ఆసక్తులు లక్ష్యాలు నేరవేర్చేది కాదు(281)'. భారతదేశంలో ఒకగొప్ప ప్రాచీన సంస్కృతే కాకుండా, ఒక అద్భుతమైన నిరంతరంగా కొనసాగుతున్న దేశీ పాండిత్య సంప్రదాయం కూడా బ్రిటిష్ వారికెదురయింది.(296)

1970 నుండి మొదలైన ప్రాచ్య దేశాల అస్మిత, అస్తిత్వ అన్వేషణ– 'ఓరియంటలిజం (ప్రాచ్య వాదం), ప్రపంచవ్యాప్తంగా ఆఫ్రో ఆసియన్ విద్యాత్మిక అధ్యయనాల భూదృశ్యంలో ప్రకంపనాలను సృష్టించింది(248). అయినా, మానవజాతికి సంబంధించిన పర్యావరణం, భూతాపం, ఉగ్రవాదం, నిరాయుధీకరణ కార్యక్రమాలు, శాంతి ఆహారభద్రత ఆరోగ్యం వంటి సాధారణ ఉమ్మడి సమస్యలు కూడా పాశ్చాత్య నియతివాద ప్రాబల్య ప్రభావంకిందనే ఉన్నాయి. దీనికి అదనంగా ప్రపంచీకరణ, సాంకేతికతలో విప్లవాత్మక ప్రగతి, విశ్వవ్యాప్తంగా పెట్టుబడి, సమాచార బదిలీ ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ఏకీకరణ పరుగుపందెంలో పాశ్చాత్యాన్ని అగ్రభాగాన, ప్రాచ్యాన్ని ఓటమి పక్షాన పెడుతున్నాయి. (300). ప్రపంచ సందర్భం ప్రాచ్య పాశ్చాత్య సంబంధంలో పరివర్తన కోరుకుంటున్నది(302). వలసానంతర సమాజాలు సమకాలీన ప్రపంచంలో తనకు రావలసిన న్యాయమైన స్థానాన్ని సంపాదించుకోవటంకోసం వలస వ్యతిరేకవాదం, దేశి వాద సిద్ధాంతాల అర్థం, ప్రాసంగికతను సవరించుకొని తాజా దృక్పథాన్ని ఏర్పరచుకోవలసిన అవసరం ఉంది(301).

**'గ్రామ్య పదాలను ఒక ప్రత్యేక వర్గంగా చెప్పటం తెలుగు వ్యాకర్తలు ప్రవేశపెట్టినదే. వ్యాకరణ శాస్త్రంలో పదవర్గీకరణప్రణాళికలో కాని సంస్కృత ప్రాకృతాలలోగాని ఇది కనిపించదు.** తెలుగు వ్యాకరణ సంప్రదాయంలో గ్రామ్యం గ్రామీణ ప్రజల వ్యవహారం. నిరంతర సృజన పరిణామం వికాసం చెందగలిగిన సామర్థ్యం ఉన్న సజీవ భాష గ్రామ్యం దేశ్యంలో భాగమే'(178)నని కేతన నుండి అప్పకవి దాకా నొక్కి చెప్పారు. కాని **క్రమంగా తెలుగునాట శిష్ట ప్రామాణిక భాష ఈ గ్రామ్యాన్ని పక్కకు నెట్టింది. తెలుగు వ్యక్తిత్వం మీద చావు దెబ్బతీసింది.** 'వెన్నెముకలేని మధ్యతరగతి సాహిత్యంలోకి ప్రవేశించింది(సాహిత్యంలో వస్తు శిల్పాలు. త్రిపురనేని మధుసూదనరావు పుట 117) రామానుజన్, కన్నడ తమిళ జానపద, సంగం సాహిత్యాలను ఆంగ్లంలోకి అనువదించి, ప్రాచ్య పాశ్చాత్య విచార ధారతో సమన్వయించి, వాటికీ అంతర్జాతీయంగా ప్రాసంగికత తెస్తే, మనం రష్యన్ జానపద సాహిత్యాన్ని మక్కికి మక్కీ అనువదించి దిగుమతి చేసుకున్నాం. పైగా మన జానపద సంప్రదాయాలను 'ఈ కల్పనా కథలకు పుక్కిటి కథలని పేరువచ్చింది. సహేతుకంగాను, సుసంగతంగాను తోచక పోవటంవల్ల ఈ పుక్కిటికథలకు సంబంధించి 'కథకు కాళ్ళు లేవు, ముంతకు చెవులు లేవు' అన్న సామెత పుట్టుక రావటానికి వీలైంది... కథను నేలపైన నడిపించాలనే ఆ ప్రయత్నంలోంచి, ఈ నాడు మనం కథ, చిన్న కథ, కథానిక అన్న పర్యాయపదాలతో shortstory అన్న సాహిత్య ప్రక్రియ ఉద్భవించింది' ( తెలుగు కథకులు, కథన రీతులు.2 ప్రస్తావన.విశాలాంధ్ర) అయితే ముగింపుతోచని ఈ కథాసాహిత్యం, విప్లవ మార్మికత, మేజిక్ రియలిజం, అస్తిత్వాది వాదాల ఆసరాతో చేసే శిల్పపు కర్రసాములు కావ్యామృత రసాస్వాదంలో ఓలలాడిస్తున్నాయి. కాగితపు పులుల భజన సంఘాలను తయారుచేస్తున్నాయి. తెలుగు మెదళ్ళు మూసుకుపోయాయి. ప్రశ్నించటం మరిచిపోయి, ఆలోచన రేకెత్తించ లేకపోతున్నాయి. **వీళ్ళు పుక్కిటి పురాణాలు అన్నవాటినే, ఏ.కే. రామానుజన్ folk tales of india గా అనువదించి ప్రపంచ వ్యాప్తి తెచ్చాడు. అన్ని తరాలకు కొద్దో గొప్పో తెలిసిన ఈ కథలు తాత మనుమలను దగ్గరికి తెస్తే, వీళ్ళు సృష్టించిన బాలసాహిత్యం, అనువాదాలు బళ్ళో చెప్పవలసిన పాఠాలుగా తయారైనాయి.**

భాష మీదనే దృష్టిపెట్టిన వెంకటేశ్వర్లుగారు తమిళనాట పునరుజ్జీవనంలో చోటుచేసుకున్న మలుపుల జోలికి పోలేదు. '— the epics were non Hindu... so, even the finest Tamil scholars of the time ignored these



breath taking epics and anthologies of early Tamil ( Collected works of A.K.Ramanujan.186). **శిష్టులు సంగం సాహిత్యాన్ని ముట్టుకోని రోజుల్లో సామినాథ అయ్యర్ వగైరాలు( 1855-1942) జైనుల నుండి ఈ గ్రంధాలు సేకరించారు. తమ అస్తిత్వంకోసం తపిస్తున్న తమిళులు తమ శాసనసభ/మెరీనా బీచ్ ఎదుట శిలప్పధికారం కథానాయకి కన్నగి విగ్రహాన్ని, రూల్ ఆఫ్ లా/ చట్ట బద్ధ పాలన, నిబద్ధతలకు గుర్తుగా ప్రతిష్టించారు. సంగం సాహిత్యం బస్సుల్లో, కార్యాలయాల్లో, సభామంటపాలలో రాయించి ప్రచారం చేస్తున్నారు. అటువంటి వాంగ్మయం తెలుగునాట ఎంత కాలగర్భంలో కలిసిపోయిందో!**


Statue of Kannagi, Chennai

కాని తెలుగునాట దేశి అస్తిత్వ అన్వేషణలో నేదునూరి గంగాధరం, బిరుదురాజు రామరాజు, తంగిరాల, నాయని కృష్ణకుమారి, శివరామకృష్ణ - జానపద గిరిజన సాహిత్యాలు సేకరిస్తే, భద్రిరాజు కృష్ణమూర్తి బృందం పోటాపోటీగా మాండలికవృత్తి పదకోశాలు తయారు చేశారు. **తెలుగు గిరిజన మాండలికం తెలిస్తే తప్ప, తెలుగేతర గిరిజన భాషలు అర్ధం కావని భద్రిరాజు గ్రహించారు. కులపతిగా ప్రాక్ పశ్చిమ భాషా సాహిత్యాల అధ్యయనం అనువాదాలకు ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారు కాని ఆయన హయాంలోనే ఆయన కృషి అటకెక్కింది. అనాథ అయింది.** దేశీయతను కోల్పోయిన తెలుగుతనం డొల్లగా మారింది. 'మార్గ అ మార్గము దేశీయ మార్గము' అని ఉద్యమించిన పాల్కురికి సోమన నుండి వచ్చిన లిఖిత మౌఖిక 'దేశి సాహిత్యం చాలావరకు అపురూపం పొందిన మార్గ సాహిత్యమే అనిపించినా' (తంగిరాల సుబ్బారావు 'తెలుగు వీర గాధా కవిత్వము' లో కే.వి.రమణారెడ్డి పుట xv)'ఇంకా నేలమీద నూకలు మిగిలి ఉండగానే దాన్ని వెదికి నెమకి పట్టుకొని విశ్లేషించాలి' అని వామపక్ష మేధావులు త్రిపురనేని నుండి కే.వి.అర్ దాకా చేప్పిన హితవును, సొంత సాహిత్యాలు పంచుకోవటంలో, పాశ్చాత్య సాహిత్యాలు దించుకోవటంలో మునిగిపోయిన తెలుగుజాతి మరిచిపోయింది.

భాష, వాంగ్మయంలో భాగం. వాంగ్మయం వారసత్వానికి ఆధారం. భాషోద్యమం, రచయితల సభలు, తెలుగు వారసత్వానికి ప్రతీకగా ఎదగటానికి బదులు సాహిత్య జాతరలుగా మిగిలిపోతున్నదశలో - విశ్వవిద్యాలయాలకే పరిమితమైన రామరాజు, భద్రిరాజు-ఇరువర్గాల కృషి ముందుకు తీసుకుపోయే ప్రయత్నంలో, గిరిజన ప్రాంతం నుండి క్షేత్ర స్థాయిలో ప్రభుత్వంతో తలపడుతూ, సముద్రతీరంవైపు ఒకో అడుగు ముందుకు వేస్తుంది. బ్రిటిష్ హయాం నుండి పాలకవర్గం స్వంత ఆస్తిగా మారిన రైత్వారీ/ భూమి రికార్డులను ముందు ప్రజలపరం చేయించి పాలనమీద పట్టు సాధించింది. ఇప్పుడు అటవీ హక్కుల గుర్తింపు చట్టం అమలులో స్థలాల పేర్లను అక్షాంశ, రేఖాంశాలు, ఉపగ్రహ చిత్రాలతో అనుసంధానం చేయటం, మాండలిక పదసంపద జీవ వైవిధ్యపట్టికలో నమోదు చేయించటంలో పాలకవర్గంతో పోటీపడుతున్నది. గిరిజనులచేత సంప్రదాయ సాహిత్యం పోగుచేయించి, పాలకవర్గాల పాశ్చాత్యశాస్త్రాలకు సమాంతరంగా నిలబెడుతున్నది.

ఈ ప్రస్థానంలో, వెంకటేశ్వర్లుగారు బయటపెట్టినట్లు, కీలక స్థానంలో ఉన్న కొందరు ప్రముఖుల ఆశ్రిత, పక్షపాత ధోరణి వంటి వ్యక్తిగత లోపాలు(పుట 17) తెలుగుతనానికి తాత్కాలికంగా నష్టం కష్టం కలిగించిన మాట నిజమే. కాని తెలుగుజాతి తన వారసత్వాన్ని ఆవిష్కరించుకోవటంలో వేసిన తప్పటడుగులలో ఒకటిగా ఆ లోపాలను వదిలేసి ముందుకు పోవాలి. జాతి జీవనదిగా ప్రవహిస్తున్నంత కాలం ఇటువంటి మాలిన్యాలను కడిగి వేసుకోగలదు.

**82లో చెన్నై ఐఐటిలో కొందరు శాస్త్రవేత్తల చిన్న సమావేశం, 93కల్లా, ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం** Traditional science congress**గా ఎదిగి ముంబై, చెన్నై, చీరాల, వారణాసిలో సదస్సులు నిర్వహిస్తున్నది. అటువంటి కృషి మనకు దారిదీపం కావాలి. తెలుగువారిలో పెరుగుతున్న భావదాస్యాన్ని పోగొట్టి. తెలుగు**




**వారసత్వాన్ని నేటి సవాళ్ళకు పరిష్కారంగా తీర్చిదిద్దాలి..**

"అన్ని విద్యాదశల్లోనూ మాతృభాషే బోధనాభాషగా ఉండాలి" - కొఠారి కమిషన్

మోదుగు కాశీంబాబు
99086 83093

# తెలుగు పాఠ్య, వాగ్భాషానిధులు (టెక్ట్స్, స్పీచ్ కార్పొరా)

ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయాలను శాసిస్తున్న భాషగా ఆంగ్లం ఆధిపత్యం చేస్తున్న సందర్భంలో ప్రాంతీయభాషలు మరుగునపడిపోతున్నాయి. అందువల్ల సంగణక భాషాశాస్త్రం(కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్) ప్రాంతీయభాషలను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి గొప్ప కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిభాషకూ భాషానిధి (కార్పొరా) అందుబాటులోకి రావటం చాలా అవసరం. యంత్రపఠనాయోగ్య భాషానిధి (మషీన్ రీడబుల్ కార్పొరా) లభ్యత దృష్ట్యా చాలా భాషలకు వనరులు తక్కువగా ఉన్నై. కేవలం కొన్ని భాషలకు మాత్రమే భాషానిధి (కార్పొరా)లో విభిన్న శైలులను కలిగివున్నాయి. అందులో తెలుగుభాష కూడా ఒకటి.

పాఠ్య, భాషానిధుల (కార్పొరా లేక కార్పస్) ఆధారిత అధ్యయనాలు ప్రపంచంలోని కొన్ని ప్రధాన భాషలతో పోలిస్తే భారతీయ భాషలలో కొంత పరిమితంగా ఉన్నా, ఇటీవలి కాలంలో జరుగుతున్న సంగణక భాషాశాస్త్రం అధ్యయనాల వలన కొంత మెరుగుదల కనిపిస్తోంది. తెలుగు, భారతదేశంలోని ప్రధాన భాషలలో ఒకటి. మాట్లాడేవారి సంఖ్యాపరంగా దేశంలో ఐదవ స్థానంలో ఉంది. ఇది రెండు దక్షిణాది రాష్ట్రాలకు అధికారభాష. తెలుగు ద్రావిడ భాషాకుటుంబానికి చెందినది. సంక్లిష్ట పదనిర్మాణ వ్యవస్థను కలిగిన విశిష్టభాష తెలుగు.

కార్పొరా, కార్పస్ అనే మాటలను తెలుగులో 'భాషానిధి' అన్న అర్థంలో వాడుతున్నాం. తెలుగులో కార్పస్ వినియోగం దాదాపు మూడు దశాబ్దాల కిందటినుంచే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కార్పస్, టెక్ట్స్ కార్పస్, స్పీచ్ కార్పస్ అని రెండు రకాలుగా ఉంది. టెక్ట్స్ కార్పస్‌ని పాఠ్యనిధి అనీ, స్పీచ్ కార్పస్‌ని వాగ్భాషానిధి అని అనవచ్చు. ఈ వ్యాసంలో తెలుగు భాషకు పాఠ్యనిధీ వాగ్భాషానిధులను (టెక్ట్స్ , స్పీచ్ కార్పొరా) అభివృద్ధి చేస్తున్న వివిధ సంస్థలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని, అందుబాటులో ఉన్న వనరులను అవలోకించే ప్రయత్నంచేస్తాను.

**I. పాఠ్యనిధి (టెక్ట్స్ కార్పస్):**

**1. కేంద్రీయ భారతీయ భాషా సంస్థ భాషానిధులు (సిఐఐఎల్ కార్పొరా):** పాఠ్య నాణ్యత, ప్రాతినిధ్యం, పునరుద్ధరించదగిన ఆకృతి (ఫార్మాట్), భాషానిధి పరిమాణం, ప్రామాణికత వంటి వివిధ అంశాల ఆధారంగా ఎల్డీసి-ఐఎల్ (లాంగ్వేజ్ డేటా కన్సోర్షియమ్ ఫర్ ఇండియన్ లాంగ్వెజెస్) తెలుగు భాషానిధిని (టెక్ట్స్ కార్పస్) అభివృద్ధి చేసింది. టెక్ట్స్ కార్పస్ సేకరించడానికి ఎల్డిసి-ఐఎల్ వివిధ రంగాలలో (డొమైన్) ప్రామాణిక జాబితాను, ముందుగా రూపొందించుకున్న ప్రమాణాలను అవలంభించింది.

తెలుగు వచనగ్రంథాన్ని స్థూలంగా సాహిత్య, సాహిత్యేతర గ్రంథాలుగా వర్గీకరించవచ్చు. తెలుగులో పెద్ద మొత్తంలో సాహిత్య గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి కాని శాస్త్రీయ గ్రంథాలు తక్కువగా ఉన్నాయి. కాబట్టి ఎల్డిసి-ఐఎల్ తెలుగు సమతుల్య పాఠ్యాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికల నుండి అట్లాంటి సామగ్రిని (డేటాను) సేకరించింది. ఇట్లా సేకరించిన భాషానిధి సామగ్రి(కార్పస్ డేటా) యంత్రపఠనాయోగ్య (మెషిన్ రీడబుల్) రూపంలో సంకేతీకరించి (ఎన్ కోడ్ చేసి), ప్రామాణిక ఆకృతిలో (ఫార్మాట్‌లో) నిలువ (స్టోర్) చేస్తారు. ఈ సామగ్రి సంకేతీకరణ (డేటా ఎన్ కోడింగ్) యూనికోడ్, XML ఆకృతిలో (ఫార్మాట్‌లో) ఉంటుంది. ఈ సామగ్రిని (డేటాను) అధిసామగ్రి (మెటాడేటా) సమాచారంతో పొందుపరిచారు. ఈ డేటా సమకాలీన పాఠ్యం నుండి ప్రాప్యతా(క్రాల్డ్) పద్ధతులలో సృష్టించారు. ప్రస్తుతం సిఐఐఎల్‌లో తెలుగు పాఠ్యనిధిసామగ్రి (టెక్ట్స్ కార్పస్ డేటా) 30,10,993 పదాలతో అందుబాటులో ఉంది.

**2. కాల్ట్స్- యూఓహెచ్ భాషానిధులు:** గత 30 సంవత్సరాలుగా, హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని **అనువర్తిత భాషాశాస్త్ర అనువాద అధ్యయన కేంద్రం(కాల్ట్స్)**, సంగణక భాషాశాస్త్ర పరిధిలో అనుసారక యంత్రానువాద పరియోజనలో భాగంగానూ, ఆతర్వాత తెలుగూ తదితర భారతీయ భాషల మధ్య యంత్రానువాద వ్యవస్థల నిర్మాణంలో భాగంగానూ జరిపిన పరిశోధనలలో భాగంగా కోటిపదాల నిడివిగల తెలుగు పాఠ్యనిధిని నిర్మించింది. తెలుగు-హిందీ, తెలుగు-తమిళం, ఇంగ్లీషు-తెలుగు యంత్రానువాద వ్యవస్థల నిర్మాణంకోసం 5 లక్షల పదాల నిడివిగలిగిన కథానికలూ, పిల్లల కథలూ, వయోజనవిద్యా సమాచార సామగ్రినుంచీ సేకరించి 15 లక్షల పదాల ప్రత్యేక పాఠ్యనిధిని తయారుచేశారు. దీనిలో భాగంగా హిందీ-తెలుగు, తెలుగు-తమిళం, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువుల నిర్మాణం జరిగింది (చూ. calts.uohyd.ac.in).

ఈ భాషానిధి తెలుగు భాషను సంగణక విశ్లేషణా దృష్టితో చేసిన పరిశోధనల అవసరాల నిమిత్తం జరిపిన కృషి. ఈ కోటిపదాల భాషానిధిని విశ్లేషించి వర్ణ, అక్షర, పదాల ప్రాచుర్య రీతులనూ వాటి వ్యాప్తినీ అధ్యయనం చేసి ప్రకటించింది. ఇది ప్రధానంగా ఆధునిక తెలుగులో గత 50 సంవత్సరాలుగా ప్రచురణ పొందిన కథలూకథానికల నుంచీ నవలలూ తదితర వ్యాసాలూ, వార్తా పత్రికల నుంచీ, వ్యవసాయ, ఆరోగ్య, చికిత్స, క్రీడలూ, పర్యాటక, పాలనా సంబంధ రచనల నుండి సేకరించినవీ ఉన్నాయి. ఈ భాషానిధి నుంచీ సేకరించి నిర్మించిన అర్థ ఆధారిత (కాన్సెప్ట్ బేస్డ్) పదకోశంలో మొత్తం 2,75,000 పైచిలుకు తెలుగు పదాలు ఉన్నై. ఇటీవలి కాలంలో ఈ సంస్థనుంచే మెరుగైన పనితీరు కలిగిన యంత్రానువాద వ్యవస్థలు కూడా అభివృద్ధి చేయబడ్డాయి.

హైదరాబాదు విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, లాంగ్వేజ్ అండ్ స్పీచ్ టెక్నాలజీస్‌లో ప్రధానంగా తెలుగు, కన్నడ భాషలపై దృష్టిని కేంద్రీకరించి పనిచేస్తుంది.

ఇది తెలుగుకు దాదాపు 4 మిలియన్ పదాల టెక్ట్స్ కార్పస్‌ను తయారుచేసింది. దీనినుంచే తెలుగు-కన్నడ యంత్రానువాద వ్యవస్థ కూడా అభివృద్ధి చేయబడ్డాయి.

**3. ఇండియన్ లాంగ్వేజెస్ కార్పొరా ఇన్షియేటివ్ (ఐ.ఎల్.సి.ఐ.):** జవాహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన సంస్కృత అధ్యయన కేంద్రం ఇండియన్ లాంగ్వేజెస్ కార్పొరా ఇన్షియేటివ్ (ఐఎల్.సి.ఐ.) పరిశోధన ప్రాజెక్టుకు కన్సార్షియం లీడర్ గా వ్యవహరించింది. పర్యాటకం మరియు ఆరోగ్యరంగాలలో ఆంగ్లంతో సహా 12 ప్రధాన భారతీయ భాషలకు కొన్ని ప్రమాణాలతో సమాంతర కార్పొరా (హిందీ నుండి 12 భాషలకు) నిర్మించడం దీని లక్ష్యం.

పర్యాటకం, ఆరోగ్య రంగాల నుంచి 50,000 హిందీ వాక్యాలను సేకరించడం దీని ప్రాథమిక లక్ష్యం. ఇట్లా సేకరించిన దానిని హిందీ మూలంనుంచీ సమాంతరంగా వారు నిర్దేశించుకున్న ప్రమాణాలకు అనుగుణంగా మిగతా 12 భాషల్లో అనువాదాలను రూపొందించారు. భారతీయ ప్రమాణాల సంస్థ (బీ.ఐ.ఎస్.) ప్రమాణాల ప్రకారం (ఫిబ్రవరి-2012 గడువు) ఈ 12 భాషల్లో భాషానిధుల నిర్మాణ ప్రక్రియ కొనసాగించారు. పర్యాటకం, ఆరోగ్య రంగాలలో ఒక్కోదానికి 25 వేల చొప్పున హిందీ నుంచి తెలుగులోకి 50 వేల వాక్యాలను అనువదించారు. ఈ పనిని ద్రావిడ విశ్వవిద్యాలయంలోని భాషాశాస్త్ర విభాగం పూర్తిచేసింది. ఇది మొదటి దశ.

ఇండియన్ లాంగ్వేజెస్ కార్పొరా ఇనిషియేటివ్ ఫేజ్-2 ప్రాజెక్టును ఎం.ఈ.ఐ.టీ.వై. ప్రారంభించింది. అగ్రికల్చర్ అండ్ ఎంటర్ టైన్‌మెంట్ డొమైన్‌లో దాదాపు 31,000 వాక్యాలు ఉన్నాయి. భారతీయ ప్రమాణాల సంస్థ(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ట్యాగ్ సెట్ ప్రకారం అనువదించిన వాక్యాలను భాషాభాగాల గుర్తింపుతో (పీఓఎస్) ట్యాగ్ చేశారు. ఈ భాషానిధి యూనిక్ ఐడి, యు.టి.ఎఫ్.-8 ఎన్కోడింగ్, టెక్ట్స్ ఫైల్ ఫార్మాట్‌లో ఉంది.

**4. భారత పదజాలిక (ఇండో వర్డ్ నెట్) :** భారత పదజాలిక అనేది పదజాలికల పదకూర్పుల జ్ఞాననిధి. ఇది ఇండో వర్డ్ నెట్ అని పిలువబడే భారతీయ భాషా పదజాలికల నిర్మాణానికి అనుసంధానించింది. ఇది అస్సామీ, బంగ్లా, బోడో, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరి, కొంకణి, మలయాళం, మణిపురి, మరాఠీ, నేపాలీ, ఒడియా, పంజాబీ, సంస్కృతం, తమిళం, తెలుగు, ఉర్దూ వంటి ప్రాంతీయభాషలకు సంబంధించిన అతిపెద్ద ప్రాజెక్ట్. దేశంలోని మూడు భాషాకుటుంబాలోని ఈ 18 భాషలకు సంబంధించిన విషయనిపుణులు ఈ భాషలన్నిటినీ అనుసంధానం చేస్తూ ఒక గొప్ప నిఘంటువును నిర్మించారు. ఈ సందర్భంలో హిందీ ప్రధానభాషగా పనిచేస్తోంది. ఇందులో రూపొందించుకున్న తెలుగు పర్యాయపదాలు 21925, వ్యష్టి పదాలు: 18250, నామవాచకాలు-12078, క్రియలు-2795, విశేషణాలు-5776, క్రియావిశేషణాలు-442గా మొత్తం పదాల సంఖ్య 21091.

**5. లిప్జిగ్ విశ్వవిద్యాలయం:** అంతర్జాతీయ కార్పొరా పోర్టల్ 900కి పైగా కార్పొరాలకు లిప్జిగ్ కార్పొరా కలెక్షన్ (ఎల్సిసి) 250కి పైగా భాషలకు అవకాశాన్ని కల్పించింది. కార్పస్ టెల్-ఇన్-వెబ్-2019 అనేది 2019 నుండి మెటీరియల్ ఆధారంగా వచ్చిన తెలుగు వెబ్ టెక్ట్స్ కార్పస్ (ఇండియా). ఇది 750,632 వాక్యాలను, 77,95,552 టోకెన్లను, 77,62,172 పదరూపాల సంఖ్యను కలిగి ఉంది.

**6. ఎల్టీఆర్సీ, ఐఐఐటీ హైదరాబాద్:** లాంగ్వేజ్ టెక్నాలజీస్ రీసెర్చ్ సెంటర్, కేసీఐఎస్, ఐఐఐటీ హైదరాబాద్‌లో 'సెంటిరామ' కార్పస్‌ను రూపొందించారు. ఈ కార్పస్ 4 డేటాసెట్లను కలిగి ఉంటుంది. ఇది 2-వాల్యూ స్కేల్స్‌ను ఉపయోగించి వివరించబడింది. ఇది డాక్యుమెంట్ స్థాయిలో సానుకూల, ప్రతికూల సెంటిమెంట్ మధ్య వ్యత్యాసాన్ని చూపుతుంది. కార్పస్ పుస్తక సమీక్షలు, ఉత్పత్తి సమీక్షలు, సినిమా సమీక్షలు ఇంకా పాటల సాహిత్యం వంటి వివిధ డొమైన్ల నుండి డేటాసెట్లను కలిగి ఉంటుంది. వాటిలో ప్రతిదానిని ఎనొటేషన్ ప్రక్రియననుసరించి ఎనొటేషన్ చేసేవారు జాగ్రత్తగా నోట్ చేశారు. "సాంగ్ లిరిక్స్" అనే ఫోల్డర్ లో తెలుగు లిపిలో రాసిన 339 విభిన్న తెలుగు పాటల లిరిక్స్ ఉన్నాయి. అందులో 230 పాజిటివ్, 109 నెగెటివ్ వచ్చాయి. ఇందులో మొత్తం 13997 వాక్యాలు, 81798 పదాలు ఉన్నాయి. "మూవీ రివ్యూస్" అనే ఫోల్డర్‌లో తెలుగు లిపిలో రాసిన 267 వేర్వేరు తెలుగు సినిమా సమీక్షలు ఉన్నాయి. అందులో 136 పాజిటివ్, 131 నెగెటివ్ వచ్చాయి. ఇందులో మొత్తం 20000 వాక్యాలు, 165049 పదాలు ఉన్నాయి. కార్పస్‌లో , "ప్రొడక్ట్ రివ్యూస్" అనే ఫోల్డర్ లో తెలుగు లిపిలో రాసిన 200 విభిన్న ఉత్పత్తి సమీక్షలు ఉన్నాయి. అందులో 100 పాజిటివ్, 100 నెగెటివ్ వచ్చాయి. ఇందులో మొత్తం 43199 వాక్యాలు, 259189 పదాలు ఉన్నాయి. "పుస్తక సమీక్షలు" అనే సంచికలో తెలుగు లిపిలో రాసిన 200 విభిన్న పుస్తకసమీక్షలు ఉన్నాయి. అందులో 100 పాజిటివ్, 100 నెగెటివ్ వచ్చాయి. ఇందులో మొత్తం 6808 వాక్యాలు, 33179 పదాలు ఉన్నాయి. తెలుగులో సెంటిమెంట్ విశ్లేషణకు తోడ్పడేలా సెంటిరామాను రూపొందించారు.

**7. ఐఐఐటీ హైదరాబాద్:** ఇంగ్లిష్-హిందీ కోసం పిఎస్ఎ పైలట్ కింద ఐఐఐటీ హైదరాబాద్ సమాంతర డేటాను అభివృద్ధి చేసింది. 44910+9251+4264=58425 సమాంతర వాక్యాలతో ఈ టెక్ట్స్ కార్పస్ పరిమాణం ఉంటుంది. వీరు హిందీ, తెలుగు డొమైన్ డిక్షనరీని అభివృద్ధి చేశారు. డిక్షనరీ డొమైన్ అంటే కెమిస్ట్రీ అండ్ లా. ఇది జిప్డ్ ఫైల్, దీని సైజు 566B. హిందీ-తెలుగు సమాంతర పాఠ్యపదనిధిని రూపొందించారు. వారు కెమిస్ట్రీ, లా, న్యూస్ & జనరల్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్, ఇతరాలనుంచి 506178 వాక్యాలను సేకరించారు. ఈ డేటా మొత్తం ఎన్.సి.ఇ.ఆర్.టి బుక్స్, ఎన్.పి.టి.ఇ.ఎల్, న్యూస్, గవర్నమెంట్ హెల్త్ కేర్ సైట్స్, దూరవిద్య పుస్తకాల నుంచి తీసుకున్నారు.

**8. ఇండిక్ కార్ప్:** "నిలెకని సెంటర్ ఎట్ ఎఐ4భారత్" జూలై 28న ఐఐటి మద్రాస్‌లో అధికారికంగా ప్రారంభించారు. ఇది వార్తలు, పత్రికలు, పుస్తకాలతో కూడిన వెబ్ వనరుల నుండి ఇండికార్ప్ డేటాసెట్లను అభివృద్ధి చేసింది. భారతీయభాషల కోసం అందుబాటులో ఉన్న అతిపెద్ద కార్పోరాలలో ఇదొకటి. ఈ కార్పస్ ఒక పెద్ద టెక్ట్స్ ఫైల్, ఇందులో ప్రతి లైన్ కు ఒక వాక్యం ఉంటుంది. ఈ తెలుగు కార్పస్ 47.9మిలియన్ వాక్యాలతో, 674మిలియన్ టోకెన్‌లతో 3.98 మిలియన్ న్యూస్ వ్యాసాలతో అందుబాటులో ఉంది.

**9. ఆస్కార్:** ఆస్కార్ లేదా ఓపెన్ సూపర్-లార్జ్ క్రాల్డ్ అగ్రిగేటెడ్ కార్పస్ అనేది అన్గోలియెంట్ ఆర్కిటెక్చర్ ఉపయోగించి కామన్ క్రాల్

కార్పస్ కు సంబంధించిన భాషావర్గీకరణ ఫిల్టరింగ్ ద్వారా పొందిన అతిపెద్ద బహుభాషా కార్పస్. డేటాను ఒరిజినల్, రీడుప్లికేటెడ్ రూపంలో భాష ద్వారా పంపిణీ చేస్తారు. ఇందులో ప్రస్తుతం 166 భాషలు అందుబాటులో ఉన్నాయి. భాషా వర్గీకరణ దశను మెరుగుపరచడానికి వారు కృషి చేస్తున్నారు. ఇది భవిష్యత్తు కార్పోరాపై సమస్యను పరిష్కరించడంలో సహాయపడుతుంది. ఈ డేటా వివిధ భాషల్లోని వివిధ వెబ్ పేజీల నుండి వస్తుంది. ఆస్కార్ తెలుగు కార్పస్ పరిమాణం 3.4 జిబి, 249,756 డాక్యుమెంట్లు, 13,77,52,065 పదాలు.

10. mC4: MC 4 అనేది MC 4 అని పిలువబడే C4 డేటాసెట్‌కు సంబంధించిన బహుభాషా వేరియంట్. mC4లో పబ్లిక్ కామన్ క్రాల్ వెబ్ స్క్రాప్ నుండి తీసుకోబడిన 101 భాషలలో సహజమైన టెక్స్ట్ ఉంటుంది. మూలం: mT 5: వివిధ భాషలకు సంబంధించిన అతిపెద్ద ముందస్తు శిక్షణ పొందిన టెక్స్ట్-టు-టెక్స్ట్ ట్రాన్స్ ఫార్మర్. ఇందులో 63 తెలుగు డేటాసెట్లు, 125 మోడల్స్, 249 తెలుగు టోకెన్లు (ఎం), 4.7 సైజు (జిబి), తెలుగు రోమనైజ్డ్ 39 టోకెన్లు (ఎం), 0.3 సైజ్ (జిబి) కలిగి ఉంది.

**II. వాగ్భాషా నిధి (స్పీచ్ కార్పోరా):**

**1. సిఐఐఎల్:** ఎల్డిసి-ఐఎల్ కార్పస్ తెలుగును ప్రత్యేకంగా తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర అని మూడు రకాలుగా విభజించుకొని వాగ్భాషానిధి డేటాను సేకరించింది. ఎల్డిసి-ఐఎల్ తెలుగు స్పీచ్ డేటా సెట్ లో పదజాబితాలు, వాక్యాలు, రన్నింగ్ టెక్స్ట్, డేట్ ఫార్మాట్ లతో తయారుచేసిన వివిధ రకాల డేటాసెట్ లు ఉంటాయి. మాస్టర్ డేటాసెట్ నుండి యాదృచ్ఛికంగా ఎంపిక చేయబడిన ఈ డేటాసెట్లను ప్రతి స్పీకర్ రికార్డ్ చేస్తాడు. స్పీచ్ 'in.wav' ఫార్మాట్‌లో, మెటాడేటా 'in.txt' ఫార్మాట్‌లో ఉంటాయి. తెలుగు స్పీచ్ డేటా డాక్యుమెంటేషన్‌లో తెలుగు స్పీచ్ కార్పస్ వివరణ లభిస్తుంది. తెలుగు స్పీచ్ డేటా మొత్తం 22:43:59 గంటలు, 15 జిబి, 80 స్పీకర్లు, 10,510 ఆడియో సెగ్మెంట్లు.

**2. ఎస్పీఎల్టీ - ఎఎస్ఆర్ కన్సార్షియా:**

ఈ కార్పస్‌లో సుమారు 1000 మంది తెలుగు మాతృభాషగా మాట్లాడే వారికి చెందిన 6019 ఆడియో ఫైళ్లు ఉన్నాయి. ఇది మొత్తం 91:49:05 గంటల డేటా. ఈ డేటా అగ్రికల్చరల్ సామగ్రి కోసం తయారుచేయబడింది. ఈ కార్పస్ మొత్తం పరిమాణం 5.73 జిబి.

**3. స్పీచ్ ఓషియన్ (కింగ్-ఎఎస్ఆర్-283):**

(అ) తెలుగు మాటగుర్తింపు (స్పీచ్ రికగ్నిషన్ కార్పస్, మొబైల్): ఇందులో తెలుగు స్పీచ్ రికగ్నిషన్ కార్పస్ మొత్తం 118.00 గంటలు. మొత్తం 130 మంది స్పీకర్స్. ఇందులో పురుషులు 67, స్త్రీలు 63. 64,160 మాటలు. ఇవి సెప్టెంబర్ 2017 లోని మొబైల్ ప్లాట్ ఫామ్‌లు.

**(ఆ) తెలుగు సంభాషణ స్పీచ్ రికగ్నిషన్ కార్పస్ (టెలిఫోన్):**

ఇందులో తెలుగు సంభాషణ స్పీచ్ రికగ్నిషన్ కార్పస్ 100 గంటలు. మొత్తం 110 మంది స్పీకర్లు. 56 మంది పురుషులు, 54 మంది స్త్రీలు. ఇవి డిసెంబర్-2019 లోని టెలిఫోన్ ప్లాట్ ఫారమ్‌లు.

**4. ఐఐఐటి హైదరాబాద్ (ఎన్ఎల్టిఎం):** ఐఐఐటి హైదరాబాద్, టెక్నాలజీ డెవలప్ మెంట్ ఫర్ ఇండియన్ లాంగ్వేజెస్ (టిడిఐఎల్), ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటివై) సమూహసేకరణ పద్ధతిలో ఎఎస్ఆర్ డేటాను సేకరించింది. తెలుగు మాటల్ని ప్రాంతీయ వైవిధ్యాల ఆధారంగా మూడు పద్ధతులలో సేకరించారు. అవి భిన్న పరిస్థితుల నేపథ్యాలతో సహజసిద్ధమైన, సంభాషణాత్మకమైన, పఠన పద్ధతుల ఆధారంగా, సమూహసేకరణ కారణంగా వివిధ స్థాయిల ఖచ్చితత్వంతో కూడిన ప్రతిలేఖనాలు. ఇది మొత్తం 2000 గంటల స్పీచ్ డేటాను విడుదల చేస్తుంది.

స్పీచ్ డేటాను స్థానికవక్తలు రికార్డ్ చేశారు. జూమ్ హ్యాండీ రికార్డర్ కు కనెక్ట్ చేయబడిన ప్రామాణిక హెడ్ సెట్ మైక్రోఫోన్ ఉపయోగించి స్టూడియో వాతావరణంలో రికార్డింగ్ చేయబడింది. ఇది ఆపరేట్ చేయడం చాలా సులభం కాబట్టి వారు హ్యాండీ రికార్డర్ ను ఉపయోగించారు. హెడ్ సెట్ వాడటం వల్ల మైక్రోఫోన్ నుంచి నోటి వరకు ఉన్న దూరం, రికార్డింగ్ స్థాయి స్థిరంగా ఉంటుంది.

**5. ఐఐటి మద్రాస్ (ఇండిక్ టిటిఎస్):** భారతీయ భాషల కోసం టెక్స్ట్-టు-స్పీచ్ (టిటిఎస్) సంశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి వచ్చిందే ఇండియా టిటిఎస్ ప్రాజెక్ట్. చిన్న ఫుట్ ప్రింట్ టిటిఎస్ పదసంయోగాల నాణ్యతను మెరుగుపరచడం, అసమర్థ ఉపకరణాలతో, వివిధ ఇతర అనువర్తనాలతో అనుసంధానించబడింది. భారత ప్రభుత్వ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ (ఎంసిఐటి) కు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం (ఎంసిఐటి) నిధులతో 13 సంస్థలు మరియు ఎస్ఎమ్టి, ఐఐటిఎంతో కూడిన కన్సార్టియం ఆధారిత ప్రాజెక్ట్ ఇది. దీని మొత్తం స్పీచ్ కార్పస్ 23.92 గంటలు.

**6. ఓపెన్ ఎస్ఎల్ఆర్ (స్పీచ్ అండ్ లాంగ్వేజ్ రిసోర్సెస్):** ఈ డేటా సెట్ లో వాలంటీర్లు రికార్డ్ చేసిన తెలుగు వాక్యాల హై-క్వాలిటీ ఆడియో ఉంటుంది. డేటా సెట్ లో వేవ్ (వేవ్ ఫార్మ్ ఆడియో ఫైల్ ఫార్మెట్) ఫైల్స్, TSV (టాబ్ సెపరేటెడ్ వ్యాల్యూస్) ఫైల్స్ (line_index.tsv) ఉంటాయి. ఫైలు line_index.tsvలో అజ్ఞాతఫైలు %।ఈ%, ఫైలులోని ఆడియో ట్రాన్స్క్రిప్షన్ ఉంటుంది. wikidata_20150427-set-1.tsvలోని డేటాసెట్, అన్ని వికిడేటా సంస్థల 2015-04-27 జెఎస్ఓఎన్ డంప్ నుండి సేకరించబడింది. ఇది 22 భాషలలో వాస్తవికపేర్లను కలిగి ఉంది. దీనిలో తెలుగు సంఖ్య 11881.

**7. కామన్ వాయిస్:** కామన్ వాయిస్ అనేది అందరికీ అందుబాటులో ఉన్న వాయిస్ డేటాసెట్. ఇది ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛందంగా సహకరించేవారి మాటలతో నడుస్తుంది. వాయిస్ అనువర్తనాలను రూపొందించుకోవాలనుకునే వారి మెషిన్ లెర్నింగ్ నమూనాలకు శిక్షణ ఇవ్వడానికి డేటాసెట్‌ను ఉపయోగించవచ్చు.

ఈ ప్రారంభిత భాషలకు వెబ్ సైట్ స్థానికీకరించడంతోపాటు నడిచేటప్పటి మాటలను, వినికిడి అనువర్తనాలను అనుమతించడానికి తగినన్ని వాక్యాలను సేకరించింది. తెలుగు, కొన్ని ఇతర భాషలు ప్రస్తుతం అండర్ కమ్యూనిటి డెవెలప్మెంట్లో ఉన్నాయి. దీనిని ప్రారంభించడానికి వెబ్ సైట్ స్థానికీకరణ, వాక్యసేకరణ అవసరం. వారు తెలుగులో 168 మంది వక్తలతో 2000 వాక్యాలను రూపొందించడానికి ప్రయత్నించేస్తున్నారు. ఇది 48% స్థానికీకరించబడింది.

**8. యుఎల్సిఎ- ఎఎస్ ఆర్-డేటాసెట్-కార్పస్:** యుఎల్ సిఎ అనేది భారతీయభాష డేటాసెట్లు, మోడళ్లకోసం రూపొందించిన

ప్రామాణిక API ఓపెన్ స్కేలబుల్ డేటాప్లాట్ ఫారమ్. ఇది వివిధ ఆన్ లైన్ తెలుగు మీడియాన్యూస్, వినోదం (కామెడి), తత్వశాస్త్రం, కళలు, సంస్కృతి రంగాలనుంచి డేటాను సేకరించింది. ఈ స్పీచ్ డేటా మొత్తం 1025.93 గంటలు.

పైన పేర్కొన్న వివిధ సంస్థల టెక్స్ట్, స్పీచ్ కార్పస్ డేటా సంబంధిత వెబ్ సైట్లలో వారు నిర్ణయించిన కొన్ని నియమనిబంధనల ఆధారంగా ఉచితంగా, కొనుగోలురూపంలో అందుబాటులో ఉంది.

డేటా నాణ్యతను పెంచడానికి భాషావేత్తల ద్వారా సవరణలు చేయిస్తూ భాషావనరులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం మిగతా భాషలతో పోల్చితే తెలుగు టెక్స్ట్, స్పీచ్ కార్పస్ చాలా తక్కువగా ఉంది. భాషావనరులను సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతికత అధికంగా అందుబాటులో ఉన్న ప్రతిభాషా మిగతా భాషలకంటే ముందు ఉంటుంది. సమకాలీన సమాజంలో సాంకేతిక వనరులు ఉన్న ఏ భాష కూడా క్షీణదశకు వచ్చే ప్రమాదం ఉండదని నా అభిప్రాయం.

వ్యాస రచయిత డా. మోదుగు కాశీంబాబు, కేంద్రీయ భారతీయ భాషా సంస్థ, మైసూర్‌లో సహాయ పరిశోధకుడు

**25 వ పుట తరువాయి**

# మౌలిక పరిశోధక జీవి:.......

ప్రసక్తులే.

ఓరోజున ఫోనులో "సన్నిధానం గారూ మీరు గరిమెళ్ళ సత్యనారాయణగారి సమగ్ర రచనల సంపుటాల నిర్మాణానికి, పూనుకోకూడదూ... తక్కిన పని నేను చూసుకుంటాను." అన్నారు.

నేను "అంత బరువు బాధ్యతలను మోసే శక్తి లేదు; అంతేగాక గరిమెళ్ళ పరిశోధకులు కె.ముత్యం గారు, కృష్ణకుమారి గారు వంటి వారిచే ఆ పనులు చేయిస్తే బాగుంటుందేమో" అన్నాను.

నిజాయితీగా చెప్పారు. ఆనందం... అన్నారు. ఒక పుస్తకాన్ని వెతకడానికి రిసోర్సు పర్సన్స్ ని ఎందరినో, ఎన్ని గ్రంథాలయాలనో సంప్రదించేవారు.

ఆయన ఆత్మకు శాంతిక్రియలుగా ఆయన ఆశించిన గ్రంథ ప్రకాశాలకు వారి కుటుంబ సభ్యులు పూనుకుని ఆ మహనీయునికి సరైన నివాళి అర్పించాలని ఆశ.

**22 వ పుట తరువాయి**

# పైడి భాష....

పదాల చివర అట అనే ప్రత్యయం వచ్చి చేరటం కన్పిస్తుంది.

**పైడిభాష క్రియా పదాలు - తెలుగు అర్థాలు**

| పైడిభాష | తెలుగు భాష |
|---|---|
| నొవలి | నాగలి |
| కెల్భట | ఆట ఆడుకోవటం |
| జభట | వెళ్లడం |
| ఐభట | రావటం |
| కైబట | భోజనం చేయటం |
| జిభట | ఇవ్వటం |
| అన్భట | తేవటం |
| బసభట | కూర్చోవటం |
| సోయభట | పడుకోవటం |

ఈ విధంగా క్రియాపదాలలో 'ఆట' లో హ్రస్వ ఆకారంలో హ్రస్వదీర్ఘం కన్పిస్తుంది.

**పైడిభాష ప్రశ్నార్థక క్రియా వాక్యాలు-తెలుగు అర్థాలు**

| పైడిభాష | తెలుగు భాష |
|---|---|
| నొవలి | నాగలి |
| కైలిస్కి | భోజనం చేసావా |
| పిలిస్కి | తాగావా |
| నిఖాసిస్కి | బాగున్నావా |
| ఐలిస్కి | వచ్చారా |
| జలిస్కి | వెళ్ళావా |
| మర్లిస్కి | కొట్టావా |
| గదలిస్కి | స్నానం చేసావా |

మొదలైన ప్రశ్నార్థక క్రియా వాక్యాల చివర 'ఇస్కి అనే ప్రత్యయం వచ్చిచేరుతున్నట్లు తెలుస్తుంది. ఇటువంటి ఎన్నో విశేషాలు పైడి భాషను పరిశీలించినప్పుడు మనం తెలుసుకోవచ్చు. పైడి భాషపై విస్తృతమైన పరిశోధనలు జరగాలి. ఈ భాషను మాట్లాడే ప్రజలు సుమారు 30 వేల మంది ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నట్లు 2011లో జరిపిన జనాభా గణాంకాల వలన తెలుస్తుంది. అయితే తమ మాతృభాషలో రచనలు చేయటానికి తమకు లిపి లేకపోవటం ఒక కారణమని గొర్లె రాజు తెలియజేసారు. అయినప్పటికీ తమ మాతృభాషను కాపాడుకుంటామన్నారు. ప్రస్తుతం తమ జాతి ప్రజలు తెలుగు భాషలోనే విద్యాబోధన అభ్యసిస్తున్నారని ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు పూనుకొని తమ భాషా ఉనికిని కాపాడాలని కోరుతున్నారు. ఆంధ్రదేశంలో తమ మధ్య మాత్రం వ్యవహారాలన్నీ పైడి భాషలోనే జరుగుతున్నాయని ఆవిధంగా తమ భాషను కాపాడుకుంటూ వస్తున్నామని ప్రభుత్వం గిరిజన భాషలకు లిపి కనుగొంటున్నట్లే తమ భాషకు లిపిని కనిపెట్టి భావితరాలకు తమ జాతి ఉనికిని తెలియజేయగలరని తమ ఆశా భావాన్ని వ్యక్తం చేసారు. ఆవిధంగా పరిశోధనలు జరుగుతాయని ఆశిద్దాం.

వ్యాస రచయిత- బూసి వెంకటస్వామి, సహాయాచార్యులు- తెలుగు విభాగం, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం

సూరియన్ కాశీపాండ్యన్

# మరుగునపడ్డ వారసత్వం

సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శిగా పనిచేసిన 'సురియన్ కాశీ పాండ్యన్ ఐ.ఎ.ఎస్.' గారు ఎంతో పరిశోధన చేసి, ఆంగ్లంలో రచించిన **'The Hidden Heritage'** పుస్తకాన్ని స్టెర్లింగ్ పబ్లికేషన్స్ వారు ప్రచురించారు. దానిని ఎ. వెంకటేశ్వరరెడ్డి తెలుగులోకి అనువదించగా, తెలుగు అకాడమీ వారు 1989లో 'మరుగునపడ్డ వారసత్వం' అనే పేర ప్రచురించారు.

చరిత్రలో మూసుకుపోయిన అనేక కీలకాంశాలను ఈ రచన వెల్లడించింది. ప్రాచీనహోదా కొరకు తెలుగువారు చేసిన ఉద్యమంలో ఇది కొంత సహకరించింది. ఈ తెలుగు పుస్తకంలోని మొదటి అధ్యాయాన్ని(పరిచయం) మాత్రం ఇక్కడ పాఠకులకోసం ప్రచురిస్తున్నాము. చదివి, దీని అవసరాన్ని గుర్తించేవారు తెలుగు అకాడమీ హైదరాబాదులో ముద్రిత ప్రతిని కొనుగోలు చేయవచ్చును.

–సంపాదకుడు

**పరిచయం:**

ఒక ఆధునిక దేశంగా భారతజాతి ఇరవై ఒకటో శతాబ్దం లోకి కాలిడనుంది. అంతరిక్షయుగావసరాలకు తగినట్లుగా మన భవిష్యత్తును మనం రూపొందించుకోవడంలో మన యుగయుగాల సాంస్కృతిక వారసత్వాన్ని విస్మరించరాదు. ప్రతిదేశపు అచేతన మనస్సు దాని చారిత్రక సంప్రదాయంతో నిబద్ధితమవుతుంది. ఈ విషయాన్ని గుర్తించకుండా మనం చారిత్రక పరిశోధనను 'పరిహార్య విలాసం'గా భావిస్తుంటాము. 'జాతి ఆత్మ' దాని ప్రజల సాంస్కృతిక–రాజకీయ విజయాలను సూక్ష్మంగానైనా తప్పకుండా ప్రభావితం చేస్తుంది. ఒక జాతి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సహజ, భౌతిక వనరుల కంటే, దాని వారసత్వం, భాష, తత్వం, మతం, సంస్కృతి లాంటి కారకాల ప్రభావం ఎంతో ఎక్కువ.

పాశ్చాత్య ప్రజల 'పని విలువ (work ethik) ను, ప్రొటెస్టంట్ మతానికి, అది పాశ్చాత్యమైన రీతిలో, సామాజిక శాస్త్రవేత్త మాక్స్ వెబర్ ఆపాదించాడు. పాశ్చాత్య సమాజానికి నూతన నైతిక విలువలనిచ్చి ముందుకు నడిపించిన ప్రొటెస్టంట్ మతానికి, ఇంగ్లాండు, పాశ్చాత్య దేశాలలో వికసించిన పారిశ్రామికతకు ముడి పెట్టాలని ఆర్. హెచ్.టల్నే తన గ్రంథం, "మతం– పెట్టుబడిదారీ విధానాభివృద్ధి" లో పేర్కొన్నాడు. ఆ విలువను 'కల్వినిస్టు (Calvinist) పని విలువ' అన్నారు. జెనీవాకు చెందిన ప్రొటస్టంట్ సన్యాసి కల్విన్ నుంచి దానికి ఆ పేరు వచ్చింది. దీనికి భిన్నంగా, భారత దేశంలో ప్రజలకు సంప్రదాయం ప్రకారం, 'పని విలువ' లో విశ్వాసం లేదని కొంతమంది పాశ్చాత్య రచయితలు వాకొంటున్నారు. అలా వారెందుకు అంటున్నారంటే, భారతీయ ఆలోచనా విధానంపై ప్రకృత హిందూమతానికి ఎంతో పట్టు ఉన్నది. ఇంకా భారత ప్రజలు వీధి వాదాన్ని, పరలోకాన్ని పట్టించుకొన్నంతగా 'పని' ని గురించి పట్టించుకోరు. 'నీ భావి జీవితాన్ని నీవే మలుచుకోవచ్చు. మానవుని భవిష్యత్తుకు అతడే కర్త' అనే విషయాలు భారత సంప్రదాయానికి వైదేశికాలు. గన్నార్ మిర్దల్ రచించిన 'ఆసియా నాటకం' (Asean Drama) లో ముఖ్య విషయం, "భారత దేశం ప్రగతి చెందక పోవడానికి కారణం హిందూమతం", గా కనిపిస్తున్నది. ఈ రచయితలంతా మాట్లాడేది "అసలైన" హిందూమతాన్ని దృష్టిలో ఉంచుకొనేనా, లేక భిన్నమైన "మరో" హిందూ మతాన్ని దృష్టిలో ఉంచుకొనా?

**లీమరియన్ నాగరికత**

భారతీయ మత మతచింతనకు సంబంధించిన చరిత్ర గహన విషయమై పోయింది. ప్రపంచంలో ఏ ఇతర మతం అంతటి గందరగోళాన్ని కలిగించదు. క్రైస్తవ, ఇస్లాంల వలె కాక, హిందూమత మూలాలను చారిత్రక పూర్వ యుగాలలో అన్వేషించాల్సి ఉంటుంది. చారిత్రక యుగంలో కూడ, ఒక ఆలోచనా ప్రవంతి మరో ఆలోచనా ప్రవంతిని అధిగమించడం, ముంచి వేయడం కారణంగా ఏర్పడిన "వంకిల గతి" స్పష్టతను నాశనం చేస్తోంది. చారిత్రక పూర్వ గతంలోకి తొంగిచూస్తూ, అక్కడక్కడ లభించిన సమాచార ఖండాలను జాగ్రత్తగా పరిశోధించాలి. ఇలా చేయకుండానే ఆ ముక్కల ముక్కల సమాచారం ఆధారంగా, వాటి మధ్య సంబంధాలపై ఒక నిర్ణయానికి (అనుమానానికి (interference) రావడం, ఆ తరువాత దానిపై ఒక ప్రాక్కల్పన (hypothisis) ను రూపొందించడం తగని పని. మానవుని మూలాన్ని అన్వేషించిన డార్విన్ సహచరుడైన థామ్సన్ హక్సలీ హెూమో సాపీన్స్‌ను అంటే మానవుని సేంద్రియ జాతిగా పరిగణించాడు. అటువంటి సేంద్రియ మానవుడు మొదట ఇప్పుడు మునిగి పోయి ఉన్న లీమరియా ఖండంలో వెలిశాడని ఆయన భావించాడు. ఈ వాదాన్ని ఫ్రీడ్రిక్ ఎంగిల్స్ ఆమోదించాడు. "వానరం నరుడుగా పరివర్తితం కావడంలో శ్రమ పాత్ర" అనే తన గ్రంథంలో ఎంగిల్స్ ఇలా అంటాడు. అనేక వందల వేల సంవత్సరాలు పూర్వం, ఇప్పుడు ఖచ్చితంగా నిర్ణయించ వీలు కాని 'ఒక యుగంలో, భూచరిత్రలో భూశాస్త్రజ్ఞులు తృతీయమని పిలిచే (సేనజోయిక్ యుగంలో అంటే క్షీరదాలు ఆవిర్భవించ మొదలైన కాలం – ప్రథమ భాగానికి చెందిన 1,000,000 ల నుంచి 70,000,000 కాలంలో – అనువాదకుడు) కాలంలో బహుశ ఆయుగాంతంలో, ప్రత్యేకంగా అత్యంతంగా వికసించిన తోక లేని ఒక వానరజాతి, ఉష్ణమండలంలో, బహుశ ఇప్పటి హిందూ మహా సముద్రంలో మునిగిపోయిన ఒక గొప్ప ఖండంపై (గోండ్‌వానా భూమి/లీ మరియా) నివసించింది". "లీమరియా ఖండ ప్రాక్కల్పన ఆధారంగా మాత్రమే అనేక చిక్కు సమస్యలను పరిష్కరించవచ్చునని ప్రపంచ అతిప్రాచీన

నాగరకతలను అధ్యయనం చేస్తే తెలుస్తుంది. లీమరియా హిందూ మహాసముద్రంలోని ఒక భూ ఖండం. దీని మీద నివసించినవి తీమరు(నక్క ముఖాలున్న నిశాచర కోతులు) లే కాదు, ఉన్నత నాగరకతా శ్రేణికి చెందిన మానవులు గూడ నివసించారు"[1]. మనం ఈ ఉన్నత నాగరకతా చిహ్నాలు ఎక్కడ చూడాలి? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోబోయే ముందు, ఇండియా భౌగోళిక చరిత్ర గురించిన అవగాహన అవసరం.

భారతీయ ద్వీపకల్పం లేదా దక్కన్ అని పిలవబడే భారత భూభాగం, భౌగోళికంగా, గంగా-సింధు మైదానం, హిమాలయాల కంటే భిన్నమైంది. ఇప్పుడు హిందూ మహాసముద్రం ఆక్రమించి ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు ఆఫ్రికా వరకు అవిరళంగా పరుచుకొని ఉన్న ఒక పూర్వఖండపు అవశేషం నేటి దక్కను. ఇది రూపొందిన శిలలు ప్రపంచంలో కెల్ల అత్యంత ప్రాచీనమైనవి. ఇవి ఎప్పుడూ నీటిలో మునిగిన దాఖలాలు లేవు. దక్కన్‌లో అనేక ప్రాంతాలలో ఈ రాళ్ళు ఘనీభవించిన నల్లని లావా పొరతో కప్పబడి ఉన్నాయి. ఒకప్పుడు కరిగిన లావా వీటిపై ప్రవహించింది. అందువల్ల, దక్కన్‌లో మనం ప్రపంచం మొదటి దినాలలో ఉన్నాము; జీవం ప్రారంభం కాకముందరి దినాలలో భూమినే మనం చూస్తున్నాము... గంగా సింధు మైదానం పశ్చిమాన సింధుతో ప్రారంభమై తూర్పున గంగా డెల్టా వరకు మధ్యలో ఖాళీలు లేకుండా వ్యాపించి ఉంది. దీని దూరం పండ్రెండు వందల మైళ్ళు. ఇంకా ప్రపంచం ఒక రూపం తీసుకొంటున్న సమయంలో, హిమాలయాలు లేక ముందు, గరగా సింధు మైదానం ఇప్పుడు ఆక్రమించిన ప్రదేశం ఒక సముద్రం. ఈ సముద్రం పశ్చిమ తీరం ఇప్పటి భారత ద్వీపకల్పం(దక్కన్). హిమాలయాల ఆవిర్భావంతో సముద్రం మాయమైంది. హిమాలయాల నుంచి ప్రవహించే నదులు తమతో పాటు ఒండ్రును పట్టుకొచ్చాయి. ఆ ఒండ్రు ఈ మైదానం నేల అయింది[2]. మానవ నాగరకతకు ఒడి అయిన భారత ద్వీపకల్పానికి దక్షిణంగా మునిగిపోయిన లీమరియా ప్రదేశంపై వెల్లివిరిసిన నాగరకతను గురించి మాట్లాడుతూ కంద్రటావ్ ఇలా అన్నాడు.

" అన్నింటి కంటే ఆశ్చర్యం గొలిపే విషయం ఏమిటంటే, ప్రపంచ అత్యంత ప్రాచీన నాగరకతలలో కనీసం మూడింటిలో రెండైనా, ద్రవిడ భాషలు మాటాడే వారితో ముడివడి ఉన్నాయి[3].

**మూడు జలప్రళయాలు**

భారత ఉపఖండంలో సంభవించిన భౌగోళిక పరివర్తనలో ఎక్కువగా జలప్రళయాల వల్ల జరిగినట్లు కనిపిస్తోంది. ఖగోళ సంబంధమైన లెక్కలు ఆధారంగా, ఆచార్య కె. శ్రీనివాస రాఘవన్, మొదటి జలప్రళయం క్రీ.పూ. 14715లో సంభవించిందన్నాడు[4]. లాబ్‌సాంగ్ రాంప టిబెటన్ రికార్డులను పరిశీలించాడు. జల ప్రళయం నీరు క్రీ.పూ. 2,278 సంవత్సరంలో ప్రవహించినట్లు ఆ రికార్డు చెప్పింది. "ఈ జల ప్రళయం ఆ రోజుల్లో మెరక భూములను తప్ప మొత్తం చైనాను ముంచి వేసింది[5]. కాని సిద్ధాంత దీపిక చెప్పినట్లు "యుగ సంబంధ విలయనాలు, ముంపులు ఉత్థానాలు లాంటి సంఘటనల ఖచ్చితమైన కాల నిర్ణయానికి భారతీయ భూగర్భశాస్త్ర సర్వే రికార్డులు తోడ్పడవు. శిలాజసంబంధ లేదా శిలాస్తర సంబంధ ఆధారాలు కాలాలను, యుగాలను, దిక్చక్రాలను ఉజ్జాయింపుగా చెప్పగలవే కాని, ఖచ్చితంగా శతాబ్దాలతోను, సంవత్సరాలతోను చెప్పలేవు"[6].

ఈ మూడు జల ప్రళయాలు సంభవించిన ఖచ్చితమైన కాలాలు ఏవైనా, భారత భూశాస్త్ర చరిత్రలో నాలుగు విస్పష్టదశలను సూచించే సాహిత్యాధారాలున్నాయి. మొదటిది జలప్రళయ దశకు ముందరి దశ. "దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, ఇండియా అంటార్కిటికా కూడ ఒకప్పుడు గండ్వానా ఖండంలో భాగాలనే విషయం భూగర్భశాస్త్ర వేత్తలకు, జంతుశాస్త్రజ్ఞులకు శిలాజ జీవాకృతుల శాస్త్రజ్ఞులకు సుస్పష్టం[7]. మొదటి జలప్రళయం సంభవించినప్పుడు ఈ ఖండాలన్నీ వేరైపోయాయి. ఇండియాను ఆస్ట్రేలియాను కలిపిన లీమరియా భూఖండం పూర్తిగా మునిగిపోయింది. ఫలితంగా భారతదేశం పెద్ద ద్వీపం అయింది. ఈ ద్వీపాన్ని 'జంబూదివు' లేదా 'నవలాండివు' అని పిలిచారు. తమిళ సంగసాహిత్యం మణిమేఖల దానిని, "జంబూదివు అని పిలువబడిన పెద్ద భూఖండంలో ఉన్నట్లుగా పేర్కొంది. మరో సంగం సాహిత్యం 'పెరుమకథై' దానిని, "బాగా నీరు పారింపబడిన నవలాండివు ప్రాంతంలో" ఉన్నట్లుగా పేర్కొంది.

రెండో ప్రళయం వచ్చినప్పుడు, ఇండియా ఒక ద్వీపంగా లేదు కాని దాదాపుగా ఇప్పటి ప్రస్తుత రూపాన్ని సంతరించుకొంది. దక్షిణ భాగం తిరిగి వివరీతంగా నష్టపోయింది. ప్రధాన భూఖండం నుంచి శ్రీలంక విడివడిపోయింది. "రెండవ జలప్రళయ కాలంలో, ముతుర్ లేదా తరువాత కాలంలో పాత పట్టణమని పిలవబడిన మధురను (ఇప్పటి మధురకాదు పాతమధురై) రాజధానిగా చేసుకొని పాండ్యులు పరిపాలించిన తమిళహమ్‌లో అధికభాగం మునిగిపోయింది. ఈ నాగరక ప్రాంత వాస్తవ్యులలో చాల మంది సముద్రంలో కొట్టుకుపోయారు. కొంతమంది తమ నావలలో సముద్రం మీద వెళ్ళిపోయారు. ఇంకొంతమంది ఉత్తరంగా వింధ్య పర్వతాలను ఉత్తరించారు" పాండ్యులు తమ రాజధానీ నగరాన్ని పాత మదురైనుంచి కవటపురానికి మార్చారు. అపుడు దక్షిణాది నుంచి ఉత్తరానికి హిమాలయాల వరకు ఒక పెద్ద వలస జరిగింది". కోండుల కూల భాష తమిళం లాగే ద్రావిడ భాషే. ఒరాన్, రాజమహల్‌లు గూడ మొత్తం మీద ద్రవీడాలే. సింధుకు పశ్చిమాన ఉన్న ప్రాచీన జాతులకు ద్రావిడులకు మధ్య సంబంధాన్ని నిర్ధారణ చేసేటంతగా బ్రూహి భాష వాటి లక్షణాన్ని పంచుకొంది. ఇక బెహస్టన్ లోని సిథియన్ ఫలకాల భాష సరేసరి. టలమీ కాలంలో, అప్పటికి పూర్వమెప్పుడో, భారతదేశంలోని ప్రతిభాగం, స్థిరపడి, నాగరకమై ఉన్న కాలంలో, ద్రావిడులు ఆగ్నేయ తీరాన్నే కాక, గంగా తీరం వరకు ద్వీప కల్పాన్ని మొత్తాన్ని తమ అధీనంలో ఉంచుకొన్నారు[10]. భారత ఉపఖండ ప్రాచీన చారిత్రక యుగాలలో ద్రావిడులు ఉత్తరంగా వలస పోయారనే విషయాన్ని అలెగ్జాండర్ కంద్రటవ్ కూడ ధ్రువపరుస్తున్నారు. "భాషా పరమైన సమాచారం, ద్రావిడ భాషలో ఉత్తరాదినుంచి దక్షిణాదికి కాక దక్షిణాది నుంచి ఉత్తరాదికి వ్యాపించాయని తెలియజేస్తున్నది"[11]. అలెగ్జాండర్ కంద్రటివ్ రుజువు చేసినట్లు, దక్షిణాది నుంచి వచ్చిన ఈ వలసదారులు, బహుశ మహెంజొదారో హరప్పా నాగరకతలకు

పూర్వులై ఉంటారు.

తరవాత తృతీయ జలయ ప్రళయం ఆగమించింది. పాండ్యుల రాజధానియైన కవటపురం కూడ మునిగి పోయింది. ఆధునిక ముధుర (Madura) సమీపంలో ఉన్న మనలూరు లేదా మనలియైర్‌లో రాచనగరు కట్టుకొన్నారు. తరువాత రాజవాసం మదురకు మార్చబడింది. వైగె (Vaigai) నది గతి మారింది. మూడవ జల ప్రళయం కేవలం నదుల గతులను, వాటి అమరికలను మార్చడమే కాక, అంతకుముందు కనివిని ఎరుగనంతటి భూకంప వాతావరణ సంబంధ పరివర్తనలను కూడ తెచ్చిపెట్టింది. టి. లాబ్సాంగ్ రాంప (T.Lobsang Rampa) చెప్పిందీ, ఇంతకుముందు మనం చెప్పిందీ, ఈ జలప్రళయం గురించే. సరిగా ఇదే కాలంలో, భారత దేశంలోకి ఆ తరవాత దక్షిణాదికి ఆర్యులు వలసయాత్ర ప్రారంభించారు. ఆర్యులు స్వర్గం ఆర్కిటిక్‌లో ఉందని 'జెండ్ అవెస్థ' (Zend Avestha) పేర్కొంటున్నది. అక్కడ సూర్యుడు సంవత్సరంలో ఒక్కసారే దర్శనమిస్తాడు. కాని ఒకప్పుడు మంచు విపరీతంగా పడింది. దేశం వినాశమై పోయింది. విపరీతమైన చలికారణంగా ఆర్యులు ఆ ప్రాంతాన్ని వదిలి దక్షిణాభిముఖంగా బయలుదేరారు. ఆర్యుల ఈ దక్షిణాభిముఖ వలసయాత్ర వారి నాయకుడైన విష్ణు నేతృత్వంలో జరిగినట్లు ' ఋగ్వేదం 1-22-16-21 తెలుపుతున్నట్లున్నది. మధ్య ఆసియాలో వాతావరణంలో మార్పుల వల్ల తరుమబడిన ఆర్యులు, మహోన్నత కష్టతర గిల్‌జిత్, చిత్రాల్ కనుమల గుండా భారతదేశంలోకి ప్రవేశించి గంగా-యమునా సారవంతమైన మైదానంలో స్థిరపడ్డారనే డా. హెూర్నల్ (Hoermel) ప్రసిద్ధ సిద్ధాంతాన్ని సర్‌జార్జి గ్రేయర్‌సన్ (Sir George Grierson) భాషా సర్వేక్షణం ధృవీకరించింది. వారు వలస వచ్చిన దారి కష్టతరంగా ఉండడంతో వారి స్త్రీలు వారి వెంట రావీలు లేకపోయింది. అందుకని ఆ నీల ద్రవిడ ఆదిమ జాతులకు చెందిన భార్యల, కూతుర్లను, భార్యలుగా వారు గ్రహించారు. ఇక్కడ, తమ దృష్టిలో, తమ కంటే హీనమైన, వేరే జాతితోడి సంపర్కం వర్ణవ్యవస్థకు దారి తీసింది. వైశ్యులు, శూద్రులతో పాటు, స్త్రీజన్మను గూడ పాపపంకిలంగా పరిగణించిన భగవద్గీత 1వ ప్రకరణం 32 వ శ్లోకానికి నేపథ్యం బహుశ ఇదే. స్త్రీజనం ముఖ్యంగా అనార్యుల నుంచి గ్రహించబడ్డారు గనుక వారికి కలిగిన పురుష సంతానం కూడ వారితో సమం కావడానికి, ఉపనయన క్రతువు ద్వారా తిరిగి తిరిగి పుట్టవలసి వచ్చింది. (ఉపనయన కర్మ మరో జన్మనిస్తుంది. అందుకనే ఉపనయన కర్మ విహితమైన వారినందరిని ద్విజులు-రెండు సార్లు పుట్టినవారు అంటారు. (అనువాదకుడు) ఇది ద్విజ లేదా రెండు సార్లు పుట్టిన వారికి సంబంధించిన సిద్ధాంతం. ఒక పక్క ఈ కర్మ కొనసాగింది మరో పక్క సంస్కృతీకరణ ప్రక్రియతో ఇది విస్తృతం అయింది. దీనితో ఈ కర్మ మౌలిక ఉద్దేశం అనేక నిర్దిష్ట మత క్రతువులకు దారి తీసింది.

**సిద్ధ సంప్రదాయం**

నిమియన్ స్మార్ట్ (Nimian Smart) ప్రకారం, "సుసంపన్నమైన ప్రాచీన భారతీయ సంస్కృతికి ముఖ్యకారణాలలో ఒకటి ఆర్యుల అనార్యుల మధ్య జరిగిన పరస్పర ప్రక్రియ; భారతీయ వారసత్వంలో అభివ్యక్తమైన వైరుధ్యాలకు కూడ అదే కారణం", అతడు ఇంకా అంటాడు: "అనార్య మత, తాత్త్విక ప్రవాహాలు ఉపనిషద్రచనను ప్రభావితం చేశాయి. ఇదే కాలంలో వేదవాదాన్ని, బ్రాహ్మణాల వారసత్వాన్ని ఎదిరించిన సంప్రదాయ వ్యతిరేక బోధలలో ఇవి ప్రాథమిక పాత్రను నిర్వహించాయి''[12] అలెగ్జాండర్ కండ్రటల్ దీనిని ధృవపరుస్తున్నారు. ఆయన ఇంకా ఇలా అంటున్నారు: "దశాంక గణనాన్ని" భారతదేశం కనుక్కొంది. కాని దీనిని కనుక్కొంది ఆర్యులు కాదు, మొదటి భారతీయులు. ఆర్యుల రాక పూర్వం అనేక శతాబ్దాలకు ముందు నుంచే ఆదిమ భారతీయుల వర్తకులు, గణితవేత్తలు దానిని ఉపయోగించారు. ఆదిమ భారతీయ మత, పురాణాలు, విజేతలైన ఆర్యుల మతాన్ని ప్రభావితం చేశాయనడంలో సందేహంలేదు. నిజంగా, ఇది ఒక సమ్మిశ్రణ ప్రక్రియ. ఆర్య భారత చరిత్రలో మొదటి దశను బ్రాహ్మణ పూజారుల అవిభాజ్య పాలనతో గుర్తించవచ్చు. ఈ పూజారులు తమను సజీవ దేవతలుగా వాకొన్నారు. అత్యంత శక్తిమంతులైన అనాధ్యులు రహస్యంగా తమ మత విశ్వాసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. అత్యంత విస్తృత అధ్యాత్మిక సంకట స్థితి క్రీ.పూ. ఆరవ శతాబ్దిలో ఈ విశ్వాసాలను బహిరంగం చేసింది. బ్రాహ్మణ మతాన్ని త్రోసిరాజన్న బౌద్ధ, జైన, హిందూ మతాల పునాదులలో ఈ విశ్వాసాలున్నాయి"[13]. ఈ విధంగా రహస్యంగా దాచబడిన, బౌద్ధ, హిందూ, జైనాలను ఏకం చేసి బ్రాహ్మణ మతాన్ని త్రోసి రాజన్న ఆ ఉమ్మడి అనార్య వారసత్వం ఏమిటి? దీనిని సిద్ధ సంప్రదాయం లేదా యోగ సంప్రదాయంగా గుర్తించవచ్చు. ఈ సంప్రదాయానికి గుర్తింపు గానే బుద్ధుడిని సిద్ధార్థుడన్నారు. భగవద్గీత పదవ ప్రకరణం 26వ శ్లోకంలో కృష్ణుడు అంటాడు: "సిద్ధులందు నేను కపిల మౌనిని" ఈ ముని వరంగానే గౌతమబుద్ధుని నగరాన్ని 'కపిలవస్తు' అన్నారు. ఈ సిద్ధుడు లేదా ఆ తరువాత కాలంలో అదే పేరు కలిగిన మరో సిద్ధుడు సాంఖ్య సిద్ధాంతాన్ని క్రోడీకరించాడు.

**ప్రథమ యోగి**

మొదట సిద్ధుడు లేదా యోగి ఎవరు? ప్రథమ యోగి దక్షిణామూర్తి అని తమిళ సాహిత్యం మొత్తం అంటున్నది. ఇతనినే శివుడని కూడ అంటారు. దక్షిణామూర్తి అనే పేరుకు అర్థం, "కానుకలతో గౌరవంతో సంభావింపదగిన గొప్పవాడు" పరముడని, పరమశివుడని, పరమేశ్వరుడని, సిద్దేశ్వరుడని, యోగేశ్వరుడని, మహేశ్వరుడని, మహదేవుడని, మహేంద్రుడని మౌనమూర్తి అని, గణమూర్తి అని ఇంకా అనేక నామాలతో అతడు తెలియ బడతాడు. తమిళజైన సాహిత్యమైన 'తిరుక్కుఌంబహమ్' మొదటి పద్యంలో జైన ప్రథమ తీర్థంకరుడైన అరుహన్‌తో శివుని సమం చేస్తుంది[16]. హిందువులు తమ తత్త్వాన్ని శైవ సిద్ధాంతంగా క్రోడీకరించుకోగా, "క్రీ.పూ. మూడవ శతాబ్ది ఆరంభంలో పాటలీపుత్రం వద్ద జరిగిన జైన సమావేశంలో జైన మతసాహిత్యం తనను తాను 'సిద్ధాంత' మని చెప్పుకొన్నది. దీనిని శ్వేతాంబర జైనులు అంగీకరించారు కూడ[17]. (శైవానుయాయులను శివుని త్రిశూలం, శివతంబరులని పిలిచినట్లుగా) బౌద్ధం త్రిరత్నాలు - రెండూ ఒకే దివ్యత్వప్రతీకను సూచిస్తాయని భావించబడింది. చరిత్రకారుడు నీలకంఠశాస్త్రి అంటున్నారు. "శైవ వాదం చాల వరకు సిద్ధాంత శాస్త్రంలో (dogmatics) సాంఖ్యంతోను, ఆచరణాత్మక యోగ

శిక్షణలో యోగంతోను ఏకీభవిస్తుంది. వైశేషిక సంస్థాపకుడు కూడ తన బ్రహ్మాండమైన యోగం ద్వారా, మహేశ్వరుని దయను పొందిన తరువాతనే, తన పనికి ఉపక్రమించాడని చెబుతారు. గౌతమ, కణాదులు శైవులని తొలికాలపు జైన రచయిత హరిభద్రుడన్నాడు"[18]. ఈ విధంగా, సిద్ధాంతంతో పాటు సాంఖ్యయోగాలు, 'యోగదక్షిణామూర్తి' బోధల నుంచి పరిణమించాయని చెప్పవచ్చు. అలెగ్జాండర్ కంద్రటల్ అంటున్నారు. వేద మంత్రాలను, వేద దేవతలను సృష్టించిన సంచార ఆర్యజాతులు ప్రవేశించక ముందున్న భారత ఉపఖండ ప్రజలలో ఉన్న అనేక ప్రాచీన మత సంప్రదాయాలను శైవ సంప్రదాయం తనలో కలుపుకొన్నదని ఇండియా శాస్త్రజ్ఞులు (Indologists) నమ్ముతున్నారు". "ఆదిమ భారతీయులు పూజించిన దేవుడు శివుని మూల రూపం కనుక, శివ భక్తులు "తమ దేవుడు వేదాల కంటే ప్రాచీనుడని" అనుకోవడంలో తప్పులేదని ప్రాచీన భారత నగరాల త్రవ్వకాలు సూచిస్తున్నాయి"[19] శైవ సిద్ధాంతం మీద పండితులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇవి:'

"శైవవాదం ప్రపంచంలో కెల్ల అత్యంత సజీవ ప్రాచీన విశ్వాసం"

సర్‌బాన్ మార్షల్

"ద్రవిడ బౌద్ధిక ఉత్పత్తులలో కెల్ల అత్యంతంగా వరణీయమైంది శైవ సిద్ధాంత తత్వం భారత దేశ మతాలలో కెల్ల నిస్సందేహంగా అత్యంత సహజమైన విలువగలదీ, ప్రాభావికమైందీ, విపులమైందీ శైవ సిద్ధాంతాం

డా.జి.యు.పోప్

"మానవ చింతనలో పరిపూర్ణ, ప్రతిభావంత దర్శనాలలో శైవ సిద్ధాంతాన్ని అగ్రగణ్యంగా పరిగణించవచ్చు"

డా. కమిల్ జ్వెలిబిల్

"మనకు లభించిన వాటిలో శైవ సిద్ధాంతం లాంటిది మరో దర్శనం కాని, విశ్వాసం కాని, పూజావిధానం కానిలేవు. దీనికి గొప్ప ప్రాచీనతకు, ఉండే శ్రేష్ఠతలున్నాయి. ఒక మత దర్శనంగా విశ్వాసుల జీవిత అభివ్యక్తిగా శైవ సిద్ధాంతమంతటిది దక్షిణ భారతంలో మరొకటి లేదు. వాస్తవానికి ఇండియా మొత్తంలో, దాని అంతర్గత శ్రేష్ఠతలు ఆధారంగా, శైవ సిద్ధాంతాన్ని 'భారతీయ చింతన జీవనాల జలరేఖ (water - mark) గా అంటే ఔన్నత్య రేఖగా పరిగణించడం తొందరపాటు కాదు". –డా. డబ్లియు.హచ్. గోల్

"నాకు తెలిసినంతలో ఏ సాహిత్యం కూడ, వైయుక్తిక మత జీవితాన్ని – దాని పెనగులాటలను విషాదాలను, దాని ఆశాభీతులను, దాని విశ్వాస, విజయాలను – అంత స్వేచ్ఛగా, అంత ప్రగాఢంగా వర్ణించలేదు". –శ్రీ చార్లెస్ ఇలియట్

"ఇతర దర్శనాలకు తెలియని పదార్థాలను పరిగణనలోనికి తీసుకోవడం ద్వారా, సిద్ధాంతం ఔన్నత్యం స్థిరీకరింపబడింది. ఉదాహరణకు సాంఖ్యం ఇరవైనాలుగు పదార్థాలనే గుర్తించింది. యోగం కూడ అదే సంఖ్యను మొత్తం మీద గుర్తించింది. అదనంగా అది దేవుని ప్రతిపాదించినప్పటికీ పాంచరాత్రం, ఇంక ఇతర ఆగమాలు, ఇంతకంటే ఇంక ఎక్కువ పదార్థాలు గుర్తించవనీ, అ సమయంలో 'సిద్ధాంతం' ఒక్కటే ముప్పై ఆరు పదార్థాలను గుర్తిస్తుందనీ భావించారు. ఈ ముప్పై ఆరు పదార్థాల జ్ఞానం వల్ల శివైక్యాన్ని అంటే అంతిమ విముక్తిని పొందవచ్చు". –ఆచార్య యన్.యన్. సూర్యనారాయణ శాస్త్రి[20]

**ప్రాక్తన చతుష్టయం**

దక్షిణామూర్తి శిష్యులెవరు? మొయికందదేవర "శివజ్ఞాన బోధ"లో ఆవాహన గీతం అంటున్నది:

"వటవృక్షం క్రింద కూర్చున్న నిశ్శంకుడు (Doubtless one) ప్రసాదించిన అనస్కృత (unmade) అసమాన (unmatched) కుసుమాన్ని రుషి పుంగవులు (Sanitary ones) అలంకరించుకొంటారు"[21].

ఇక్కడ సూచితమైన అనమాన కుసుమం లింగాకృతిలో ఉన్న శివుని మూడవ నేత్రం. యోగానికి అంతిమ దశ అయిన సమాధ్యవస్థలో భూమధ్యంలో యోగికి ఈ నేత్రం ఉన్మీలనమవుతుందని భావించబడుతుంది. అత్యంత యౌగిక అనుభవ అంతిమ పరాకాష్ఠగా, మెదడులోని వివిధ శక్తి కేంద్రాల పరస్పర చర్య కారణంగా ఈ విశ్వ చేతన కుసుమం వికసిస్తుందని వివరించబడింది. ఒక శిల్ప శాస్త్రంలోని మరో అభిమంత్రణ గీతం ఇలా ఉంది:

"సత్యం పరిపూర్ణతకు అవతారమై, దానిని వటవృక్షం కింద కూర్చున్న రుషి చతుష్టయానికి ఆవిష్కరించిన పరమ్‌ను ప్రతిఒక్కరూ దైవంగా అంగీకరించారు"[22].

మహేంద్రగిరి మీద మర్రి చెట్టు క్రింద కూర్చున్న తన శిష్య చతుష్టయానికి దక్షిణామూర్తి ఉపదేశం గావించాడని చెప్పబడింది. ఇక్కడ చెప్పబడిన శిష్య చతుష్టయం (1) సనగర్(సనక) (2) సనందర్ (సనందన) (3) సనతర్ (సనాత్సుజా) (4) సనత్కుమారర్ (సనత్కుమార) లనే విషయంపై దాదాపు అన్ని తమిళ శైవ గ్రంథాలు ఏకాభిప్రాయన్నే తెలియజేస్తున్నాయి. వారంతా యోగానుభవ అంతంలో రుషిస్థితిని సాధించారని చెప్పడానికి వారందరికీ 'సన్' అనే ఉపసర్గ తగిలించబడింది. యోగ మార్గాన్ని శివజ్ఞాన సిద్ధులు "సన్మార్గ" మని[23] వ్రాకుచ్చారు. అ ఉపసర్గను తీసివేసినట్లయితే, వారు నాగ, నంద, నాధ, నాత్కుమారులవుతారు. 'నాగ' నామం బౌద్ధంలో ప్రసిద్ధం. అలాగే జైనంలో 'నాధ', హైందవంలో 'నంద', 'కుమార' నామాలు ప్రసిద్ధం. వాస్తవానికి, భారతదేశ చరిత్రలో పేర్కొన్న, అత్యంత ప్రాచీన గొప్ప రాజ వంశాలు నాగులు, నందులు. భగవద్గీతలోని పదవ ప్రకరణంలో ఆరవ శ్లోకం ఈ నలుగురు – రుషులచే ప్రాక్తన చతుష్టయం అంటున్నది. స్వామి చిన్మయానందులు ఇలా వివరిస్తున్నారు: "సృష్టి కర్త అయిన బ్రహ్మ, సృష్టి ఆరంభంలో తన మనస్సునుంచి నలుగురు శాశ్వత కుమారులను సనత్కుమార, సనక, సనాత, సనందులను ఉత్పత్తి చేశాడని చెప్పబడింది[24]" "నాగులలో నేను ఆనందుడను", అని కృష్ణుడు భగవద్గీత పదవ ప్రకరణం 29వ శ్లోకంలో అంటున్నాడు. బుద్ధుని జీవిత చరిత్ర వ్రాసిన వాడు, ధర్మపథ రచయిత ఆనందుడనేది జగద్విదితం. రాజు హర్షుడు తన బౌద్ధకృతిని 'నాగానందం' అన్నాడు. నాటక ఇతివృత్తం ఏమిటంటే, జీమూత వాహనుడు, నాగుల తరపున దాడిచేసిన వానికి (గరుత్మంతునికి) ఆహారమయ్యాడు. అప్పుడు అ ఆక్రమణదారు తన తప్పిదాన్ని తెలిసికొంటాడు. తనకు ఆహారంగా వచ్చిన నాగుని వదిలి వేశాడు. నాగలోకం సంతోషించింది.' అలెగ్జాండర్ కంద్రటల్ పేర్కొన్నట్లు విజిత ప్రజలు ఎందుకు రహస్యంగా తమ మత విశ్వాసాలను

కొనసాగిస్తున్నారో ఈ నాటక ఇతివృత్తాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. భగవద్గీత పదవ ప్రకరణం 24వ శ్లోకంలో కృష్ణుడు అంటున్నాడు: "సేనానులలో నేను స్కందుడను". ఇది సనత్కుమారుని గురించి స్వామి చిన్మయానంద ఈ శ్లోకాన్ని ఇలా వివరిస్తున్నాడు. "నేను సేనానులలో స్కందుడను - మయూరవాహనుడు, శూల నియంత్రకుడు అయిన శివకుమారుణ్ణి".. ఒక పక్క అతడు శికుమారుడుగా, వేరోవైపు ఇంద్రసేనానిగా అభివర్ణితుడయ్యాడు. టెరా టామిలిక అంటున్నది: "జాతీయ సాహిత్యం నెమ్మది నెమ్మదిగా మార్పులకు లోనైంది. ఎలాగంటే దాని కథలు గాథలు పరివర్తితమయ్యాయి. దాని నాయకులు ఔత్తరాహిక నాయక మూర్తులతో కలగాపులగం కావడం కాని, కలిసి పోవడం, గా జరిగింది. దాని దేవతలు నామాంతరాలతో, ఆర్యదేవతాగణంలో ఇంకిపోయారు. ఈ క్రమపరివర్తనం క్రీ.పూ. ఐదవ శతాబ్దికి ముందే 'గతకర్మ' (Faint accompli) అయింది" [25] బ్రాహ్మణాల, శాస్త్రాల, ఇతిహాసాల, పురాణాల ద్వారా జరిగిన ఈ సాంస్కృతిక వ్యాప్తి ప్రక్రియనే మామూలుగా సంస్కృతీకరణం (Sanskritization) అన్నారు.

**అణచబడ్డ వారసత్వం**

సంస్కృతీకరణానికి ఉదాహరణగా చెప్పాలంటే, 'లింగాకారంగా' ఉన్న మూడవ కన్నును శిశ్నంతో సమానం చేశారు. "లింగపూజ అనేది, దేవదారు అరణ్య (pine forest) రుషుల (బ్రాహ్మణుల) నాయకుడైన భృగు శివునికి విధించిన శాపం"[27].

శివుని మొదటి బ్రాహ్మణపర ప్రతీక, చిత్తూరుజిల్లా రేణిగుంట దగ్గర గుడిపాలెంలో క్రీ.పూ. మూడవ శతాబ్దిలో నిర్మించబడ్డ శైవదేవాలయంలో ఈనాడు మనకు లభిస్తుంది. "ప్రాచీన' శైవకళవాస్తు వీకాసం" అనే తన గ్రంథంలో "The Development of early Saiva Art and Architecture(Published by Sundeep Prakasan, Delhi 1982) పుట 55. లో ఐ.కె.శర్మ చెప్పినట్లు, "అన్ని ఆగమాలలో ఆవశ్యంగా భావించబడిన యజ్ఞోపవీతం మూడవ కంటితో పాటు అదృశ్యం కావడం కొట్టవచ్చినట్లుగా కనిపించే విషయం". ఇక్కడ చెక్కబడిన శివుని నగ్న రూపం బహుశ రుగ్వేద శిశ్నదేవ లేదా మహానగ్న లేదా బహుళ భిక్షాటన రూపాన్ని ప్రస్ఫుటం చేయడానికై ఉద్దేశించి ఉండవచ్చునని అతడు అభిప్రాయం వెలిబుచ్చాడు. "మహాభారతంలో దేవదారు వన ఉపాఖ్యానంతోను, పురాణాలతోను ముడిపెట్టబడిన సన్యాసి 'లింగవృత్తి' (ascetic hypocrisy)ని ఈ నగ్నత్వం ఎత్తి చూపుతుందా?" అని అతడు సరిగానే అడుగుతున్నాడు. ఇంకా అతడు అంటున్నాడు: "లింగానికి శిశ్నంతో అవశ్య సంబంధం లేదు. చిలమకూరు అగస్త్యేశ్వరాలయం తిరుత్తని విరథనేశ్వరాలయం, తెన్నేరి అపత్సేశ్వరాలయాలలో వలె, అరుదుగానే కనిపిస్తున్నప్పటికీ ఈకాలంలో శివ లేదా లింగపూజలో 'యోని - లింగ' ఆరాధన దట్టంగా అల్లుకొన్నప్పటికీ, అతనిని (శివుని) తరువాతి చారిత్రక కాలాలలో కూడా పురుషునిగా, అంగుష్ఠాకృతిలో వర్ణించారు". అదే గ్రంథంలో 170 వ పేజీలో అతడంటాడు. "గుడిమలమ్ ఆకృతి యోగ ఇంక శిశ్న సంబంధమైన అనేక వైధర్మ భావనలను ప్రదర్శించింది. ఇంకా, భీట ఉదాహరణకు వలె, లింగ సంకేతానికి అశ్లీల శిశ్న (ithyphallic) ఆరాధన కలవబడింది. ఆర్.జి. భండార్కర్ మాత్రం, ఏది ఎలాగున్నా "పతంజలి కాలంలో లింగపూజ ప్రాచుర్యంలో లేదు. విమకడ్ఫిజెన్ కాలంలో కూడ దానిని గురించి తెలియదు", అన్నాడు. "పర్వత - నదీ ఆరాధకమైన శైవ మతంలోకి ఈ లింగపూజ వైష్ణవమూలం నుంచి ప్రవేశపెట్టబడిందని చెప్పారు. ఒకే మూర్తికున్న సృష్టి, స్థితి, లయలనే మూడు ప్రకార్యాలను, ముగ్గురు మూర్తుల కిచ్చారు. ఒక మూర్తి ముగ్గురు మూర్తులయ్యారు మండుతున్న శ్మశాన వాటికలలో మానవ కపాలాల కోసం పర్యాటనం చేసే శ్మశానదేవునిగా శివుని వర్ణించారు. అతనికి కపాలేశ్వర నామం కూడా ఇవ్వబడింది. నాగరుషి సర్పంగా పరివర్తితమై శివుని మెడకు చుట్టుకొన్నాడు. నంద రుషి ఎద్దుగా మారి శివుని మూకవాహనమయ్యాడు. నాథరుషికి ఏనుగుముఖాన్నిచ్చి, భూతనాథుణ్ణి చేశారు. అతడిని గణపతిని లేదా గణేశుని చేశారు. కుమార రుషికి ఆరు ముఖాలను, ఆరు సేనా రక్షకదుర్గాలను ఇచ్చి సేనా నాయకుని చేసింది స్కంధ పురాణం: విష్ణు పురాణం దాదాపుగా స్కంధ పురాణం తీరులోనే నడిచింది. స్కంధంలో కృష్ణుని మూర్తిమత్వం కుమారుని మూర్తిమత్వాన్ని పుణికి పుచ్చుకొంది. బాలమురుగ బాలకృష్ణుడయ్యాడు. కుమారుడు పద్మాసురుని చంపితే, కృష్ణుడు వహాసురుని చంపాడు. కుమారుడు వల్లిని, ధీవనైనిలను వివాహమాడాడు. కృష్ణుడు భామను, రుక్మిణులను వివాహమాడాడు. కుమారుడు మురుగ సుందరుడయ్యాడు, కృష్ణ లేదా తిరుమల్ అంగర్ సుందరుడయ్యాడు. కుమారునికి ఒక చేతిలో మయూర కేతం ఉంటే రెండవ చేతిలో శూలం ఉంది. కృష్ణునికి యుద్ధ సంకేతం శంఖువు ఒక చేతిలో ఉంటే రెండవ చేతిలో ఆయుధం చక్రం ఉంది. తిరుపతిలోని కృష్ణ విగ్రహానికి, తిరుచందూర్ లోని కుమారుని విగ్రహానికి తేడా లేదు. కాకపోతే, కృష్ణునికి చేతిలో శూలం లేదు, నుదుటిపై నామం ఉంది. అంతే తేడా. తాత్త్విక భావనల మీద భగవద్గీతలో కృష్ణుడు చేసిన బోధలు, చాందోగ్యోపనిషత్తులో సనత్కుమారుని బోధలకంటె పెద్దగా భిన్నంగా లేవు. ఇంకా అవి, అంతకంటే ప్రాచీన శైవ గ్రంథమైన శేతశ్వేతర ఉపనిషత్తు దారిలో నడిచాయి. ప్రాచీన చతుష్టయాన్ని పైకొన్న వరివర్తన తరువాతి అనుచరులకు కూడ పరివర్తన గతిని నిర్ణయించింది. విశ్వామిత్రుడు ఒక దుప్పికి పుట్టాడు. శంభుకర(శంబుకుడు) నక్కకు, గౌతముడు ఆవుకు అగస్త్యుడు కడవకు, మండొరిమర్ (మాండూక్యుడు) కప్పకు, కంగేయుడు గాడిదకు, సవనగర్ (శౌనకుడు) కుక్కకు, గణధరుడు బల్లికి, నకుడు చిలుకకు, అశ్వధముడు గుర్రానికి, హనుమంతుడు కోతికి పుట్టారు. సంస్కృతీకరణం దాచిపెట్టిన ప్రాచీన వారసత్వం ఇలా ఉంది.

గాథలు, పురాణాలు, ప్రపంచమంతటా కూడ, ప్రాచీన మత సంప్రదాయాలలో భాగంగానే ఉన్నాయి. ఇలీయడ్ (Iliad) ఒడిసె (Odyssey), పాత నిబంధనల గ్రంథం, కొత్త నిబంధనల గ్రంథాలు - అటువంటి అన్ని సాహిత్యాలలోను కథలు, దృష్టాంతాలు ఉంటాయి. మన దేశంలో, కూడ, శిల పట్టికరమ్, మణిమేకలై, జీవక శింతామణి, వలయవథి, కుండల కేశిలు అనే ఐదు గొప్ప తమిళ ప్రామాణిక గ్రంథాలున్నాయి. బౌద్ధులకు వారి జాతక కథలు ఉన్నాయి. కాని ఒక్క సంస్కృత సంప్రదాయాలు మాత్రమే ఇతర సంప్రదాయాన్ని విక్షేప,

శబ్ద, చౌర్యాల ద్వారా కించపరచాలనే, తుడిచిపెట్టాలనే దీక్షతో ఇతిహాసాలు, శాస్త్రాలు, పురాణాలు, బ్రాహ్మణాలు, రాయబడ్డాయి.. డా. ఆల్బర్ట్ ష్విట్జర్ (Albert Schwertzer) అంటున్నారు: "ఉపనిషత్తులను గందరగోళాలుగా వర్ణించినవారు పూర్తిగా పొరపాటేం వడలేదు"[28]. సంస్కృతాన్ని అత్యంతంగా అభిమానించే ఆచార్య మాక్సిములర్ కఠినంగానే చెప్పాడు. "భారతీయ చింతనా చరిత్రలో బ్రాహ్మణాలు అత్యంత ఆసక్తి కరమైన దశను ప్రతిబింబిస్తాయనడంలో సందేహం లేదు. అయితే వాటంతట వాటిని సాహితీకృతులుగా చూస్తే అవి చాల నిస్పృహనే కలిగిస్తాయి. అంతటి ప్రాచీనకాలంలో, అంతటి సామాజిక ప్రాక్తన స్థితిలో, ప్రపంచంలో మరెక్కడ సరిరానంత పాండిత్యదర్ప (పండితమ్మన్య), అసంబద్ధ సాహిత్యం జనించగలదని ఎవరూ ఊహించి ఉండరు. ఆశ్చర్యకరమైన ఆలోచనలకు, సాహసోపేతమైన అభివ్యక్తీకరణలకు, నిశిత వివేచనకు, కుతూహలాన్ని కలిగించే సంప్రదాయాలకు ఈ రచనలలో కొదువ ఏమీలేదు. కాని ఇవన్నీ కూడ మొండేనికి ఉన్న ముక్కల వంటివి, ఇత్తడిలోను సీసంలోను అతికిన మణుల వంటివి మాత్రమే. ఈ రచనల సామాన్య లక్షణాలు పల్లవ గ్రాహిపాండిత్యం, రసహీన అతిశయోక్తులు, ఆధ్వర్యుల దర్పం, ప్రాక్కాలీన విషయ కోవిద పండితమ్మన్యతులు. పురోహిత కళా (Priest craft) అంధ విశ్వాసాలు నూతన, ఆరోగ్యవంతమైన జాతి వికాసాన్ని ఎంతత్వరగా వినాశం చేస్తాయో చరిత్ర కారునికి తెలియవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. దేశాలు తమతమ కౌమార, అలాగే జరాలైక్లవ్య దశలలో ఈ అంటువ్యాధులకు గురి కావచ్చునని మనం తెలుసుకోవడం ముఖ్యం. ఈ గ్రంథాలను ఒకడు ఎలా చదవాలంటే, ఒక వైద్యుడు బుద్ధిహీనుల అర్థం పర్థంలేని వాగుడ్నీ పిచ్చివాళ్ళ ఔద్యోగిక స్థితులను ఎలా అధ్యయనం చేస్తాడో అలాగ". వేదాలు చదవగా విన్న కొందరి చెవులలో కరిగిన సీసం పోయాలి' లాంటి మనుస్మృతి నిర్దేశాలు, పుత్రకామేష్టి, అశ్వమేధయాగాలలో స్త్రీలను గుర్రాలతో సంభోగించాలని చెప్పే కొన్ని మంత్రాలు అటువంటి విమర్శకు తగినవే.

References


1. pages 127 - 31 "The Riddle of Three oceans"by Alexander Kandrator.

2. pages 13 - 14 of "Tamil India" by M.S. Phrnalingam pillai.

3. page 132 of "The Riddles of Three oceans" by Alkander Kandrator

4. This is reported in an article in The Hindu, a daily published form Madras, dated 4-6-1979. The Caption of the article is No more a Dravidian Myth".

5. page 163 of "The Third eye" by T.Lobsang Rampa.

6. page 13 of "Tamil India" by M.S. Purnalingam pillai.

7. page 124 of "The Riddles of three oceans" by Alexander Kandrator

8. page 2 of "Tamil India" by M.S.Purnalingam pillai.

9.page 3 of "Tamil India" by M.S.Purnalingam pillai.

10. page 108 of "A compartive grammer of Dravidian Languages" by Robert Caldwell.

11. page 150 of "The Riddles of Three oceans" by Alexander Kandrator.

12. page 78 of "The Religions experience of Mankind" by Nimian Smart.

13. page 181 of "The Riddles of Three oceans" by Alexander Kondretor.

14. page 621 of "The Holy Geeta" by Swamy Chinmayananda

15.'పరమ్' అనే పదానికి తమిళంలో అర్థం "పైనున్న లోకం" బ్రహ్మ, బ్రహ్మన్, బ్రాహ్మి (లిపి) మొదలైన పదాలు 'పరమ్' అనే పదం నుంచి వచ్చినట్లుగా కనిపిస్తున్నది.

16. page 154 of Tamilar Samaya Varalaru "by Velupillai".

17. page 44 of "The Cultural Heritage of India" published by Haridas Bhattacharya.

18. page 68 of the above book.

19. page 182 of "The Riddles of Three oceans" by Alexander Kondretor.

20. pages 134 - 135 of "Saiva Siddhanta as a philosophy of practical knowledge" by Swamy Vedachalam.

21. The English transliteration of the Tamil song reeds like this "Kallamizhan Malaivillar Aruliya
pollar Inaimallar Nallar Phnaivari.

22. The English transileration of the Tamil song reads like this. "Nallargal Nalavarnkkum Naravil pooranam keezhirnnda kannatralana param Ellarkum Deivame"

23. page 70 of "Naam Nattu Siddhargal" by R.Manickavasagam.

24. page 591 of "The Holy Geeta" by Swamy Chinmayananda.

25.page 39 of "Tamil India" by M.S.Purnalingam pillai.

26. "సంస్కృతీకరణం" (Sanskritisation), విసంస్కృతీకరణం (desanskritisation) అనే పదాలను ప్రముఖ భారతీయ సామాజిక శాస్త్ర వేత్త యమ్.యన్. శ్రీనివాస్ కల్పించాడు. అతడు సంస్కృతీకరణం అనే పదాన్ని రెండు అర్థాలలో ఉపయోగించాడు: (1) సాంస్కృతిక వ్యాప్తి ప్రక్రియగా (2) సాంఘిక గతిశీలతగా. ఈ బ్రాహ్మణ వాచ సాంస్కృతిక వ్యాప్తిని యమ్.యన్. శ్రీనివాస్ ఇలా నిర్వచించాడు; "సామాజిక నిశ్రేణిలోని అగ్రవర్ణాల, ముఖ్యంగా బ్రాహ్మణుల సంస్కృతిని దేశం అంతటా (దేశం వెలుపల బౌద్ధం ద్వారా వ్యాప్తి చెందించిన) వ్యాపింపజేసిన ప్రక్రియను స్పృశించకుండా సామాజిక వ్యవస్థ – హిందూ మతాల మధ్య సంబంధానికి సంబంధించని ఏ ఆలోచన పరిపూర్ణం అనడానికి వీలు లేదు. ఈ అగ్రవర్ణాల భాష సంస్కృతం కనుక, ఈ సాంస్కృతిక వ్యాప్తి ప్రక్రియను ఇక్కడ సంస్కృతీకరణం అన్నారు. (చూడు పుట 153 అతడు వ్రాసిన "Caste in Modern India and other essays") "సంస్కృతీకరణ భావన సంస్కృతీబద్ధం (culture bound)" అన్నాడు లించ్ కూడ ఈ గ్రంథంలో, సాంస్కృతీకరణం ద్వారా వ్యాప్తి చెందిన అనారోగ్యకర బ్రాహ్మణ సంస్కృతి ప్రభావాన్ని తొలగించే అర్థంలో విసంస్కృతీకరణం (De-Sanskritisation) అనే పదం వాడబడింది.

27.page 149 of Hindu Myths - penguin classics 1975.

28.page 32 of "Indian Thought and its Development" by Albert Schweitzer.

29. page 200 Max Muller's "Ancient Sanskrit Literature (Pamimi office edition)

ధారావాహిక

# అడుగుజాడలు - ఆనవాళ్లు

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

(21)

# నా ధర్మారావుపేట - అశోక్‌నగర్ యాత్ర

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖామాత్యులు శ్రీ జి.కిషన్‌రెడ్డి గారు ఒకరోజు హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్‌కు నన్ను పిలిచారు. కేంద్ర పురావస్తు సంస్థ(ఏఎస్ఐ) ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో 165, తెలంగాణాలో 8 రక్షిత కట్టడాలున్నాయి, తెలంగాణాలో ఇంత తక్కువగా ఎందుకున్నాయని ప్రశ్నించారు. 1953 వరకూ మద్రాస్ రాష్ట్రంలోనూ, అంతక ముందు బ్రిటీష్ పాలనలోనూ ఉన్న ఆంధ్రప్రాంతంలో, బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దక్షిణ భారత పురావస్తు మండలి, తీరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని చారిత్రక ప్రాధాన్యతగల ఆలయాలు, కోటలు, ఇతర కట్టడాలను రక్షిత కట్టడాలుగా ప్రకటించిందనీ, వాటిని, ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత, అవి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత అమరావతి సర్కిల్ పరిధిలో కొనసాగుతున్నాయనీ, అలాగే, తెలంగాణా ప్రాంతం, నిజాం పాలనలో అంతర్భాగంలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లోని కట్టడాలు 1914లో ఏర్పడిన నిజాం రాష్ట్ర పురావస్తుశాఖ ఆధర్వంలో ఉండేవని, హైదరాబాదు రాష్ట్రం ఏర్పడినప్పుడు, మహారాష్ట్ర, కర్ణాటక కట్టడాలు, ఆయా రాష్ట్రాల పరిధిలోకెళ్లాయనీ, 1956 ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత, చార్మినార్, గోల్కొండ లాంటి అనేక రాష్ట్ర పరిరక్షిత కట్టడాలు, కేంద్ర పురావస్తు శాఖకు అప్పగించటం జరిగిందని, అందుచేత ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో, కేంద్ర పురావస్తు సంస్థ రక్షిత కట్టడాల సంఖ్యలో చాలా తేడా ఉందని చెప్పాను.

సావధానంగా విన్న కిషన్‌రెడ్డిగారు, కనీసం మరో 30 రక్షిత కట్టడాలనైనా తెలంగాణా జాబితాలో కలపాలని, వాటిని గుర్తించి తనకొక నివేదిక ఇవ్వమన్నారు. వారసత్వ తెలంగాణ శాఖ గుర్తించని, జాతీయ స్థాయి వారసత్వ ప్రాధాన్యత గల 30 ఆలయాలను గుర్తించి తనుకున్నట్లుగానే తదుపరి వారం వారికి 30 కట్టడాల జాబితాను చారిత్రక వివరాలతో అందించాను. మంత్రిగారు ఏఎస్ఐ డైరెక్టరు జనరల్‌కు నా నివేదికను పంపగా, అక్కడ నుంచి, సంబంధిత హైదరాబాదు సర్కిల్ అధికారికి తగు చర్య నిమిత్తమై పంపారు. వారు సదరు జాబితా కట్టడాల వివరాలు సేకరించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ఈ జాబితాలో బుద్ధవనం ప్రాజెక్టు కార్యాలయ ఓఎస్డీ, కె.సుధన్‌రెడ్డిగారి ఊరైన ధర్మారావుపేటలోని త్రిలింగేశ్వరాలయం కూడా ఉంది. ఆయన, నన్ను వాళ్ల ఊరికి వచ్చి, చారిత్రక వివరాలతో కూడిన నివేదిక తయారు చేయండని ఆహ్వానించారు. వచ్చే ఆదివారమే ప్రయాణం. వారసత్వ తెలంగాణా, వరంగల్ కార్యాలయ సహాయ సంచాలకులు, మల్లూనాయక్‌కు తెలియజేసి, వరంగల్‌లో మాతోపాటు చేరమని ఫోన్‌లో చెప్పాను.

సుధన్‌రెడ్డి గారి కారులో హైదరాబాదులో బయలుదేరి, వరంగల్‌లో మల్లూనాయక్‌ను ఎక్కించుకొని నర్సంపేట వైపు వెళ్తున్నాం. పోతుంటే గీసుకొండ కనిపించింది. 2000లో ఆ వూరుకు చెందిన యుద్ధంరెడ్డి పొలంలో బౌద్ధ ఆనవాళ్లున్నాయని అదే ఊరికి చెందిన ముత్తినేని రాధాకృష్ణ నాకు తెలియజేశాడు. అతను సివిల్స్‌కు తయారౌతున్నందున ఊళ్లో అందరూ ఐఏఎస్ రాధాకృష్ణ అని పిలుస్తారు.

తవ్వకాల్లో శాతవాహన కాలపు బోధిసత్వుని మట్టిబొమ్మ, పూసలు, ఇటుకరాతి ముక్కలు, కుండ పెంకులు తప్ప కట్టడ అవశేషాలు దొరకలేదు. గీసుకొండ బౌద్ధక్షేత్రమనీ, పర్యాటక స్థావరం కావాలనుకొన్న రాధాకృష్ణ కోరిక తీరలేదన్న సంగతి గుర్తుకొచ్చింది. సుధన్‌రెడ్డి గారి వడివడి వేగంతో ధర్మారావుపేట చేరుకొన్నాం.

ధర్మారావుపేట. ఎవరీ ధర్మారావు అని చరిత్రలోకి తొంగిచూశా. ముస్లింపాలకుల నుండి వరంగల్‌ను విడిపించుటకు జరిగిన పోరులో హంవీర గజపతి, రేచర్ల సింగమ, లింగమ నాయకుల సైన్యాల ధాటికి, బహమని సేనలు తట్టుకోలేకపోయాయి. వరంగల్ హంవీర గజపతి వశమైనట్లు అతని క్రీ.శ 1461 నాటి వరంగల్ శాసనంలో ఉంది. ఆ తరువాత కొద్ది కాలానికే వరంగల్ రేచర్ల ముమ్మడిసర్వజ్ఞ సింగమ నాయకుని స్వాధీనమైంది. సింగమనాయకుని కుమారుడైన రావు ధర్మానాయకుడు, ఓరుగల్లు అధిపతి అయినట్లు అతని క్రీ.శ. 1464 నాటి శాయంపేట శాసనం వల్ల తెలుస్తుంది. ధర్మారావునాయకుడు వరంగల్ ప్రాంతపాలకునిగా ఉన్నప్పుడు, రామకృష్ణాపురమనే ఈ ఊరికి ధర్మారావుపేట అనే కొత్త పేరు వచ్చింది. ఈ ధర్మారావునాయకుడు నైనపాకలో ఒక సర్వతోభద్రాలయాన్ని కూడా కట్టించాడు. ఇదీ మీ ఊరుపేరు వెనక గల చరిత్ర అని, సుధన్‌రెడ్డి గారికీ, ఆ వూరి వారికీ చెప్పినప్పుడు వాళ్ల ముఖాల్లో కాంతులు విరజిమ్మాయి. సుధన్‌రెడ్డి గారింట్లో టీ తాగి, ఆలయాలను చూడటానికి వెళ్లాం.

ఊరు బయట రోడ్డు పక్కనే ఒక మొండి రెండంతస్తుల మండపం, పునాదుల వరకూ ఉన్న ప్రాకారం, లోపల స్థానికంగా త్రిలింగ త్రికూటాలయం, కొంచెం దూరంలో మరో రెండు గుళ్లూ కనిపించాయి. చూడంగానే కాకతీయ ఆలయాలనిపించాయి. ఆ మొండి మండపముందొక శాసనం కాకతీయ గణపతిదేవుణ్ణి సింహాసనం పైన ప్రతిష్టించిన రేచర్ల రుద్రిరెడ్డి మనిమనుమడు వీరపసాయితుని మంత్రి సోమయ వేయించిన శాసనం. తేదీ లేదు. క్రీ.శ 13వ శతాబ్ది చివరి సం॥ల నాటిది. సోమయ మంత్రి తన తండ్రి అప్పయపేర గ్రామంలో అప్పాంబుధి అనే చెరువును తవ్వించి, అప్పేశ్వరాలయాన్ని, తన తాత పేర ఈశ్వర మహాదేవునికి, మూడోది తన ప్రభువు వీరపసాయితుని పేర నిర్మించి, పడాల చెరువు కింద 6 నివర్తనాల భూమిని దానం చేసిన వివరాలున్నాయి. నివర్తనము, మరుతురు, పుట్టి, తూము ఆ

నాటి భూమి పరిమాణాన్ని తెలియజేస్తాయి.



శాసనాన్ని దాటి, పదిల పరచండి బాబూ అని వేడుకొంటున్న శిధిల శివాలయం, అదే అప్పేశ్వర, మహాదేవేశ్వర వీరపసాయితే శ్వర అనే త్రిలింగేశ్వరాలయాన్ని చూశాం. చుట్టూ కలియదిరిగి, ఆలయంలోకి ప్రవేశించాం. మూడు గర్భాలయాలు, అర్థ మండపాలు, మూడింటినీ కలుపుతున్న ఒక రంగమండపం, తూర్పు నుంచి ప్రవేశ-సోపాన మండపం, ద్వారాలు, స్థంభాలు, కప్పురాళ్లపైన ముచ్చటైన చక్కటి కాకతీయ శిల్పం, ఒకపక్క అందర్నీ ఆకట్టుకొంది, మరో పక్క నేలరాళ్లు తొలగిపోయి, స్థంభాలు కుంగిపోయి, దూలాలు వొంగిపోయి, కప్పురాళ్లు కదలిపోయి, గోడరాళ్లు ఊడిపోయి, అరుగులు వొంగిపోయి, పైన గడ్డిమొలిచిపోయి హృదయవిదారక దృశ్యమైంది.



ఆలయ వాస్తుశిల్ప విశేషాల్ని నేను విడమరచి విశ్లేషిస్తున్నపుడు. గ్రామస్తులు, విస్తుపోయి, మళ్లీ మా గుడికి ఆ మంచి రోజులెప్పుడొస్తాయి సారూ అని అడిగినప్పుడు- నేను సమాధానాన్ని వెతుకుతున్నా. శిధిలాలను పదిలపరచి, అర్చనలూ, ఉత్సవాలూ మునుపటిలా జరుగుతాయా సారూ అని పూజారి అడిగినప్పుడు- అందుకోసమే ఈ ప్రయత్నాలన్నీ అని తప్పుకున్నా.

అక్కణ్ణుంచి బయటికొచ్చి చూస్తే, ఆలయం అధిష్ఠానం వరకూ, భూమి సాగులో ఉంది. రైతులు పత్తిచేనుకు మందులు కొడుతున్నారు. ఆలయాన్ని కేంద్రపురావస్తు శాఖ తమ జాబితాలోకి తీసుకోవాలంటే, ఆక్రమాలను తొలగించాలని సుధనరెడ్డిగారితో రైతుల చెవిని బడకుండా, మెల్లగా నసిగాను. ముందుకెళ్లగానే మరో మొండి గుడి మండపం కనిపించింది. దాని ముందు రైతులు మొక్కజొన్న కంకులు ఎండబెట్టుకొంటున్నారు. మాతోపాటే ఉన్న ఆ రైతు, మీరు గుడి బాగుచేస్తే, నేను వ్యవసాయం మానేసి భూమిని గుడికి అప్పజెబుతాను సారూ అని చెప్పాడు. భూదాహం లేని ఆ రైతుకు నమస్కరించి, ఆ గుడి 600 సంוו ల నాటిదని చెప్పి, కాపాడుకోవటానికి సహకరిస్తున్నందుకు సంతోషంగా ఉందని ముందుకు సాగాను. నాతో పాటే సుధన్‌రెడ్డి గారు, మల్లూనాయక్, గ్రామస్తులు నడుచుకొంటూ మరో ఆలయం దగ్గరకెళ్లాం. అది మైసమ్మ (మహిషమ్మ- మహిషాసుర మర్దని) గుడి. కప్పులేని పుట్టలు పెరిగిన గర్భాలయంలో ఒక పీఠం పైన శూలంతో మహిషానురుణ్ణి మర్దిస్తూ కనిపించింది. రైతులు నిత్యమూ చల్లే పసుపు, కుంకుమలతో వెలిగిపోతుంది. నీ గుడిని బాగు చేయటానికి దీవెనలనందించవమ్మా అని వేడుకొని బయటకొచ్చాను. ఒక్కొక్క గుడినీ చూస్తుంటే, చిన్నప్పుడు నేను చదువుకొన్న ప్రతి బడీ గుర్తుకొస్తుంది. కాకతీయ శిల్పుల పనితనం ముందు, వరస తప్పిన



వారసత్వం ఓడిపోయిందనిపించింది. నడుస్తూ, నడుస్తూ త్రిలింగేశ్వరాలయం దగ్గరకొచ్చాం. గుడిగోడల వెంట బారులు తీర్చిన సైకిళ్లను పక్కన పార్కు చేయండని రైతుల్ని బ్రతిమిలాడాను.

తల్లిదండ్రులు, ప్రభువుకు గౌరవాన్నిచ్చి, ఆలయాలను అపురూపంగా తీర్చిదిద్ది సాగునీటికీ, తాగునీటికీ చెరువును తవ్వించి సమాజహితాన్ని కోరుకొన్న సోమయ మంత్రికి నమస్కరించి ఆలయ ప్రాంగణం నుంచి బయటికొచ్చానేగాని, ఒకప్పుడు వైభవోపేతంగా వెలుగొందిన ఆలయాల్లో చీకట్లు రాజ్యాలేలుతున్నాయన్న బాధ నుంచి బయటకి రాలేకపోయాను. ఏమో... కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిగారు ఏదైనా చేయకపోతాడా అన్న చిన్న ఆశ నన్ను ఊరడించింది. ఇంతలో

మాతృభాషల్ని అణచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి. అభివృద్ధి నిరోధకమైనవి కూడ. అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు. -ఒక సామాజిక ఉద్యమనేత

ఒకరు, సారూ మా వూరి కోట, రాతి బావి చూడండి అంటూ తీసుకెళ్లారు. ఒక చిన్నపాటి కోట ఆనవాళ్లు, అందులో ఒక దిగుడుబావి, గత కాలపు చరిత్రకు చెరగని ముద్రల్లా భద్రంగా ఉన్నాయి. నలుగురు రైతులు ఆ స్థలంలో ఇళ్లు గట్టుకొని ఉంటున్నారు. ఇప్పుడు వాళ్లని ఖాళీ చేయమని ఎలా అంటాం?

అక్కణ్ణించి సుధనరెడ్డిగారు వాళ్లింట్లో ఏర్పాటు చేసిన అన్నంతిని, సర్వపిండి, చక్కినాలు బొక్కి, పెరట్లో మునగచెట్టు కాయలు కొన్ని కోసుకొని ఇక బయల్దేరదామా అని అడిగేలోపే, మల్లూనాయక్, సారూ, మా అశోక్‌నగర్‌కు రాకుండా పాకాల చెరువు చూడకుండా వెళ్తారా? అన్న ప్రశ్న నన్ను ఆ వూరుకు మళ్లించింది. కారు కదిలింది.

పచ్చటి పొలాలు, విస్తృతంగా పెరిగిన చెట్లూ తలూపుతూ పోయేకొద్దీ వీడుకోలు, స్వాగతం పలుకుతున్న తీరు మనసంతా ఉల్లాసాన్ని నింపింది. ఇంతలో రానే వచ్చింది పాకాల చెరువు. కట్ట మీదకెళ్లి చుట్టూ కొండల దండ, సముద్రాన్ని తలపించే జాలాశయం, పంటపొలాలకు నేనున్నానంటున్నతూము, దాని నుండి జలువారుతున్న నీరు, ఎక్కణ్ణించో వచ్చి గబాలున వాలుతున్న కొంగలు, ఎగిరిపడుతున్న వాటి నోటిన పడకుండా తప్పించుకొంటున్న చేప పిల్లలు, వరస వరసగా మురిసిపోతూ కదులుతున్న అలలు, నన్ను మరోలోకంలోకి తీసుకెళ్లాయి. సార్ ఇటు చూడండి. పాకాల శాసనం అన్న మల్లూనాయక్ పిలుపుతో, మళ్లీ ఈ లోకంలోకొచ్చాను. ఎంత పెద్ద శాసనం. కాకతీయ గణపతి దేవుని మంత్రి బయ్యనాయకుని కుమారుడైన జగదాల ముమ్మడి వేయించిన శాసనం. తేదీలేని, పేరు పేర్కొనని కవి చక్రవర్తి పొందించిన 234 పంక్తుల శాసనం. 230 సంస్కృత పంక్తులు, 4 తెలుగు పంక్తులున్న శాసనం, మౌద్గల్య తీర్థంగా పేరుగాంచిన ఈ స్థావరంలో, రాజగజకేసరి గణపతి దేవుని పేర గణపురం, శివ రామనాథాలయాన్ని నిర్మించి, చెరువును తవ్వించిన వివరాలతో పాటు, కాకతీయ వంశ చరిత్ర, తరువాత పాకాల చెరువు పరిసరాలను, గణపతిదేవుని శౌర్య ప్రతాపాలను వివరిస్తున్న శాసనం. అంతా బాగానే ఉంది కానీ, పొగడ్తలు మితిమీరాయనిపిస్తుంది. ఎందుకంటే గణపతి దేవుడు 'కాశీనాథః కలింగః శకధారణీపతి రాః కురుపత్తి రవి మర్దాణీపో మాంగదేశః నేపాళశ్చేళ పృద్వీ పతిరితి వినితా నీగ్రతో రాజవీర్గా' అని కాశీ, కళింగ, శక, మాళవ, కేరళ, హూణ, కురు, మగధ, చోళ, నేపాళ రాజుల నుంచి కప్పాలు స్వీకరించాడని చెప్పడం అతిశయమేకాని, నిజం కాదు. ఏది ఏమైనా ఇంతటి బృహత్తటాకాన్ని అందించిన జగదాల ముమ్మడిని



మనం ముమ్మాటికి స్మరించాలి.

శాసన పఠనంలో లీనమైన నాకు మల్లూనాయక్ పిలుపు మళ్లీ ప్రయాణానికి సిద్ధం కమ్మంది. కారెక్కి పదినిముషాల్లోపు అశోక్‌నగర్ చేరుకొన్నాం. ముందుగా కందకాన్ని దాటి కోటకు చేరుకొని, రాతి కోటపై గల మట్టికోట, కందకం పై నుంచి కోటలోకి రావటానికి గల వంతెన ఆనవాళ్లు మమ్మల్ని ఆకట్టుకొన్నాయి. ఒక కాకతీయ స్థంభం విరిగిపోయి కనిపించింది.

కొంచెం దూరం పోయాక గుబురులా పెరిగిన చెట్లు, పొదలు, తీగల మాటున చాటుగా ఒక శిథిల దేవాలయం, తెరిపి చేసుకొని లోపలికెళ్లే లోపు ఆ వూరి సర్పంచి, ఆమెతో పాటు మరో కొంతమంది. వార్డు మెంబరు వచ్చారు. వారికి ఈ ఆలయ చరిత్రను చెప్పి పదిలపరచాలని నచ్చచెప్పాను. తరువాత పంచాయితీ ఆఫీసులో కాఫీ



తాగించి, బస్టాండ్‌లో బుద్ధ విగ్రహం ఉంది రండి అని తీసుకెళ్లారు. తీరా చూస్తే అది ధ్యాన ముద్రలో నున్న పార్శ్వనాధ జైన తీర్థంకరునిది. క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందిన దీన్నీ కాపాడుకోవాలని చెప్పి శెలవు



తీసుకొన్నాను. శిధిలాలను పదిలపరచలేమా అన్న ఆలోచనలతో బరువెక్కిన హృదయాలతో అందరం కారెక్కి తిరుగుపయనమయ్యాం. మధ్యలో మల్లూ నాయక్ వరంగల్‌లో జారుకొన్నాడు. మేం హైదరాబాదు చేరుకొన్నాం. చేరుకొన్నానే కానీ, కాకతీయ కళాఖండాలు శిధిలాలై చిందరవందరగా ఉన్నాయే, వాటిని బాగుచేయటం ఎలా అన్న ప్రశ్న నన్ను ఇప్పటికీ వేధిస్తూనే ఉంది.

సుంకర గోపాలయ్య
9492638547

# కథా'సృష్టిలో' రావిశాస్త్రి

***రచయిత ప్రతివారూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కల్గిస్తుందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తోందో ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకి సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను. - రావిశాస్త్రి***

ఈ నేల మీద కథలకేం తక్కువ లేదు. కావ్యాల్లో, పురాణాల్లో కథలు వినిపిస్తూ ఉంటాయి. పలకరిస్తూ ఉంటాయి. ఏ మాధ్యమం లేని కాలంలో మనుషులు ఒకరికొకరు కథలు చెప్పుకున్నారు. అతీతశక్తుల్ని చొప్పించి తమ ఊహల ద్వారా ఏడేడు సముద్రాలు దాటారు. ఆకాశాన్ని తాకారు. జంతువుల చేత మాట్లాడించారు.

ఆధునిక కాలంలో కథ సామాజిక అనుభవంగా మారింది. సమాజాన్ని చిత్రీకరించింది. వాస్తవాలను ప్రస్తావించింది. కథలు రాసే రచయితల వ్యూహాలు మారాయి. నిర్మాణం బలంగా చేశారు. అదిగో అలాంటి బలమైన నిర్మాణాన్ని, కథన రీతిలో ఒక వేగాన్ని తెచ్చినవారిలో రావిశాస్త్రి ఒకరు. తెలుగు కథను అంతర్జాతీయ స్థాయికి చేర్చిన కథకుడు రావిశాస్త్రి.

రావిశాస్త్రి ఎదురుగా మనుషుల సమూహాన్ని కూర్చోబెట్టుకుని మాట్లాడుతున్నట్టే కథ చెబుతాడు. పాఠకుడు సులువుగా లీనం అయిపోతాడు. పాత్రలు ప్రత్యక్షమైనట్టే ఉంటుంది. ప్రవాహంగా సాగిపోతుంది. ఏ చిన్న దృశ్యాన్ని కూడా రావిశాస్త్రి నిర్లక్ష్యం చేయడు. బొమ్మలు కనిపిస్తాయి. బింబాలు కంటిముందు నిలుస్తాయి. ఉపమానాల తోరణం కడతాడు. వ్యంగ్యానికి వైభవం తెచ్చిన కథకుల్లో రావిశాస్త్రి ఒకరు.

ఈ వర్గసమాజంలోని దోపిడిని, పీడనను న్యాయ ప్రక్రియలోని వైరుధ్యాలను కలమెత్తి చూపిన రచయిత. ఆయన మొదటి కథ 'దేవుడే చేశాడు'. ఇది 1938లో వినోదినిలో అచ్చయింది. చివరి రచన 1993లో రాసిన 'ఇల్లు'. రావిశాస్త్రి బడుగుల రచయిత. బలహీనుల స్వరం. పీడితుల పక్షం వహించిన ఆయన రచనల్లో రాజ్యం స్వరూప స్వభావాలు కన్పిస్తాయి. మార్క్సిజం అందించిన సూత్రాలతో జీవితాన్ని, సమాజాన్ని ఆకళింపు చేసుకున్న రావిశాస్త్రి, వాటికి తన సాహిత్యంలో సాక్ష్యాలు ఇచ్చారు.

స్వాతంత్ర్యం పొందిన తరువాత, ఈ నేలలోని సామాజిక పరిణామాలను గొప్ప మెలకువతో గమనించారు. గమనించి ఊరుకోలేదు. అప్పుడు ఆయన చూసిన ప్రపంచమే ఇప్పుడు ఉంది. మోసం అలానే ఉంది. అన్యాయం అలానే ఉంది. కానీ సాంకేతికత తోడైంది.

*'ఏకకాలంలో అనేక రసాలను ఉప్పొంగింపచేసే రచనలే కళాఖండాలని, అటువంటి రసానుభూతినే తాను రసన అంటానని, రావిశాస్త్రి రచనలు రసనను సమృద్ధిగా ఆవిష్కరించగలుగుతాయి'* అని శ్రీశ్రీ అంటారు.



కథ మొదటి లైను మొదలుపెట్టిన దగ్గర నుంచి ముంగిపు లైను వరకూ అలా తీసుకుని వెళ్ళిపోతుంది. ఒకవేళ అలాంటి ప్రయాణం జరగలేదా అంటే అది పాఠకుడి తప్పేగాని రావిశాస్త్రి పొరపాటు కాదు.

'అనహాయంగా జాలిగా కుంగిపోతాయి. అదృష్టం బావుండకపోతే ఉత్తరించుకుపోతాయి. ఇంపుగా పలుకుతాయి. శ్రావ్యంగా పాడతాయి. సొంపుగా కల్లలాడతాయి. పూలమాలల్తో కావలించుకుపోతాయి. ముత్యాల హారాల్తో ముడివేసుకుపోతాయి. పచ్చటి పుస్తెల తాళ్ళతో బంధించుకుపోతాయి.

చిత్రమైన పనులు చాలా చేస్తాయి మానవకంఠాలు' (కలకంఠి)

ఇలా ఆ వాక్యాల వెంట కళ్ళు, పెదాలు పరుగులు తీస్తాయి. అక్కడక్కడ కళ్ళు భావాలు మారుస్తాయి. పెదాలు విచ్చుకుంటాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. హృదయం అనుభవిస్తుంది. పలవరిస్తుంది. పులకరిస్తుంది. భయపడుతుంది. బాధపడుతుంది. కళ్ళు కాసేపు ఎర్రబడతాయి. ఇవన్నీ క్షణాల్లో జరిగిపోయే రసాయనిక, భౌతిక చర్యలు.

'వెన్నెల చల్లగా ఉంది. తుమ్మలు దొంగల్లా వున్నాయి. రాళ్ళు బండగా ఉన్నాయి. దొంగ గెడ్డలో ఇసుక మెత్తగా ఉంది. వల్లకాడు శవరహితంగా, ముండమోపిలా ఉంది. చేలు పచ్చగా ఉన్నాయి. తరువాత అంటాడు కదా భోంచేసి పడుకున్న బ్రాహ్మల కడుపులు అరుగుతూ ఉన్నాయి. శెట్టిగారి ఇల్లు ఊరికి మధ్యగా పెట్టెలా ఉంది. (సృష్టిలో)

రావిశాస్త్రి ఎలా చూశాడు ఇవన్నీ, ఎంత పరిశీలన ఉండాలి. 'సృష్టిలో' అనే పేరు పెట్టడంలోనే... ఈ కథలో ఆయన ఏమైన చెప్పొచ్చు. అందుకే ఒక్కో లైనులో ఒక్కో చిత్రం చూపాడు.

రావిశాస్త్రి శైలికి ఇదొక ఉదాహరణ మాత్రమే. ఆయనకు ఏ కథకు ఏం భాష కావాలో తెలుసు. ఏ పదం వాడాలో తెలుసు. చిత్రకారుడికి ఏ రంగు వేస్తే చిత్రం ఆకట్టుకుంటుందో... అలాగా రావిశాస్త్రికి ఆ వడి తెలుసు. ప్రవాహగతి తెలుసు. కథ ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో ఎరుకలో ఉండే రాశాడు.

'సృష్టిలో' అనే కథలో కోళ్ళగూడు క్రింద కూర్చున్న ఒంటి కోడిపెట్ట

జీవితాన్ని అద్దం పెట్టుకుని, ఆయన చేసిన ఆలోచనలు తమాషాగా వుంటూనే ఆలోచింప జేస్తాయి.

'కోడిపెట్ట వేదం వినలేదు. కురాన్ చదవలేదు. బైబిల్ చూడలేదు. అది ఎమ్మే చదవలేదు. దానికి స్పష్టంగా ప్రశ్నలు వేసుకోవడం కూడా (పాపం!) సరిగా రాదు. కానీ ఆ సమయంలో ఆ గూడు కింద అది, గుడిలో నిరాకారుడయిన దేవుడు ముందు రెక్కలొచ్చిన కొశ్చన్ మార్కు ధిక్కరించి కూర్చున్నట్టు కూర్చుంది(సృష్టిలో).

వేరేచోట ఆయన చూసిన కాదు అక్షరాల్లో గీచిన బొమ్మని చూడండి 'పక్షిలోంచి పాము పుట్టినట్టు దాని మెడ దాని రెక్కల మధ్య నుంచి లేచి సాగి నిలబడింది'

'వర్షం' కథలో వర్షం దబాయించి కురుస్తూ వుంటుంది. తాత, పురుషోత్తంని ఏవో వివరాలు అడుగుతూ వుంటాడు. ఆ సందర్భంలో 'పురుషోత్తం' ఎట్లా వుంటాడో ఆ పాత్ర తాలూకు రూపాన్ని రావిశాస్త్రి ఎలా మనముందుంచుతాడో చూడండి.

"అతన్ని బాగా చూడాలీ అంటే దీపం వెలిగించి చూడాలి. అతను చక్కనివాడా ? ఒప్పుకునేవాళ్ళు తక్కువ. అతని నడుం మాత్రం చక్కగా సన్నగా ఉంటుంది. అతను సింహమధ్యముడే కాని సింహంలా ఉండడు. అతని పదిహేనో యేట 'ఇరవయ్యేళ్ళుండవా' అని చాలామంది అనుకొనేవారు. దుకాణం తాతని ఆ సమయంలో అడిగితే 'నల్భై దగ్గిరుండవా' అని అడగ్గలడు. పురుషోత్తం పాతిక సంవత్సరాల క్రితం పుట్టాడన్న సంగతి ఆ పుట్టుక తెలిసినవాళ్ళకి తప్ప మరొకరికి తెలియదు. అతను ఎదగని పడ్డలా వుండిపోయేడు". అంత వర్షంలోను ఈ పాత్రని అతని వయస్సుని రచయిత తమాషాగా ఏం చెప్పలేదు. చెప్పాలి గనుకనే చెప్పాలి. ఈ కథలో 'పురుషోత్తం' ని చైతన్యపరిచే పాత్ర 'పోతురాజు'. పాత్రలకు పేరు పెట్టడం కూడా మామూలు సంగతి కాదు. పురుషోత్తానికి సొంత ఆలోచనలు ఉండవు. నీటిలోకి దిగడు. దీపం లేకుండా నడవడు. సందులెంట తిరగడు. తను పని తాను చేసుకునే పురుషోత్తముడు మాత్రమే. 'వర్షం'లో కూడా తడిస్తే ఏమౌతుందోనని భయం.

కానీ పోతురాజు ఎలా ఉన్నాడు-

'ఆరని నిప్పుతునకలా, నీటి మీద బోటులా, చెట్లని చీల్చుకొని బాట వేసుకొని వస్తున్నట్టుగా ఓ కుర్రవాడు భుజాన మూట వేసుకొని పరిగెట్టుకొని కొట్కొస్తున్నాడు' వాడి వయస్సు పన్నెండేళ్ళు. రేచు క్కులాగా ఉన్నాడు. పొయ్యి విసురుతూ ఇనుంలా ఎర్రగా మెరుస్తున్నాడు. వర్షాన్ని 'సంపిడిసిపెడతా' నంటున్నాడు. అలాంటి వాడ్ని చూసికదా పురుషోత్తం సాక్షాత్కారం పొందాడు."

అందువలన 'రావిశాస్త్రి'కి పాత్రలను ఎలా చూపాలో తెలుసు. పేరు పెట్టడం దగ్గర నుంచి ప్రవర్తనల వరకు రావిశాస్త్రికి తెలుసు. అందుకే ఆయన కథల్లో పాత్రలు అంతగా ఆవిష్కారం అవుతాయి. వీళ్ళందరినీ ఆయన ఎక్కడో చూసి ఉంటాడు. మాట్లాడి వుంటాడు. దూరంగానో దగ్గరగానో వీరితో గడిపి వుంటాడు.

మామిడిచెట్టు కథలో నీలమణి, కార్నర్ సీటులో రాజు, పచ్చకోటువాడు, పువ్వులులో కమలబాల, కలకంఠిలో సూర్యనారాయణ, కమల, సబ్బుబిళ్ళలో లక్ష్మీపతి, చిన్నపాప శశికళ, మోసం కథలో రాకెట్ అప్పారావు, మాయ కథలో ముత్తేలమ్మ...ఇలా ప్రతీ పాత్రను ఆయన కలిసే ఉంటాడు. పాత్రను ఎలా డీల్ చెయ్యాలో బాగా ఎరిగిన కథకుడు రావిశాస్త్రి. అయితే ముందుగా శిల్పం, శైలి, పాత్ర నిర్మాణం ఇవన్నీ లెక్కలేసుకుని రావిశాస్త్రి రాసి ఉంటాడా! ఆయన మహా చెడ్డ గొప్పగా రాశాక మనం వేసుకున్నాం.

ఆయన కథలో కవిత్వాంశ కనిపిస్తుంది. గొప్ప కళాత్మికత చూడవచ్చు. రాజ్యహింసను గుర్తించాడు. పెట్టుబడిదార్ల పెడత్రోవలను నిరసిస్తాడు. డబ్బు, అధికారం వున్నవాళ్ళ చేతుల్లో రాజనీతి చిక్కుకోవడం గురించి ఆలోచింపజేస్తాడు.

కథకి ప్రారంభం ఎంత ముఖ్యమో, ముగింపు కూడా అంత ప్రాణం. ఈ ముగింపు నుండి కథ పాఠకుడి ఆలోచనల్లోకి వెళ్ళాలి. దిగ్భ్రాంతి చెందాలి. మేలుకోవాలి. పాఠకుడు రససిద్ధి పొందాలి. ఓ నిచ్చెన ఎక్కి పైకి చేరుకున్నట్టు అనుభూతి చెందాలి.

పిపీలికం కథలో 'చీమలు' కష్టజీవులకు 'ప్రతీక'ని మనకు తెలుసు. పాము 'శ్రమ దోపిడి' చేసేవారికి ప్రతీక. రావిశాస్త్రి కష్టజీవుల పక్షాన నిలబడే రచయిత. వారిని గెలిపించాలి కదా ! అందుకే ముగింపు వాక్యాలు ఇలా ఉంటాయి.

'ఒరే ! రాక్షసాధముడా ! మేం కష్టజీవులం కావచ్చు. నువ్వు సుఖభోగివే కావచ్చు. కాని నువ్వు మా కష్టాన్ని అపహరించి మాకు అన్యాయం చేయడం సహించం. మేం తిరగబడతాం ! నువ్వు చెప్పిన న్యాయం భగవన్యాయమైనా సరే అది అన్యాయం కాబట్టి దాన్ని మేం మారుస్తాం ! అందుగురించి మేం తిరగబడతాం. మీమీద మేం తిరగబడి తీరుతాం'. అని చెప్పిందట మన చీమ రాక్షసాకారానికి.

ఆ తరువాత రాక్షసాకారం వెటకారంగా నవ్వడం, కోపంగా బుస కొట్టడం జరుగుతుంది. చీమ నాయకుడు చిరునవ్వు నవ్వి అందర్ని కూడగట్టి రంగంలోకి దిగుతాడు.

ఇప్పుడు రచయిత ఎంత కసిగా చివరి వాక్యాలు రాశాడో గమనిద్దాం.

'శ్యామవనంలో మర్రిచెట్టు కింద ఆ దినం ఓ రాక్షసాకారం విలవిల తన్నుకొని నెత్తురు కక్కుకొని చచ్చిందట; ఆ మేరకి ఆమూలంగా భూభారం కొంత తగ్గిందట.'

ఇక్కడ రచయిత ఎంత ఊరట చెందాడో, పాఠకుడు కూడా అంతే పొందుతాడు.

రావిశాస్త్రి కథకుడు మనం నిర్ణయించుకున్న అన్ని ప్రమాణాలకు సరిపోతాడు. శైలి, శిల్పం, పాత్ర చిత్రణ, ఇతివృత్తం ఇలా ఎలా చూసినా ఆయన తూగుతాడు. భాషాపరంగా తన ప్రాంత మాండలికాన్ని, నుడికారాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. కథల్లో వాడిన ఉపమానాలన్నీ నిత్యజీవితం నుండి తీసుకున్నారు. కనబడని వర్ణనలు చేయలేదు.

మోసపోతున్న సామాన్య ప్రజల్ని జ్ఞానవంతుల్ని చేయడం, వారిలో భయాన్ని తొలగించడం రచయితల కర్తవ్యంగా భావించారు. అందుకోసమే రాశారు. శ్రీశ్రీ రావిశాస్త్రి గురించి చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు.

'శతాబ్దాల కిందట ఒక రావి గౌతముణ్ణి ప్రభావితం చేసింది. ఈ శతాబ్దంలో ఒక రావి తెలుగువారిని ప్రభావితం చేసి ప్రబుద్ధుల్ని చేస్తుంది.'

---

రచయిత- డా॥ సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధిపతి,
డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం

టి.వి.రామకృష్ణ
99514 41131

# బాలసాహిత్యంలో కథల పాత్ర

**క**ళలు విద్యలో ఒక భాగం. ఆటలు, పాటలు, కథలు, నాటికలు, చేతిపనులు, చిత్రలేఖనం ఇవన్నీ కళలే...! విద్యలో భాగాలే. అయితే దురదృష్టవశాత్తు నేటి మన విద్యావిధానంలో ఇవన్నీ కరువైనాయి. ఇక ఇంటివాతావరణం గమనించినట్లైతే, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ నుంచి, వ్యక్తిగత కుటుంబ వ్యవస్థగా మారిపోయాయి. పాతతరంలో ఇంటిపెద్దలు కొంత సమయం పిల్లలతో గడిపే అవకాశం ఉండేది. పిల్లలకు కథలు, కబుర్లు చెప్పే అవకాశం ఉండేది. ఇప్పుడు ఈ నాగరిక ప్రపంచంలో ఇలాంటి వాతావరణం అసలు లేకుండా పోయింది. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ నిర్వాహకులు పిల్లలకు కథల ప్రాధాన్యత, వాటి అవసరం గూర్చి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

శాస్త్రీయపరంగా కథల అవసరాన్ని మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మానవులను "హోమో నర్రాటస్" అని పిలుస్తారు. అంటే మానవుడు కథా జంతువు లేదా కథలు చెప్పేందుకు, వినేందుకు అనుకూలమైనవాడు. "హోమోనరన్స్" అనే అంశాన్ని (కథలు చెప్పే మానవుడు) జర్మన్ జానపద కథా రచయిత కర్ట్ రాంకే (1908-1985) మొట్టమొదటిగా ప్రతిపాదించాడు. "కథలు చెప్పడం అనేది మానవుల ప్రాథమిక అవసరం" అని తన పరిశోధనా పత్రంలో వెల్లడించాడు. అలాగే హెన్నింగ్ మాంకెల్ తన "ది ఆర్ట్ ఆఫ్ లిసనింగ్" రచనలో వినడం అనే ప్రక్రియ మానవుడి జీవితంలో అత్యంత ప్రధానమైన అంశం అంటాడు.

మానవ పరిణామక్రమాన్ని ఒకసారి పరిశీలిస్తే, మనకు ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఆదిమమానవుడు మొదట్లో తన భావాలను వ్యక్తపరచడానికి సంజ్ఞలు, హావ భావాలను ఉపయోగించుకున్నాడు. ఇలా తన భావాలను వ్యక్తపరచడం ఎంత కష్టమైన విషయమో అర్థం చేసుకున్నాడు. మాట, పలుకు చాలా అవసరమైన సాధనమని గుర్తించాడు. తాను వ్యక్తపరచే, పలుకులతో భాషను రూపకల్పన చేసుకున్నాడు. ఈ అద్భుతమైన ప్రక్రియ అవసరాన్ని గుర్తించి తన భాషను రూపొందించుకున్నాడు. తన అనుభవాలు, అనుభూతులు, ఆవేశాలు, దుఃఖాలు, భావాలను భాష ద్వారా వ్యక్తపరచడంలో ఉండే ఆనందాన్ని గ్రహించాడు. అప్పటి నుండి ఒకరి నుంచి ఒకరికి చాలా సులభంగా సమాచార మార్పిడి జరిగింది. అక్కడ నుండే కథారూపం మొదలైంది. ఒక విషయాన్ని కథన రూపంలో చెప్పినప్పుడు ఉండే ఆనందాన్ని తెలుసుకున్నాడు. ఏదైనా ఒక విషయాన్ని చెప్పాలంటే కథన రూపంలో చెప్పడమే సరైన పద్ధతి అనే విషయం కొన్ని వందల, వేల ఏళ్ల నాడే తెలుసుకున్నాడు.

సంచార జీవనం నుంచి, స్థిర నివాసాలు ఏర్పరచుకొనే సమయంలో భాష ఆవశ్యకత మరీ పెరిగింది. ఒక్కొక్క ప్రాంతంలో నివసించే వారు ఒక్కొక్క మౌఖిక భాషను అలవరచుకొని తమ సొంతం చేసుకున్నారు. లిపి లేకుండానే తమ స్వంత భాషతో తమ మనుగడ కొనసాగించారు. ఇప్పటికీ అనేక జాతులవారు లిపి లేకుండా తమ జీవనం గడుపుతున్నారు. ఇక్కడ మౌఖిక భాషే వాళ్ళ జీవనానికి, మనుగడకు ప్రధానమైన అంశం అయ్యింది. వాళ్ళ భావాలు, అనుభవాలు, అనుభూతులు, విజ్ఞానం మౌఖిక రూపంలోనూ, కథన రూపంలోనూ వ్యక్తపరచడం వాళ్లకు ప్రధాన అంశం అయ్యింది. వాటిని తరువాతి తరాలకు అందించాలనే తపనతో ఏర్పడ్డదే లిపి.

మనదేశంలో మౌఖిక భాషకు, కథా కథన రూపాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు మనకు కనబడుతుంది. మౌఖికంగా ప్రచారమైన అనేక కథా, కథన రూపాలు కొన్ని వందల తరాల నుంచి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ కథలు, కథనాలను వ్యక్తపరచడానికి అనేక కళారూపాలను ఎంచుకున్నారు. పద్య కావ్యాలు, గేయాలు, సంగీతం, నాట్యం, నాటకం, హరికథ, బుర్రకథ లాంటి కళారూపాల ద్వారా తమ కథా, కథనాలను ఒకతరం నుంచి ఇంకొక తరానికి అందించారు.

ఇటీవలి కాలంలో మెదడు పనితీరు మీద అనేక శోధనలు జరిగాయి. ముఖ్యంగా మెదడు పై కథల ప్రభావం అనే అంశం మీద అనేక పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనలలో మన మెదడు మన అనుభవాలను, ఆలోచనలను, జ్ఞానాన్ని కథల రూపంలో నిక్షిప్తం చేసుకుంటాయనే విషయం రుజువయ్యింది. ఇంకొక పరిశోధనలో పుస్తకాలు (ఇక్కడ పుస్తకాలు అంటే పాఠ్య పుస్తకాలు కాదు) చదవడంవల్ల దెబ్బ శాతం వత్తిడి తగ్గుతుందని తేలింది. ఇంకొక అధ్యయనంలో పుస్తకాలు చదవడం వల్ల మెదడు చురుకుగా ఉంటుందని తేలింది.

కథలు భాషను పట్టించడంలో ఎంతో సహాయపడతాయి. అందులో ఎటువంటి సందేహం లేదు. **పిల్లలు వినటం అనే ప్రక్రియ తల్లి గర్భం నుంచే ప్రారంభం అవుతుంది. ఇది శాస్త్రీయంగా రుజువైన అంశం. మన పురాణ గాథల్లో ఇటువంటి కథాంశం ఒకటి ఉంది.** మహాభారతంలో అభిమన్యుడు యుద్ధ తంత్రాన్ని తల్లి గర్భం నుంచే వింటాడు. అయితే పద్మవ్యూహంలో లోపలికి ప్రవేశించే వ్యూహాన్ని మాత్రమే వింటాడు. యుద్ధంలో పద్మవ్యూహాన్ని ఛేదిస్తాడు గాని, వెలుపలికి వచ్చే వ్యూహం తెలియకపోవడం వల్ల ఆ యుద్ధంలో మరణిస్తాడు. ఇది ఒక పౌరాణిక గాథ. అయితే ఇటీవల పరిశోధనలలో ఈ విషయం రుజువయ్యింది. బయటి ప్రపంచానికి రాకముందే పసిపిల్లలు తల్లిగొంతును, ఇతర శబ్దాలను, సంగీతాన్ని గుర్తిస్తారు. పద్దెనిమిది - ఇరవై నాలుగు వారాల వయసులోనే పిల్లలు వినికిడి శక్తిని కలిగి ఉంటారు. ఒక పరిశోధనలో ప్రసవానికి ఆరు వారాల ముందు తల్లి చేత కొన్ని పాటలను, కథలను పెద్దగా చదివించారు. బిడ్డ పుట్టిన మూడు రోజుల తరువాత అవే పాటలను, కథలను తల్లి చేత చెప్పించారు. అవి విన్నప్పుడు ఆ బిడ్డ ఎక్కువగా స్పందించడం పరిశోధకులు గమనించారు. కాబట్టి తల్లి గర్భం నుండే వినడం నేర్చుకుంటాడని ధృవపడింది.

ఇక్కడ మాతృభాష గురించి కూడా కొంత చర్చించుకోవాలి. బిడ్డ పుట్టక మునుపు, బిడ్డ పుట్టిన తరువాత కూడా మాతృభాష ప్రధాన

పాత్ర పోషిస్తుందని మనం తెలుసుకోవాలి. పిల్లలతో ఎక్కువగా సంభాషించటం వల్ల భాష నేర్చుకోవడం చాలా తేలిక అవుతుందని పరిశోధనలు తెలుపుతున్నాయి. పిల్లవాడికి ఆరు సంవత్సరాలు వచ్చేసరికి ఇంచుమించు 2,500 పదాలను గుర్తించగలడు. అలాగే నాలుగు నెలల వయసు వచ్చేనాటికి పుస్తకంలోని బొమ్మలను గుర్తించడానికి ప్రయత్నిస్తాడు. పుస్తకము, బొమ్మ ఒకటి కాదని గుర్తిస్తాడు. ఆరు నెలల వయసు వచ్చేనాటికి బొమ్మల పుస్తకాలను చూడటానికి ఇష్టపడతాడు. ఎనిమిది నుండి పది నెలల వయసులో కథలు చదివి వినిపించమని అడిగే స్థాయిలో ఉంటాడు. పద్నాలుగు నుండి పద్దెనిమిది నెలల వయసులో కథలు వినే స్థాయిలో ఉంటాడు. పంతొమ్మిది నెలల నుండి ముప్పై నెలల వయసులో కథలు వినటానికి అమితంగా ఇష్ట పడతాడు. రెండు సంవత్సరాల వయసులో పుస్తకాలలోని బొమ్మలను చూసి వాటి భావాలను గ్రహించగలుగుతాడు. మూడేళ్ళ వయసులో పుస్తకాలతో పాటు అక్షరాలూ కథలు చెబుతాయని తెలుసుకుంటాడు. అంతేకాదు ఈ వయసులో పుస్తకంలో బొమ్మలకు తను స్వంతంగా పేర్లు పెట్టుకొని కథలు అల్లడానికి ప్రయత్నిస్తాడు. 'ప్రీ స్కూల్' నాటికి కథలను వినే స్థాయిలోనూ, ప్రశ్నలు వేసే స్థాయిలో ఉంటాడు. నాలుగవ సంవత్సరం నుండి అక్షరాలను గుర్తుపట్టడం, చిన్న చిన్న పదాలను పలకటం నేర్చుంటాడు.

ఇంత ఉపోద్ఘాతం ఎందుకు చెప్పవలసివచ్చిందంటే, **మానవుడి మనుగడ, విజ్ఞానం అంతా కథా, కథన రూపంలోనే కొనసాగింది. ఇక్కడ ఇంకొక అంశం కూడా మనం గమనించవలసిన అవసరం ఉంది. కథా, కథనం ఆసక్తికరంగా ఉంటేనే శ్రోత ఆ కథనాన్ని శ్రద్ధగా వినడానికి ప్రయత్నిస్తాడు. లిపిలో రాసిన అంశానికైనా ఇది వర్తిస్తుంది. ఇదే విషయం పిల్లల కథా, కథనాలకు కూడా వర్తిస్తుంది.**

ప్రాథమిక దశలో పిల్లలు పెద్దల మాటలు, కథనాలు వినడానికి అమిత ఆసక్తి చూపిస్తారు. భాషను తెలుసుకోవడానికి, అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. తన చుట్టూ ప్రపంచాన్ని, తెలుసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. తన వ్యక్తిత్వాన్ని మలచుకొనే దశలో ఉంటాడు. ఇటువంటి తరుణంలోనే కథా, కథనాలు పిల్లల మీద ఎంత ప్రభావాన్ని చూపుతాయో మనం అర్థం చేసుకోవచ్చు. కాబట్టి పిల్లవాడికి 0-6 మధ్య వయసు అత్యంత కీలకమైన సమయం. ఈ నేర్చుకొనే దశలో కథా, కథనాలు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తాయి. ఈ దశలో మనం అందించే కథా, కథనాలు ఎంత విలువైనవో మనం అర్థం చేసుకోవాలి.

ఇంకొక సాంకేతిక అంశం. మెదడు ప్రతీ అంశాన్ని నిక్షిప్తం చేసుకుంటుంది. కథా, కథన విధానంలో ఊహ అత్యంత ప్రధానమైన అంశం. పిల్లల మెదడును ఒక ఖాళీ పలకతో పోల్చుకుంటే, పిల్లలు ఎదిగే కొద్దీ వాళ్ళు గ్రహించిన విషయాలు ఒక్కొక్కటీ నిక్షిప్తం అవుతాయి. కాబట్టి మనం వాళ్లకు అందించే కథా, కథన రూపాల విషయంలో ఎంత జాగరూకతతో ఉండాలో అర్థం చేసుకోవాలి. ఇక్కడ కథల ఎంపిక కూడా ప్రధాన పాత్ర వహిస్తుంది.

దాదాపు యుక్తవయసు వచ్చేవరకు నేర్చుకునే దశలోనూ, విషయ అవగాహన దశలోనూ ఉంటాడు. తను నేర్చుకున్న, తెలుసుకున్న అంశాల మీద ప్రయోగాలు చేస్తూ, తన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకుంటాడు. అందుకే మనం బాల్య దశను 0-16 సం.లుగా నిర్ణయించుకున్నాం. ఇంకా చెప్పాలంటే 0-3 సం. ఒక దశ, 3-6 సం. ఒక దశ, 6-8 సం. ఒకదశ, 8-10 సం. ఒక దశ, 10-12 సం. ఒక దశ, 12-16 సం. ఒక దశగా చెప్పుకోవాలి. వాళ్ళు పెరిగేకొద్దీ విషయ అవగాహనాశక్తి కూడా పెరుగుతూ ఉంటుంది. కాబట్టి మన కథా, కథన విధానాలలో కూడా వైవిధ్యం ఉండాలి.

పిల్లలు నేర్చుకొనే క్రమంలో కథా, కథన విషయంలో వైవిధ్యాన్ని ఇష్టపడతారు. మూస విధానాలను ఇష్టపడరు. కాబట్టి ఈ దశలో వైవిధ్యమైన సాహిత్య ప్రక్రియల ద్వారా కథా, కథనాలను అందించాలి. గిజుభాయి 'కథా కథన విధానం' అనే పుస్తకంలో ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెబుతారు. "అనేక కథలు తోటలో కలుపు మొక్కలు లాగ ఉంటాయి. వాటిని ఏరి పారెయ్యాలి." అని చాల నిక్కచ్చిగా చెబుతారు. అలాగే నీతి కథలు, సందేశాత్మక కథల విషయంలో కూడా అయన స్పష్టంగా గీత గీచారు. **"ఉపదేశ కథలు, నీతి కథలు పిల్లలకు నష్టం కలిగిస్తాయి. వాళ్ళు తమ వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. వాళ్లకు బానిస మనస్తత్వం ఏర్పడుతుంది. స్వతంత్ర ఆలోచనలకు బదులు ఇతరుల అభిప్రాయాలను అనుకరిస్తారు. పిల్లలు నీతివంతులు కాకపోగా నైతిక వృత్తాంత బరువుతో అమాయక ప్రాణులుగా మిగిలిపోతారు."** అని నీతికథల విషయంలో తన స్పష్టమైన భావాలను ఆ పుస్తకంలో వెల్లడిస్తారు.

ఈ విషయంలో నా అనుభవంలో జరిగిన ఒక సంఘటనను వివరిస్తాను. ఒకసారి "నీటి పాత్ర" అనే బొమ్మల కథల పుస్తకంలోని కథను 3వ తరగతి పిల్లలకు చెబుతున్నాను. ఒక వేపచెట్టు తొర్రలో మైనా అనే పిట్ట ఉంటుంది. దానికి దగ్గరలో ఒక నీటి కొళాయి ఉంటుంది. మైనా ఆ కొళాయిలో ప్రతిరోజూ నీళ్ళు తాగుతుంది. వేసవిలో ఒక రోజు ఆ కొళాయిలో నీళ్ళు రావు. నీళ్ళకోసం వెతుక్కుంటూ వెళుతుంది. దారిలో ఒక రామచిలుకను, పావురాన్ని కలుస్తుంది. మూడూ కలసి నీళ్ళకోసం వెతుక్కుంటూ వెళతాయి. ఒకచోట పిచుకలు, చిలకలు, ఉడుతలు నీళ్ళు తాగుతూ, స్నానం చేస్తూ ఉంటాయి. అక్కడ ఒక ఇంటి పెరటిలో ఒక పెద్ద నీటి పాత్ర నీటితో నింపి ఉంటుంది. ఇవికూడా అక్కడ నీళ్ళు తాగుతాయి. అక్కడ ఆ నీటి పాత్రను ఎవరు పెట్టారని మైనా అడుగుతుంది. ఒక చిన్న పిల్లవాడు ఈ పాత్రను రోజూ నీటితో నింపుతాడు అని చెబుతుంది ఒక పిచుక. ఆ కథ అంతటితో ముగుస్తుంది. ఆ కథ చెప్పిన పక్కరోజు నుండి పిల్లలు రకరకాల కథనాలు చెప్పుకుంటూ వచ్చారు. మేము మా ఇంటి పెరటిలో నీటిపాత్ర పెట్టామని పిల్లలందరూ చెప్పారు. ఇలా ఒక్కొక్కరు వచ్చి తమ ఇంట్లో కాకులు, చిలకలు, ఉడుతలు వచ్చి నీళ్ళు తాగాయని చెప్పారు. ఇంకొకరు కోతులు వచ్చి నీళ్ళు తాగాయని చెప్పారు. ఇలా చాలా రోజులు పిల్లల కథనాలతో నడిచింది. ఇంతకంటే ఒక కథకు ప్రయోజనం ఏమి ఉంటుంది. ఇక్కడ నేను చెప్పదలుచుకొన్న విషయం ఏమిటంటే, **కథలు ఎంత ముఖ్యమో, కథల ఎంపిక కూడా అంత ముఖ్యం అనే.**

మనం పై కథను పరిశీలించినపుడు కథ మొదట్లో గాని, చివర గాని నీతి వాక్యాలు చెప్పలేదు. ఆ కథలో కూడా నర్మగర్భంగా ఒక సందేశం ఉంది. ఆ సందేశం ఆ కథ ద్వారా పిల్లలకు అందింది. కథ ప్రయోజనం పిల్లల వ్యక్తిత్వంలో మార్పు అనుకుంటే, ఆ కథ ద్వారా ఆ ప్రయోజనం నెరవేరినట్లే కదా!!

-వ్యాస రచయిత బాలసాహితీవేత్త

# 'తానా' నిర్వహణలో తెలుగు కార్టూన్ల పోటీ



**వి**జయవాడలో కార్టూనిష్టుల పండుగలాగా 'సరసి'గారికి తాపీ ధర్మారావు పురస్కార సభ జరిగింది. మళ్లీ ఇప్పుడు మళ్లీ రెండు నెలలు గడవగానే 'తానా' వారి ఆధ్వర్యంలో జరిగిన కార్టూన్ల పోటీ సందర్భంగా 60 మంది కార్టూనిస్టులతో సభజరిగింది. రెండు సందర్భాలూ తెలుగు భాషోద్యమానికి సంబంధించినవే కావడం విశేషం.

జనవరి 22న, ఆదివారం విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో ఉత్తరఅమెరికా తెలుగుసంఘం (తానా) సాహిత్య విభాగం–"తానా ప్రపంచసాహిత్య వేదిక" ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో "తెలుగు భాష, సంస్కృతిపై" నిర్వహించిన కార్టూన్ల ప్రదర్శన, కార్టూన్ల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవంతోపాటు, తానా కార్టూన్ల ఈ–పుస్తకాన్ని ముఖ్యఅతిథి హైకోర్ట్ న్యాయమూర్తి యు. దుర్గా ప్రసాదరావు ఆవిష్కరించారు. సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కౌముది పత్రిక ఎడిటర్ కిరణ్ ప్రభ, ఆం.ప్ర. శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విజేతలకు బహుమతులందజేశారు. తానా ప్రపంచ సాహిత్యవేదిక నిర్వహకులు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ... వ్యంగ్యచిత్రకళ (కార్టూన్) కూడా చాలా శక్తమంతమైన కళ. వివరణ అవసరం లేకుండా సూటిగా, సంక్షిప్తంగా, విషయాన్ని పాఠకుడి హృదయానికి హత్తుకునేలా చేసే గొప్ప కళా మాధ్యమం కార్టూన్. అలాంటి కార్టూన్ కళ ద్వారా తెలుగు భాష, సంస్కృతి యొక్క ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాలని, మన భాష, సంస్కృతుల పట్ల మనం చూపుతున్న నిర్లక్ష్యం వల్ల మనం ఎలాంటి దుష్పరిణామాలనెదుర్కోవాల్సి వస్తుందో తెలియజేయాలని తానా ప్రపంచసాహిత్యవేదిక ఆధ్వర్యంలో ఈ కార్టూన్ పోటీలు నిర్వహించామన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... భాషను కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపైనా వుందన్నారు. మాతృభాషలో విద్యాబోధన కోసం మనందరం పోరాడాలన్నారు. తెలుగు భాషోద్యమ సందేశాన్ని వెల్లడిచేస్తూ 200కు పైగా కార్టూన్లను వేసినందుకు తాపీధర్మారావు పురస్కారాన్ని పొందిన 'సరసి' ప్రత్యేకంగా ఈ సభలో పాల్గొనీ మాట్లాడారు. తెలుగు భాషోద్యమాన్ని అందరూ బలపరచాలని. అందుకోసమే తాను ప్రతినెలా 'అమ్మనుడి'లో కార్టూన్లు వేస్తున్నానని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన కార్టూన్ ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. అత్యుత్తమ కారూన్ల విభాగంలో విజేతలు–12 మంది (ఒక్కొక్కరికి 5,000/– రూ. నగదు బహుమతి), ఉత్తమ కార్టూన్ల విభాగంలో విజేతలు –13 మంది (ఒక్కొక్కరికి 3,000/– రూ. నగదు బహుమతి) మొత్తం 25 మందికి లక్ష రూపాయల నగదు బహుమతులు. ఈ సభలో కార్టూన్ పోటీ నిర్వహణ కమిటీ సభ్యులు కళాసాగర్, సరసి, కలిమిశ్రీ తో పాటు 60 మంది కార్టూనిస్టులు పాల్గొన్నారు.

– యల్లపు కళాసాగర్

# చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు యువ పరిశోధకులు ముందుకు రావాలి: ఆచార్య వకుళాభరణం




చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు యువ పరిశోధకులు ముందుకు రావాలని ప్రముఖ చరిత్రకారులు ప్రొఫెసర్ వకుళాభరణం రామక్రిష్ణ పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన 45వ ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సెషన్స్ జనవరి 8 ఆదివారం సాయంత్రం ముగిసింది. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధకులు వంద మంది పరిశోధనపత్రాలను సమర్పించారు. ప్రొఫెసర్ కంకణాల రంగయ్య నేతృత్వంలో జరిగిన ముగింపు సభలో వకుళాభరణం రామకిష్ణ మాట్లాడుతూ. చరిత్ర రచన ప్రమాదంలో పడిందని, దానికి జీవం పోయాల్సిన బాధ్యత పరిశోధకులపై, నేటి యువతపై ఉందన్నారు. హిస్టరీ కాంగ్రెస్ పరిశోధన పత్రాల సమర్పణలో నాణ్యతలో రాజీ పడదనే విషయాన్ని గుర్తుచేశారు.

డాక్టర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరానికి చరిత్ర అవసరం గురించి విశ్లేషించారు. లోకల్ కార్యదర్శి ప్రొఫెసర్ గంగయ్య రెండురోజుల సెషన్స్‌లో పురాతన ఆంధ్రప్రదేశ్ చరిత్ర, మధ్యయుగ చరిత్ర, ఆధునిక స్థానిక చరిత్రలపై లోతైన పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ఏపీలోని పలు జిల్లాల నుంచి హిస్టరీ కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఎంపిక చేశారు.

**నూతన కార్యవర్గం**

అధ్యక్షులు ప్రొఫెసర్ కిరణ్ కాంత్ చౌదరి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఏఆర్ రెడ్డి, కేవీ రమణమూర్తి, డాక్టర్ బీఆర్ ప్రసాదరెడ్డి, ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులు కొల్లూరు సూర్యనారాయణ, డాక్టర్ రఘు. డాక్టర్ సురేంద్ర, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు డాక్టర్ అరవిందకుమార్, డాక్టర్ ఎన్.క్రిష్ణారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఖాజావలి, డాక్టర్ ఎస్.మహబూబాబాషా, డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ బడేసాహెబ్, డాక్టర్ సయ్యద్ నూర్ అహ్మద్, డాక్టర్ హెచ్.రాజమహ్మద్, సుధాకర్, సోమశేఖర్, లక్ష్మి రూపవాణి, లీలావతి, కె. గంగయ్యలను ఎంపిక చేశారు. చరిత్ర కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఏపీలోని అన్ని ప్రాంతాల వారికి ప్రాధాన్యత కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలుగు అక్షరమే కనిపించని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వేదిక !

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 45వ వార్షిక సభలో వేదికపైన అంతా ఇంగ్లీషే దర్శనమిచ్చింది. ఎక్కడా తెలుగు అక్షరాలు కనిపించవు. నిర్వాహకులంతా చరిత్రకు సాక్షులుగా నిలబడ్డవారే. వారి అజాగ్రత్త ఫలితమిది ! వారెవ్వరికీ ఈ సంగతి తోచలేదంటే విచారించాల్సిన సంగతే. తెలుగు నేలపై జరిగిన ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సభల్లోనే తెలుగును పట్టించుకోలేదంటే ఇక వీరు జాతికి ఏమని సందేశం ఇవ్వగలరు? మరి తెలంగాణలో పరిస్థితి ఏమిటో తెలియదు. ఇలా వ్రాసినందుకు మన్నించండి. ఇకనైనా ఈ విషయమై తగిన జాగ్రత్తలు తీసుకుంటారని ఆశిద్దాం.

ఇలాంటి సందర్భాల్లో పొరుగు రాష్ట్రాల్లోని పరిస్థితిని గమనించండి. సభ జాతీయ స్థాయిదైనా, అంతర్జాతీయ స్థాయిదైనా వారి రాష్ట్ర అధికార భాషలోనే ప్రముఖ శీర్షికలూ, ముఖ్యసమాచారామూ ఉండి తీరాలి. లేకపోతే తప్పుపడతారు. బహుశా సభ జరగదేమో కూడా. మన తెలుగువారిలో ప్రభుత్వాల శిలాఫలకాలపైనా, పరిపాలనలోనూ, అన్ని సందర్భాల్లోనూ తెలుగు కనిపించదు. ఆ సంగతే అధికారులకు పట్టదు. ప్రభుత్వ నేతలు అసలు పట్టించుకోరు! మనం ఎప్పటికి మారతామో?!

పి. వి. సత్యనారాయణరాజు
90524 02000

# తెలుగుదనాన్ని నింపుకొన్న చిత్రం 'జయమ్మ పంచాయితీ'




ఈ మధ్య వచ్చిన చిత్రాలలో తెలుగుదనం కలిగిన చిత్రం 'జయమ్మ పంచాయితీ'. కథలో చాలా అంశాలను స్పృశించారు. నటనలో, దర్శకత్వంలో కొన్ని లోపాలు ఉన్నాయి గానీ– మంచి ప్రయత్నం. నక్సలైట్లు, చేతబడి, కులవివక్ష వంటి విషయాలు ఉన్నా– ఒక స్త్రీ తన భర్తని కాపాడుకోవటం కోసం పడే తపన ప్రధానాంశం. శ్రీకాకుళంలో ఒక గ్రామంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ కథని తయారు చేసుకున్నారు రచయిత, దర్శకుడు విజయ్ కుమార్ కలివరపు. ఈ మధ్య సినిమాల్లో అన్నీ విలాసవంతమైన ఇళ్ళు, విదేశాల్లోని ప్రదేశాలు చూపిస్తూ కేవలం ఐదు శాతం మంది జీవనశైలినే ఎక్కువ చూపిస్తున్నారు. అవి చూసి అదే అసలైన జీవితం అని దాని కోసం ఆశ పడేవాళ్ళు పెరిగిపోతున్నారు. ఏదో చిన్న వ్యాపారమో, వ్యవసాయమో చేసుకుంటూ బతికే బతుకు అసలు బతుకే కాదనే భావన పెరిగిపోతోంది. ఈ చిత్రంలో పల్లె బతుకుని సహజంగా చూపించారు. ఇది మొదట మెచ్చుకోవలసిన విషయం. ఈ చిత్రం ఆమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉంది.

చిత్రం మొదట్లో కృతజ్ఞలు తెలిపే సందేశాల్లో కొన్ని తప్పులు దొర్లాయి. ముఖ్యంగా బాధపెట్టింది 'ధన్యవాదాలు' ఉండాల్సిన చోట 'దన్యవాదాలు' ఉండటం. ఇలాంటివి కాస్త చూసుకోవాలి. లేకపోతే తెలిసీ తెలియని వారు ఇదే సరైన పదం అనుకోవచ్చు. అయినా తెలుగు భాషలో కృతజ్ఞలు వ్రాయటం అభినందించాల్సిన విషయం. కొన్ని చిత్రాల్లో మొత్తం సందేశాలు, శీర్షికలు ఆంగ్లంలోనే ఉంటున్నాయి. మారుమూల ప్రాంతాల్లో సినిమా చూసేవారికి అవి ఏం అర్థమవుతాయి? తెలుగు సినిమా కేవలం విదేశాల్లో ఉన్న తెలుగు వారి కోసం మాత్రమే అన్నట్టు కొన్ని సినిమాలు ఉంటున్నాయి. ఈ పద్ధతి మారాలి.

ఈ చిత్రంలో శ్రీకాకుళం మాండలికంలో వాడే కొన్ని పదాలకు మొదట్లోనే అర్థాలు ఇచ్చారు. ఇది బావుంది. అయితే ఇచ్చిన అర్థాలకు మళ్ళీ ఆంగ్లంలో అర్థాలు ఇవ్వాల్సి రావటం మనం చేసుకున్న దురదృష్టం. 'సిల్లంగి' అంటే 'చేతబడి' అని ఇచ్చి బ్రాకెట్లో 'బ్లాక్ మ్యాజిక్' అని అర్థం చెప్పారు. 'ఈడులు' అంటే 'చదివింపులు, కానుకలు' అని ఇచ్చి బ్రాకెట్లో ఫంక్షన్లలో ఇచ్చే గిఫ్టులు అని అర్థం చెప్పారు. 'చదివింపులు' అనే మాట దాదాపుగా మరుగున పడిపోయింది.

కథ 'సతీ సావిత్రి' నాటకంలోని డైలాగులతో మొదలవుతుంది. భర్తను కాపాడుకునే స్త్రీ కథ అని చెప్పటానికి ఈ పద్ధతి వాడుకున్నారు. జయమ్మది శ్రీకాకుళంలో పెదకోటిపల్లి గ్రామం. తాతల కాలం నాటి ఇల్లు. స్తంభాలు, అరుగుతో ముచ్చటగా ఉంటుంది. అయితే తాకట్టులో ఉంది. భర్త, ఇద్దరు కూతుళ్ళతో సంసారం సాగిస్తూ ఉంటుంది. ఆమె భర్తకి గుండె జబ్బు వస్తుంది. ఆపరేషన్‌కి నాలుగు లక్షలు కావాలి. అప్పు పుట్టదు. ఎలా అని అనుకుంటుండగా ఆమె పెద్ద కూతురు పెద్దమనిషి అవుతుంది. చుట్టాలకు, ఊరివాళ్ళకు భోజనాలు పెట్టి వచ్చిన చదివింపులతో భర్తకి ఆపరేషన్ చేయిద్దామని జయమ్మ ఆలోచన. చదివింపులు అంత ఘనంగా వస్తాయా అని మనకి అనిపించవచ్చు. కథలోకి వెళితే తెలుస్తుంది.

చదివింపులన్నీ గోపీ అనే పిల్లవాడి చేత ఒక పుస్తకంలో వ్రాయిస్తుంది జయమ్మ. వేడుక అయిన తర్వాత లెక్క చూసుకుంటే డెబ్బై ఏడు వేలు వస్తాయి. జయమ్మ గడుసుది. ఎవరెవరు చదివింపులు ఇవ్వలేదో వారి ఇంటికి వెళ్ళి ఈడులు ఎందుకివ్వలేదని అడుగుతుంది. తక్కువ చదివించిన వారిని కూడా నిలదీస్తుంది. ఇంతకీ విషయమేమిటంటే జయమ్మ భర్త ఉదారుడు. చుట్టాలు, ఊరివాళ్ళ ఇళ్ళల్లో ఏ వేడుక జరిగినా ఉదారంగా డబ్బు, బంగారం చదివించాడు. అలాంటి వాడి ఇంట్లో వేడుకకి కొందరు రాకపోవటం, వచ్చినా అతి తక్కువ చదివించటం జయమ్మకి మింగుడు పడదు. 'ఇంటికో పువ్వయితే ఈశ్వరుడికో మాల' అంటుంది. ఊరంతా కలిసి అందరి బాగు కోసం తలో

చెయ్యి వేస్తే ఊరంతా బాగుంటుంది. 'వ్యష్టిర్జీవో సమిష్టిరీశ్వర:' (వ్యక్తి జీవుడు, సమాజం దేవుడు) అనే భావం ఇక్కడ ద్యోతకమవుతుంది.

అందరూ "ఈడులు ఇలా అడగటమేమిటి? ఇష్టమైతే వేస్తాం లేకపోతే లేదు" అంటారు. జయమ్మది ఒకటే వాదన. మా దగ్గర తీసుకున్నప్పుడు మాకు కూడా ఇవ్వాలి కదా అని. ఆలోచించి చూస్తే ఇదీ నిజమే అనిపిస్తుంది. పల్లెల్లో వ్యవహారాలు ఇలాగే ఉంటాయి. ఇచ్చిపుచ్చుకోవటాలు సమానంగా ఉండాలని అందరూ అనుకుంటారు. స్వార్థాలు పెరిగిపోయి కొందరు ముఖం చాటేస్తారు. అలాంటివారిని చూసి అవతలి వారు మనసులోనే తిట్టుకుని ఊరుకుంటారు. జయమ్మ అలా ఊరుకునే రకం కాదు. దాంతో విషయం పంచాయితీ దాకా వెళుతుంది.

గతంలో తగాదాలన్నీ ఊరిపెద్దలే పరిష్కరించేవారు. జయమ్మ గతంలో తాము ఎవరెవరికి ఎంత చదివించినదీ ఊరిపెద్దలకి చెబుతుంది. పంచాయితీ పెద్దలు తమ బాధ్యత నిర్వహిస్తూ జయమ్మకు అందరూ ఈడులు ఇవ్వవలసినదే అంటారు. ఇలా ఊరిపెద్దలే పరిష్కారం చూపిస్తే చాలా తగాదాలు కోర్టు దాకా వెళ్ళవు. న్యాయమూర్తులు కూడా ఇలాంటి మధ్యవర్తిత్వానికే మద్దతు పలుకుతున్నారు. అయితే ఊరిపెద్దలు చెప్పినా ఈడులు అన్నీ రావు. అప్పుడు చందాలు వేసుకుని జయమ్మకి డబ్బు ఇద్దామని అంటారు. కానీ ఆమె ముష్టి తీసుకోవటానికి ఒప్పుకోదు. అంతేకాక వేరే ఇంట్లో శుభకార్యం జరుగుతుంటే జయమ్మ ఈడు ఇవ్వటానికి వెళుతుంది. గడుసుదైనా సంస్కారం కలది జయమ్మ. ఆమెకి రావలసిన డబ్బు వచ్చిందా లేదా అనేది తెలుసుకోవాలంటే చిత్రం చూడాల్సిందే.

వేడుక చేసినరోజు రాత్రి జయమ్మ కుటుంబం బుర్రకథ కూడా పెట్టించటం అబ్బురపరుస్తుంది. ఇలాంటి ఆచారాలు కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఉన్నాయి. అయితే ఇవి కనుమరుగైపోతున్నాయి. అలాగే వేడుక శుభకార్యం అనే పదానికి బదులు ఫంక్షన్ అని వాడటం మామూలైపోయింది. పొద్దున్నే నగరసంకీర్తన చేయటం వంటి ఆచారాలు చూపించారు. క్రైస్తవులు కూడా పొద్దున్నే నగరసంకీర్తన చేయటం, ఒకరికొకరు ఎదురుపడినా ఎవరిదారిన వారు వెళ్ళటం, తర్వాత పంచాయితీ పెద్దలు హిందువుల జనాభా ఎక్కువ ఉన్నచోట క్రైస్తవులు నగరసంకీర్తన చేయవద్దని చెప్పటం, వారు ఒప్పుకోవటం – ఇవన్నీ పల్లెల్లో మారుతున్న వాతావరణాన్ని చూపిస్తాయి. ఓ పక్క శివాలయం ఉత్సవాల్లో రికార్డింగ్ డాన్సులు కూడా జరుగుతాయి. పోలీసులు ఆపటానికి ప్రయత్నిస్తూనే ఉంటారు, అవి జరుగుతూనే ఉంటాయి.

ఉపకథగా శివాలయం యువ పూజారి, రామాలయం పూజారి కూతురి ప్రేమకథ వస్తుంది. అయితే అనుకోకుండా ఇందులో కులాల ప్రసక్తి వస్తుంది. రామాలయం పూజారి ఊరికి కొత్తగా వచ్చిన పూజారి. ఆయన దళితుడు. రాముడి మీద భక్తితో వేదపాఠశాలలో మంత్రాలు నేర్చుకుని అర్చకత్వం చేస్తుంటాడు. అయితే అతని కులం బయటపడగానే అతన్ని పాత ఊరి నుంచి వెలి వేస్తారు. ఈ ఊరికి వచ్చి గుడిలో పూజారిగా చేరతాడు. శివాలయం పూజారి పెళ్ళికి కులం అడ్డు. ఈ పెళ్ళికి జయమ్మ పంచాయితీకి కూడా ముడి ఉంటుంది. శివాలయం పూజారి తనకి అర్చనవిధి సరిగా తెలియకపోయినా వంశపారంపర్యంగా అరాచకత్వం వచ్చిందని, రామాలయం పూజారికి అర్చనవిధి తెలిసినా అతన్ని ఎందుకు నిషేధిస్తున్నారని ప్రశ్నిస్తాడు. అర్హత ఉన్నవారి పట్ల కులవివక్షని ఈ చిత్రం ఎండగడుతుంది.

ఓ పక్కన నక్సలైట్లు తిరుగుతూ ఉంటారు. ఊరిపెద్దలు నక్సలైట్లకు, పోలీసులకి మధ్య నలిగిపోతుంటారు. ఇదంతా గంభీరంగా అనిపించవచ్చు కానీ హాస్యస్ఫోరకంగా చూపించారు. అయితే నక్సలైట్లతో ఊరివారికొచ్చే వివాదం మరీ తేలిగ్గా తేల్చేశాడు దర్శకుడు. ఈ నక్సలైట్ల కథ చిత్రంలో పెట్టడం అవసరమా అనిపిస్తుంది. మరో పక్క చేతబడి జరుగుతోందని ఊరివాళ్ళ నమ్మకం. ఈ మూఢనమ్మకాన్ని తప్పు అని నిరూపించే ప్రయత్నం చేశాడు దర్శకుడు. కథ యొక్క చిత్రానువాదం బావుంది. ఉపకథలు కథాగమనానికి అడ్డుపడుతున్నట్టున్నా చివరికి అన్ని కథలూ ఒకదానితో ఒకటి ముడివేసుకునే ఉంటాయి.

సామెతలు విరివిగా వాడారు. చదివింపులు తక్కువ వచ్చాయని తెలిసినపుడు జయమ్మ 'ఆకులు నాకే వాళ్ళు పోయి మూతులు నాకేవాళ్ళు వచ్చారు' అంటుంది. అంటే కక్కుర్తి పెరిగిందని అర్థం. అయితే ఈ సామెతకి మరో రూపం కూడా ఉంది. అది 'ఆకులు నాకేవారి మూతులు నాకినట్టు'. అంటే తనకే లేక బాధపడుతుంటే తన దగ్గరకి యాచనకి వచ్చాడని అర్థం. 'ఒడ్డు దాటిందాకా ఓడ మల్లయ్య, ఒడ్డు దాటినంక బోడి మల్లయ్య' అని ఇంకో సామెత వాడారు. 'ఎవరి వల్ల సెడ్డావురా ఈరన్నా అంటే నోటివల్ల సెడ్డానురా కాటమరాజా అన్నాట్ట', 'మారాజు కదా అని మనవి సేయమంటే మర్రెండు తన్నమన్నాట్ట' లాంటి పలుకుబడులు ఆహ్లాదంగా ఉన్నాయి.

సుమ కనకాల జయమ్మ పాత్రని బాగా పోషించింది. ఊరిపెద్దలు, మరి కొన్ని పాత్రలు పోషించిన నటులు సహజంగా నటించారు. అయితే కొందరు నటులు అంత బాగా నటించలేకపోయారు. దర్శకత్వం కొన్నిచోట్ల పేలవంగా ఉంది. కీరవాణి సంగీతం చిత్రానికో ఆభరణం. మొత్తానికి ఈమధ్య కాలంలో తెలుగుదనంతో వచ్చిన సినిమా ఇదే అని చెప్పవచ్చు. తెలుగుదనం పేరు చెప్పి పల్లెల్లో ప్రేమకథలు చూపించటం మనం చూశాం. అందుకు భిన్నంగా కొత్తకథని ఎన్నుకుని మంచి ప్రయత్నం చేశాడు దర్శకుడు. నిర్మాత బలగా ప్రకాశ్‌ని అభినందించాలి. అ

# ఇవీ సంగతులు...

**సింధీ భాష, సంస్కృతి, అక్షరాలను పునరుద్ధరించాలి: జైపూర్ లిటరరీ ఫెస్ట్‌లో రచయిత్రి, సాజ్ అగర్వాల్ ఆవేదన**

భారతదేశం నుంచి పాకిస్తాన్ విడిపోయాక సింధ్ భూభాగం పాకిస్తాన్‌లో కలిసిపోయింది. పాకిస్తాన్ ప్రభుత్వ చర్యల వలన సింధు భాష పూర్తి వివక్షకు, నిర్లక్ష్యానికి గురయి, నేడు పలుకుల్లో మాత్రమే ఆ భాష మిగిలి ఉంది. ఈ విషయం గురించి చెబుతూ రచయిత్రి సాజ్ అగర్వాల్ మాతృభాష పదం నిర్వచనం జర్మనీలో పుట్టిందని, బహుభాషా సమాజంలో బ్రతికే భారత ఉపఖండ ప్రజలకు "ఇంటి భాష", "బయటి భాషలు" ఉంటాయే గానీ, పాశ్చాత్యులు ఊహించుకునే రీతిలో మాతృభాష ఉండదని. కొన్ని అంశాల్లో ఆ ఇంటి భాష మాతృభాషను భర్తీ చేస్తుందని ఆమె అన్నారు. విభజనానంతర పాకిస్తాన్ సింధ్ ప్రాంతంలో సింధ్ భాష మాట్లాడే వారు అల్పసంఖ్యాకులయ్యారని, అభద్రత వలన తల్లిదండ్రులు పిల్లలతో సింధ్ భాషలో మాట్లాడడం మానేసారని. అలా పాకిస్తాన్ లో సింధ్ అంతరించే ప్రమాద స్థాయిలో ఉందని అన్నారు. ఇక భారతదేశం సింధ్ భాషను (ప్రాంతాన్ని) తన జాతీయగీతంలో చేర్చుకున్నా, సింధ్ భాషను రాజ్యాంగంలో గుర్తించలేదని, అందువలన సింధ్ భాషీయులు విభజనానంతరం తాము స్థిరపడిన ప్రదేశపు ప్రాంతీయ భాషను తమ భాషగా చేసుకున్నారని ఆమె అన్నారు. 1967లో వచ్చిన రాజ్యాంగపు ఎనిమిదవ షెడ్యూల్ లో సింధ్ భాషను రాజ్యాంగంలో చేర్చి గుర్తింపు ఇవ్వడం వలన సింధ్ భాషా మాధ్యమంగా బడులు వచ్చాయని, అలా సింధ్ భాషలో కొందరైనా చదువుకున్నారని ఆమె అన్నారు. అయితే కొత్త విధానాల వలన సింధీ భాషకు పర్సో-అరబిక్ లిపి స్థానంలో దేవనాగర లిపిని బడుల్లో చెబుతున్నారని, అలా చేయడం వలన కొన్ని పదాలను సింధీ భాష కోల్పోతుందని ఆవిడ ఆవేదన వ్యక్తం చేసారు.

**కొడవ భాషను ఆన్‌లైన్ తరగతుల ద్వారా నేర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ.**

కొడగునాడు(మైసూరు-మడికేరి ప్రాంతం) బయట నివసిస్తున్న కొడవ భాష మాట్లాడే వారికి కొడవ భాష లిపిని, సంస్కృతిని, భాషను ఆన్‌లైన్ విధానంలో నేర్పేందుకు "ఉంబక్ ఎంత" అనే సంస్థ సన్నాహాలు చేస్తోంది. 5 నుంచి 15 ఏళ్ళ మధ్య వయసున్న పిల్లలకు ఉద్దేశించిన ఈ ఆన్‌లైన్ తరగతులకు అధిక సంఖ్యలో పెద్దవాళ్ళు నమోదు చేసుకోవటం విశేషం. ఫిబ్రవరి 4 నుంచి మొదలయ్యే ఈ ఆన్‌లైన్ తరగతుల్లో అంకెలు, అక్షరాలు, చిన్న చిన్న పదాలు, సంభాషణలు నేర్పిస్తారు. హైదరాబాదు, బెంగుళూరు, అమెరికా, ఇంగ్లండ్, హాంగ్‌కాంగ్ నుంచి విద్యార్థులు నమోదు చేసుకున్నారు.

**మాతృభాషను మరవడం ఆత్మహత్యా సదృశం: మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి.**

"మరాఠీ భాష 2000 సంవత్సరాల చరిత్రలో పరిణామక్రమం" పేరుతో రూపొందించిన ఒక చలనచిత్రాన్ని ముంబైలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా చూడటానికి వచ్చిన గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారి, మాతృభాష గురించి మాట్లాడారు. మాతృభాషను మరవడం ఆత్మహత్యాసదృశమని, మాతృభాష మాధ్యమంలో చదవకపోతే విద్యార్థుల మానసిక పెరుగుదల సక్రమంగా ఉండదని ఆయన అన్నారు.

**మాతృభాషలో మాట్లాడినందుకు దండించారు : నైజీరియా విద్యార్థుల ఆవేదన.**

నైజీరియా దేశం ఇటీవలే జాతీయ భాషా విధానాన్ని ప్రకటించింది. ఈ భాషా విధానం ప్రకారం విద్యార్థి మొదటి ఆరు సంవత్సరాలు తన మాతృభాష మాధ్యమంగా చదువుకోవాలని స్పష్టంగా ఉంది. దీంతో అక్కడి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆంగ్ల బోధనలో తాము ఎదుర్కున్న సవాళ్ళ గురించి గొంతు విప్పారు. హబీబుల్లా అనే ఒక విద్యార్థి 2010లో అతను తన మాతృభాషలో యొరుబలో తరగతి గదిలో మాట్లాడినందుకు ఉపాధ్యాయురాలు తనను దండించిందని అతను అన్నాడు. తరగతి గదిలో ప్రశ్నలకు జవాబు తెలిసినా, ఆంగ్లంలో మాట్లాడలేక సమాధానాలు చెప్పలేనందుకు అనేకసార్లు దండనకు గురైనట్టు మరెందరో విద్యార్థులు తమ అనుభవాలు పంచుకున్నారు.

**మాతృభాషలో చదువుకున్న విద్యార్థులు ఇతర భాషలను సులువుగా నేర్చుకుంటున్నారు : పంజాబీ ఉపాధ్యాయురాలు బన్సల్**

ఆంగ్ల మాధ్యమ విద్యార్థులతో పోల్చుకుంటే పంజాబీ మాతృభాషా మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు త్వరగా సంభాషణకు కావాల్సిన ఆంగ్లాన్ని నేర్చుకోగలుగుతున్నారని పంజాబీ ఉపాధ్యాయురాలు బన్సల్ అన్నారు. నేటి ప్రపంచీకరణలో కేవలం ఆంగ్లభాష వస్తే సరిపోదని, ప్రపంచ వాణిజ్య భాషల్లో ఆంగ్లేతర భాష కనీసం ఒకటి తెలిస్తేనే ఉద్యోగాల్లో రాణించగలమని ఆవిడ అన్నారు. తన తరగతి గదిలో విద్యార్థులకు సంభాషణా స్థాయి ఆంగ్లాన్ని నేర్పినపుడు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకన్నా మాతృభాషా మాధ్యమ విద్యార్థులు త్వరగా నేర్చుకున్నారని ఆవిడ అన్నారు.

**ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, బాంగ్లా ప్రజలు బాంగ్లా భాషా మాధ్యమంగా చదువుకునేలా చర్యలు తీసుకుంటాం:మమత బెనర్జీ**

కోల్‌కతాలో సరస్వతి పూజ సందర్భంగా పశ్చిమబంగ ముఖ్యమంత్రి మమత బెనర్జీ మాట్లాడుతూ బాంగ్లా భాష ప్రపంచంలో మాట్లాడే జనసంఖ్య పరంగా ఐదవ పెద్ద భాష అని, ఆసియాలో రెండవ అతిపెద్ద భాష అని అన్నారు. ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, బాంగ్లా ప్రజలు బాంగ్లా భాషామాధ్యమంగా చదువుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె అన్నారు.

**ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్లమే తమిళులను ముందంజలో ఉంచింది, హిందీ కాదు : దురై వైకో**

ఎండిఎంకె నాయకుడు దురై వైకో మాట్లాడుతూ, అమిత్ షా చెప్పినట్టు ఆంగ్లాన్ని హిందీతో భర్తీ చేసి చదువుల్లో ప్రభుత్వ వ్యవహారాల్లో మార్పు చేస్తే తమిళులకు అన్యాయం జరుగుతుందని. ప్రపంచీకరణ నేపథ్యంలో తమిళులకు ఆంగ్లమే ఆసరాగా ఉందని, హిందీ నేర్చుకునుంటే వెనుకంజలో ఉండేవాళ్ళమని ఆయన అన్నారు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# వేమన పద్యాలు తెలుగుజాతి సంపద





సభలో ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ శ్రీ కె.ఎస్.లక్ష్మణరావు, సోషలిస్టు నేత శ్రీ పాపిరెడ్డి

**వేమన** మృతిచెంది ఏళ్లు గడిచినా తన పద్యాల ద్వారా ఇంకా సజీవంగా ఉన్నారని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. చుండూరు మండలం మోదుకూరులో వేమన సాహిత్యవికాస పరిషత్తు ఆధ్వర్యంలో వేమన జయంత్యుత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమన పూర్వకాలంలో రాసిన పద్యాలు నేటికీ మానవ సంబంధాలు, కుటుంబ బాంధవ్యాలను తెలియజేస్తున్నాయని చెప్పారు. ఆంగ్లేయుడైన సీపీ బ్రౌన్ ప్రజాకవి వేమన రాసిన పద్యాలను తెలుగుజాతికి సంపదగా అందించారని వివరించారు. విద్యార్థులు, యువతలో మార్పు తీసుకురావడానికి తన వంతుగా వేమన 100 మంచి పద్యాలను లక్ష కాపీలు ముద్రించి పంచిపెడతానని చెప్పారు.

**నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా..** స్థానిక వేమన సాహిత్య వికాస పరిషత్తు భవనాన్ని గ్రంథాలయంతో పాటు నేటి యువత ఉపాధి కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా వినియోగిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ విషయంలో కమిటీ సభ్యులు అవసరమైతే ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

అనంతరం వికాస పరిషత్తు కమిటీ అధ్యక్షుడు తియ్యగూర సీతారామిరెడ్డి ముద్రించిన గౌతమబుద్ధుని శిష్యులు సారిపుత్ర మొగ్గల్లాయనుల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**పద్య పోటీల విజేత మందూరు బాలిక..** ఉమ్మడి గుంటూరు జిల్లాలో 21 పాఠశాలల నుంచి 169 మంది విద్యార్థులు వేమన పద్య పఠన పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో మొదటి బహుమతి మందూరు పాఠశాలకు చెందిన విద్యార్థిని జె. రత్నశ్రీ, మోదుకూరుకు చెందిన శ్రావ్య, పొన్నూరుకు చెందిన జాహ్నవి ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. సంగీత కళాకారిణి దివ్యశ్రీ విశిష్ట బహుమతి సాధించారు. మరో పదిమంది కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. కార్యక్ర మంలో వేమన సాహిత్య వికాసపరిషత్తు కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, సాహితీవేత్త మోదుగుల పాపిరెడ్డి, మాజీ సర్పంచి ఎం. సాంబిరెడ్డి, చుండూరు మండల పరిషత్తు ఉపాధ్యాక్షుడు వెంకటరమణ రెడ్డి, నిర్వాహకులు కె.ఎల్. వాసునాయక్, ఇ. నాగేశ్వరరావు, రామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లా మైదుకూరులో వేమన జయంతి

ప్రజల జీవన స్థితిగతులను, సామాజిక రుగ్మతలను, తాత్వికతను, మార్మికతను ప్రజాకవి వేమన తన పద్యాలద్వారా విడమరిచి చెప్పారని ప్రముఖ రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు తవ్వా ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా వేమన ఫౌండేషన్, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు సమాజం సంస్థల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరులోని జిల్లా



పరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానో పాధ్యాయురాలు రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో తవ్వా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలను ఆంగ్లేయుడైన సిపిబ్రౌన్ వెలుగుతీసుకువచ్చారని, వేమనను జాతీయకవిగా గుర్తించాలని ఆయన కోరారు. అనంతపురానికి చెందిన వేమన ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాలలోని వంద పాఠశాలల్లో వేవన జయంతి నిర్వహణకోసం పతకాలను, ధృవపత్రాలను, వేమన సాహిత్య పుస్తకాలను అందచేసినందుకు సంస్థ నిర్వాహకుడు అప్పిరెడ్డి హరినాథరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా నిర్వహించిన పద్యపోటీలలో విజేతలైన విద్యార్థులకు పతకాలను, ధృవపత్రాలను, పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా వేమన వర్ణచిత్రాన్ని చిత్రించిన పాఠశాల విద్యార్థి టి. నాగేంద్ర ను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
FEBRUARY 2023 Vol :8, Issue 11
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలతో...

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532
స్థాపితం : 2001

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, తెనాలి - 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 - 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) అంగలకుదురు ఫోన్ : 08644 - 233299
2) కొల్లూరు ఫోన్ : 08644 - 243788
3) బాపట్ల ఫోన్ : 08643 - 224051
4) కొల్లిపర ఫోన్ : 08644 - 245399
5) రేపల్లె ఫోన్ : 08648 - 222388
6) మంగళగిరి ఫోన్ : 08645 - 231255
7) చెరుకుపల్లి ఫోన్ : 08648 - 294422
8) పొన్నూరు ఫోన్ : 08643 - 294400
9) గుంటూరు ఫోన్ : 0863 - 3500785

2023
మార్చి 8వ తేదీన
7/1 అరండల్‌పేట
గుంటూరులో
ప్రారంభం

## ఖాతాదారులకు మా సేవలు

సేవింగ్స్ ఖాతాలపై ........ 5.0%
30 రోజుల నుండి 45 రోజుల వరకు ........ 5.0%
46 రోజుల నుండి 90 రోజుల వరకు ........ 6.0%
91 రోజుల నుండి 180 రోజుల వరకు ........ 6.5%
181 రోజుల నుండి 1 సంవత్సరము వరకు ........ 7.0%
13 నెలల పై కాలము నుండి 24 నెలల వరకు ........ 8.5%

అప్పులు
బంగారు వస్తువుల హామీపై
ప్రతిరోజూ గ్రాముకు రూ. 3,500/-లు
చొప్పున 11.5% తక్కువ వడ్డీకి అప్పులివ్వబడును
ఇళ్ళు ఇళ్ళ స్థలాలు, ఇతర స్థిరాస్తుల హామీపైన
మరియు పర్సనల్ లోన్స్ 15%
వడ్డీకి ఇవ్వబడును

డిపాజిట్స్ పై సీనియర్ సిటీజన్స్‌కు
ఒక శాతం అదనపు వడ్డీ

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్

లాకర్స్ సదుపాయం కలదు



పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ అంబటి పోతురాజు, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ వి.వి.వి. శివప్రసాదరావు, డైరెక్టర్



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి
చరవాణి : 93478 96473

అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.
డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244